అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదివారం 2-4-2023

సంపుటి : 9 | సంచిక : 91 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు + (వెబ్‌లో సోపతి) | వెల : 8.00

జీఎస్టీ వసూళ్లు రూ.1,60,122 కోట్లు

ఏపీలో రూ.3,532 కోట్లు, తెలంగాణలో రూ.4,804 కోట్లు వసూలు



న్యూఢిల్లీ :మార్చి నెలలో రూ.1,60,122 కోట్లు జీఎస్టీ వసూలైందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేసింది. అందులో రూ.29,546 కోట్లు సిజిఎస్‌టి, రూ.37,314 కోట్లు ఎస్‌జిఎస్‌టి, రూ.82,907 కోట్లు ఐజిఎస్‌టి (వస్తువులను దిగుమతిపై రూ.42,503 కోట్లు), రూ. 10,355 కోట్లు సెస్ (వస్తువులు దిగుమతిపై రూ.960 కోట్లు) వసూలు అయినట్లు తెలిపింది. గతేడాది మార్చి (రూ.1,01,983 కోట్లు)తో పోల్చితే ఇప్పుడు 14.39 శాతం వసూలు పెరిగిందని ...5లో

ఒకే ఒక్కడు...

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మెరుపు ధర్నా

- ఇందిరాపార్క్ వద్ద ఒంటరిగా బైఠాయింపు, నిరసన
- సీఎం హామీమేరకు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్
- అరెస్టు చేసిన పోలీసులు
- పలు సంఘాల ఖండన



నర్సిరెడ్డి దీక్ష, అరెస్టు చేస్తున్న పోలీసులు

ఏ పోరాటమైనా ఒక్కడితోనే ప్రారంభమవుతుందంటారు. కానీ ఇక్కడ ఒక్కడే అందరి తరపున నిలబడ్డాడు. సమస్యకు మూలం వెతికి ఒక్కడిగానే నిరసనకు దిగాడు. మందీ మార్బలం లేదు. పోరాట స్ఫూర్తి మాత్రమే ఉంది. సమస్యను సర్కారు దృష్టికి తీసుకెళ్లాలనే తపనా ఉంది. సీఎం కేసీఆర్ స్వయంగా ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయట్లేదంటూ ఒంటరిగా రోడ్డెక్కారు. ప్లకార్డు ప్రదర్శిస్తూ, ఒక్కడే గొంతెత్తి నినాదాలు చేస్తూ నడిరోడ్డుపై కూర్చుండిపోయాడు. ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. ట్రాఫిక్ నిలిచింది. వాహనదారులు ఏం జరిగింది అని ఆరా తీయడం కనిపించింది. పోలీసుల్లో కదలిక మొదలైంది. ఏమైందంటూ ట్రాఫిక్‌ను తోసుకుంటూ ముందుకొచ్చారు. తెల్లటి ప్యాంటు, షర్టు వేసుకున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నల్లటి డాంబర్ రోడ్డుపై ఒంటరిగా కూర్చుని నినాదాలు చేస్తున్నారు. పోలీసులకు విషయం అర్థమయ్యేసరికి అర్థగంట దాటింది. ఈలోపు అక్కడంతా హడావిడి. సహజంగా ధర్నాలు, నిరసనలు అంటే కనీసం 20, 30 మంది అయినా జమై, నినాదాలు చేస్తుంటారు. కానీ ఇక్కడ నర్సిరెడ్డి ఒక్కరే నడిరోడ్డుపై కూర్చుని నిరసనకు దిగారు. దీనికి ఇందిరాపార్కు రోడ్డు వేదికైంది. పోలీసులు వచ్చి ఆయన్ని బతిమిలాడారు. అక్కడి నుంచి వెళ్లాలని ఆదేశించారు. 'తగ్గేదేలే' అంటూ నర్సిరెడ్డి తన పాటికి తాను నినాదాలు చేస్తూనే ఉన్నారు. జనం ఒక్కసారిగా ఆయన్ని చూడటానికి ముందుకొచ్చారు. నిరసన తీవ్రమవుతుందని గ్రహించిన పోలీసులు బలవంతంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డిని జీపులో ఎక్కించుకొని వేగంగా అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. ...5లో

శతాబ్దాల సంగీత కళ..

మతతత్వానికి బలి

- హిందూవుల పండగల్లో మూగబోతున్న ముస్లింల అరుదైన కళా ప్రదర్శనలు
- జీవనోపాధి కరువై కళాకారుల ఇక్కట్లు

ఓ అరుదైన సంగీత జాతి మతతత్వానికి బలైపోతున్నది. హిందూవుల ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ముస్లిం జోగిలు వినసొంపైన పాటలు ఆలపించే ఓ అరుదైన చరిత్ర కనుమరుగైపోతున్నది. సామాన్యులకు సైతం అర్థమయ్యేరీతిలో ఇతిహాసాలు వల్లించే ఓ చారిత్రకక్రమం క్రమంగా అంతరించిపోతున్నది. ఈ దేశంలో మతాతీతమైన సామరస్యానికి ప్రతీకగా నిలిచే సంగీత కచేరీ కనిపించకుండా పోతున్నది. ఇదంతా కేవలం ఇటీవల ప్రబలుతున్న మత విద్వేషాల కారణంగానే. ఈ మతతత్వం తీరుతో ముస్లిం జోగిలకు జీవనోపాధి కరువైపోవడమే కాదు..ఓ అద్భుత సంగీత ప్రస్థానమే ఆగిపోతున్నది.



మత విభజన ఒకనాటి కళావైభవానికే పాతరేస్తోంది.


న్యూఢిల్లీ : భారత్‌లో శతాబ్దాలుగా వర్ధిల్లి, తమ కచేరీలతో నిత్యం బిజీగా ఉండే ముస్లిం జోగిల సంగీతం మూగబోతున్నది. వారి జీవితం ప్రాధాన్యతను కోల్పోతున్నది. ముస్లిం జోగిలు అయినప్పటికీ హిందువుల ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పాటలు పాడటం, ఇతిహాసాలు విప్పి చెప్పటం, సంగీత కచేరిలు నిర్వహించడం వీరి ప్రత్యేకత. ఈ దేశంలో మతాతీమైన సామరస్యానికి ఇది ఒక చారిత్రక ప్రతీక. కానీ, కళకు మతం రంగు పులిమి ఈ సామరస్యానికి విఘాతం కలిగించడం నేటి విషాదం. ముఖ్యంగా, రాజస్థాన్, హర్యానాలలోని పలు ప్రాంతాలలో వీరు ప్రసిద్ధిగాంచారు. ఏకధాటిగా 12 గంటల పాటు కథలను విప్పి చెప్పగలిగే సామర్థ్యం వీరి సొంతం. అయితే, ఆ సంగీత కచేరీలు ఇప్పుడు మసకబారుతున్నాయి. "ముస్లిం జోగీల సంస్కృతి, చరిత్ర అసాధారణమైనది. కొన్ని శక్తులు దానిని అర్థం చేసుకోలేవు" అని న్యూఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేకి దూరంగా ఉన్న గ్రామమైన పినాన్‌కు చెందిన అనుభవజ్ఞుడైన జోగి జుమ్మెఖాన్ విలపించాడు.

మారుతున్న పరిస్థితులకుతోడు మతతత్వ ప్రభావం ముస్లిం జోగీలను మరింత ప్రమాదపు అంచుల్లోకి నెట్టివేసింది. ఇటీవల ఫిబ్రవరిలో గోరక్షకుల చేతుల్లో హత్యకు గురైన ఇద్దరు ముస్లిం యువకులను గుర్తుచేసుకుంటూ " కైసో ఆయో జమానో బైమాన్" అనే పాట రాయడం ద్వారా జుమ్మెఖాన్ చాలా కలవరపడ్డాడు. కొన్నేండ్లుగా జరుగుతున్న ఘటనలు తమ సంప్రదాయాన్ని, సమాజంలో తమ స్థానాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భయానకంగా ఉన్నదని చెప్పారు. చారిత్రాత్మకంగా రాజస్థాన్, హర్యాలోని ప్రాంతమైన మేవాట్‌లో మియోస్, నాథ్ జోగిలు ...2లో

కళకు కులం, మతం ఉండదు....

రాజస్థాన్‌లోని అల్వార్, హర్యానాలోని నుహ్ మధ్య మేవాట్‌కు ఇరువైపులా జోగి కుటుంబాలతో జరిపిన ఇంటర్వ్యూల ద్వారా వీరి అరుదైన సంగీత జ్ఞాపకాలు వేగంగా మసకబారుతున్నాయని తెలిసింది. హర్యానా మేవాట్ ప్రాంతంలో హిందూ జోగిలు కూడా ఉంటారు. అయితే, వీరి మధ్య కొన్ని విద్రోహక శక్తులు విభజన తీసుకురావడంతో ఈ ప్రమాదం ఏర్పడుతున్నదని అక్కడి జోగిలు ఆందోళన వ్యక్తం చేశారు. కళకు మతం రంగు పులమడం సరికాదనీ, కళాకారుడికి మతం, కులం, ప్రాంతంతో సంబంధం ఉండదన్న విషయాన్ని గుర్తించాలని చెప్పారు.





3 నెలలు ఎండలే




- అప్రమత్తంగా ఉండాల్సిందే
- హెచ్చరించిన ఐఎండీ

న్యూఢిల్లీ: దేశంలోని అనేక ప్రాంతాల్లో ఏప్రిల్ నుంచి జూన్ వరకు సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. బీహార్, ఝార్ఖండ్, ఉత్తర ప్రదేశ్, ఒడిశా, బంగాల్, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగే ఛాన్స్ ఉందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు. ఇటీవలె కొన్ని రాష్ట్రాల్లో వర్షాలు కురిసినా మరికొన్ని ప్రాంతాల్లో ఎండలు మండుతున్నాయి. రాత్రి సమయాల్లో వాతావరణం కాస్త చల్లగా ...5లో

24 గంటలు..
3095 కేసులు..

- ఆరు నెలల్లో ఇదే అత్యధికం
- కరోనా పట్ల అప్రమత్తం కండి
- పలు రాష్ట్రాలకు కేంద్రం హెచ్చరిక



వివరాలు 2లో..

రైతులల్లారా..ఐక్యమవ్వండి..

గిట్టుబాటు ధరల కోసం ఇంకెంత కాలం కొట్లాడాలి..?

- పంజాబ్, యూపీ ఎన్నికల కోసమే నల్ల చట్టాల ఉపసంహరణ ప్రకటన
- రైతు సమస్యలపై ప్రధానికి చిత్తశుద్ధి లేదు : మహారాష్ట్ర రైతు నేతల సమావేశంలో సీఎం కేసీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతులు సంఘటితంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ అన్నారు. రైతుల సమస్యలపై ప్రధాని మోడీకి చిత్తశుద్ధి లేదని చెప్పారు. రైతుల బాధలు తెలిసిన నాయకులే వారి సమస్యలు పరిష్కరిస్తారన్నారు. తెలంగాణలో రైతుల సమస్యలు పరిష్కారమైనప్పుడు..మహారాష్ట్రలో ఎందుకు పరిష్కారం కావని కేసీఆర్ ప్రశ్నించారు. రైతుల పట్ల మహారాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని చెప్పారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన రైతు సంఘాల నాయకులతో శనివారం తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ సమావేశమయ్యారు. ఆ రాష్ట్రంలో రైతుల కష్టాలను రైతు నాయకులు వివరించారు. రైతు సంక్షేమం కోసం తెలంగాణ ...5లో

పేపర్ లీకేజ్ కేసులో లింకులపై ఆరా

టీఎస్‌పీఎస్సీ పనితీరుపై ప్రశ్నలు?

- కార్యదర్శి అనితా రామచంద్రన్, సభ్యుడు లింగారెడ్డిని విచారించిన సిట్



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో సిట్ దర్యాప్తు చర్చనీయాంశంగా మారింది. విచారణలో రోజుకో లింకులు బయటకు రావడం మరింత ఆసక్తిగా మారింది. టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనిత రామచంద్రన్, కమిషన్ సభ్యులు లింగారెడ్డిని సిట్ అధికారులు శనివారం వేర్వేరుగా విచారించారు. టీఎస్‌పీఎస్సీ పనితీరుతోపాటు ఉద్యోగాల నియామకాలు, పేపర్ లికేజీ, ప్రవీణ్‌కు సంబంధించిన వివిధ అంశాలపై సిట్ అధికారులు ఇద్దరినీ ప్రశ్నించినట్టు తెలుస్తోంది. సంచలనం రేపిన ఈ కేసులో విచారణకు రావాలంటూ టీఎస్‌పీఎస్సీ సభ్యులకు సైతం సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనిత రామచంద్రన్, సభ్యుడు లింగారెడ్డి సిట్ విచారణకు హాజరయ్యారు. దాదాపు రెండు గంటలపాటు వారిని అధికారులు ప్రశ్నించి స్టేట్‌మెంట్లను రికార్డు చేసినట్టు తెలిసింది. ఇప్పటికే లింగారెడ్డి పీఏ రమేష్‌ను సిట్ విచారించిన విషయం తెలిసిందే.

టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలోనే సెక్రటరీ ఆధీనంలోనే కాన్ఫిడెన్షియల్ విభాగం మొత్తం నడుస్తోంది. ప్రశ్నాపత్రాల తయారీ, వాటిని భద్రపరచడం ఇలా అన్ని పనులూ ...5లో

రేపటినుంచి టెన్త్ పరీక్షలు



సర్వం సిద్ధం చేసిన అధికారులు

- హాజరు కానున్న 4,94,620 మంది విద్యార్థులు
- 2,652 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- హాల్‌టికెట్ చూపితే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

వివరాలు 5లో..

టోలు తీస్తున్నారు..

వాహనదారులపై పన్నుపోటు

- రాష్ట్ర పరిధిలోని జాతీయ రహదారులపై 32 టోల్‌గేట్లు
- లక్షలాది వాహనాల రాకపోకలు
- ట్రాన్స్‌పోర్ట్ రంగం కుదేలు
- ఆర్టీసీ బస్ చార్జీలపై ప్రభావం
- నిత్యావసరాలు, ఇతర వస్తువుల ధరల భాదుడు

టోల్ చార్జీల బాదుడుకు ట్రాన్స్‌పోర్ట్ రంగం కుదేలవుతోంది. రాష్ట్ర పరిధిలోని వివిధ మార్గాల్లో జాతీయ రహదారులపై 32 టోల్‌గేట్లు ఉన్నాయి. వాటిపై ప్రస్తుతం టోల్‌ట్యాక్స్ రూ.1800 కోట్లకుపైగా వసూలు అవుతోంది. గడిచిన తొమ్మిదేండ్లలో కేంద్రం టోల్‌చార్జీలను భారీగా పెంచుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో వాహనదారులు రోడ్డెక్కాలంటే జంకుతున్నారు. ఇప్పటికే గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. తాజాగా టోల్ చార్జీలు పెంచడంతో రవాణా సరుకుల ధరలు పెరిగే ప్రమాదముంది. సామాన్యులపై భారాలు.. సంపన్నులకు వరాలిస్తున్న మోడీ తొమ్మిదేండ్ల పాలనలో ధరల మోత మోగిస్తున్నారు. జనం విలవిల్లాడుతున్నారు. టోల్ చార్జీల పెంపు అన్ని రంగాలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లాలో మూడు జాతీయ రహదారులున్నాయి. నిత్యం 55వేల వివిధ రకాల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆర్టీసీ బస్సులు, లారీలు, డీసీఎంలు, ట్రక్కులు, ట్యాంకర్లు, కార్లు, జీపులు, మినీ బస్సులు, తేలికపాటి వాహనాలతో పాటు భారీ నిర్మాణ యంత్రాలు నడుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం టోల్ చార్జీలు పెంచడంతో వాహనాలపై పన్ను భారం పడనుంది. హైదరాబాద్ నుంచి పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్ మండలంలోని బైరాన్‌పల్లి మీదుగా ముంబయి-విశాఖపట్నం 65వ జాతీయ రహదారి వెళ్తుంది. ఈ రహదారిపై సంగారెడ్డి జిల్లాలోని మునిపల్లి మండలంలోని కంకోల్ వద్ద డెక్కన్ టోల్‌ప్లాజా ఉంది. అదే విధంగా మెదక్ జిల్లా మీదుగా కశ్మీర్-కన్యాకుమారి వరకు వెళ్లే జాతీయ రహదారి 44 దేశంలోనే అతిపెద్ద నేషనల్ హైవే. తూప్రాన్ వద్ద టోల్ ప్లాజా ఏర్పాటు చేశారు. సంగారెడ్డి జిల్లాలో మరో జాతీయ రహదారి కంది-నాందేడ్ వరకు 161వ హైవే ఉంది. ఈ రహదారిపై చౌటకూరు మండలంలోని తాడ్‌దాన్పల్లి వద్ద టోల్ ప్లాజా ఏర్పాటు చేశారు.



పన్ను పోటు

భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఎఐ) ప్రతి ఏటా టోల్ చార్జీలను 5 నుంచి 10 శాతం వరకు పెంచుతోంది. ఈ ఏడాది కూడా టోల్ చార్జీలను భారీగా పెంచి 2023-24కిగాను ఏప్రిల్ 1 నుంచే అమలు చేస్తోంది. ప్రతి 70 కిలో మీటర్ల వరకు సవరించిన కొత్త టోల్ ధరలు భారీగా పెరిగాయి. గతేడాది 8 నుంచి 15 శాతం వరకు టోల్ చార్జీలు పెంచిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ ఏడాది ఈ నెల ఒకటో తేదీ నుంచి 5 నుంచి 10 శాతం వరకు చార్జీలను పెంచింది. కారు, జీపు, వ్యాన్ తేలికపాటి వాహనాలు ఫాస్టాగ్ ద్వారా ఒకవైపు ప్రయాణానికి రూ.110 చెల్లించాలి. తిరుగు ప్రయాణానికి అంటే చెల్లించిన ...5లో

పెరిగిన ఆర్టీసీ టిక్కెట్ ధరలు

టోల్ చార్జీల భారం ప్రయాణీకులపైనే...

వివరాలు 5లో..

బిజినెస్

మలేషియాతో రూపాయల్లో వాణిజ్యం



న్యూఢిల్లీ: మలేషియాతో భారత ద్వైపాక్షిక వాణిజ్యం ఇక రూపాయల్లో జరుగనుందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శనివారం వెల్లడించింది. ప్రపంచ దేశాల మధ్య అంతర్జాతీయ చెల్లింపులను రూపాయల్లో చేయడానికి గతేడాది జులైలోనే ఆర్‌బిఐ అనుమతులిచ్చింది. దీంతో ఇప్పటికే రష్యా, మారిషాస్, శ్రీలంక దేశాలతో ఎగుమతులు, దిగుమతుల లావాదేవీలు రూపాయల్లో జరుగుతున్నాయి. తాజాగా ఈ జాబితాలో మలేషియా వచ్చి చేరింది. ఇప్పుడు మలేషియాతో వాణిజ్యం ప్రస్తుతమున్న కరెన్సీలతో పాటు రూపాయల్లోనూ జరగనుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇందుకోసం కౌలాలంపూర్‌లోని ఇండియా ఇంటర్నేషనల్ బ్యాంక్ ఆఫ్ మలేషియా, భారత్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో కలిసి ప్రత్యేక రూపీ వోస్ట్రో ఖాతాలను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. విదేశాలతో రూపాయి మారకంతో వాణిజ్యాన్ని నిర్వహించడం ద్వారా దేశ కరెంట్ లోటు, వాణిజ్య లోటు తగ్గడంతో పాటుగా రూపాయికి బలం చేకూరనుంది.

తపాలా శాఖ ఖాతాకు పాన్, ఆధార్ తప్పనిసరి



న్యూఢిల్లీ: సామాన్యులను ఇబ్బంది పెట్టే కేంద్ర ప్రభుత్వ చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే రూ.1000 జరిమానాతో పాన్- ఆధార్‌తో అనుసంధానంపై ఆందోళనలు నెలకొనగా.. తాజాగా చిన్న మొత్తాల ఖాతాల వినియోగదారులను ఇబ్బంది పెట్టే మరో నిర్ణయం తీసుకుంది. తపాలా శాఖలో తెరిచే చిన్న మొత్తాల పొదుపు ఖాతాలకు కూడా పాన్, ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నూతన నిబంధన ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. పిపిఎఫ్, సుకన్య సమృద్ధి యోచన, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సి), సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్, ఇతర ఏ పోస్ట్ ఆఫీసు చిన్న మొత్తాల పొదుపు పథకాలను తెరువడానికి అయినా పాన్, ఆధార్ కార్డ్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆధార్ నంబర్ లేకుండా ఈ ఖాతాలు తెరిచిన ఖాతాదారులు 2023 సెప్టెంబర్ 30 లోగా సంబంధిత కార్యాలయాల్లో ఆధార్‌కార్డ్ సమర్పించాలని స్పష్టం చేసింది. ఇకపై కొత్త ఖాతాలు తెరిచే వారు ఆధార్‌ని తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఒక వేళ ఆధార్ లేకుండా కొత్త అకౌంట్ పొందితే ఖాతా తెరిచిన ఆరు నెలల్లోగా సంబంధిత కార్యాలయంలో ఆధార్ నంబర్ సమర్పించాలి. లేకపోతే ఖాతాను స్తంభింపజేస్తారు. మరోవైపు ఖాతాలో రూ.50వేల కంటే ఎక్కువ నగదు, పొదుపు ఉన్నప్పుడు పాన్ కార్డ్‌ను తప్పనిసరిగా సమర్పించారు. లేదా ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1 లక్ష విలువ చేసే లావాదేవీ చోటు చేసుకున్న పాన్ కార్డ్‌ను తప్పనిసరి చేసింది. ఒక్క నెలలో రూ.10వేల లావాదేవీలు జరిగినా పాన్ ఇవ్వాల్సిందే. నిబంధనలకు అనుగుణంగా పాన్, ఆధార్‌ను సమర్పించనట్లయితే ఆ ఖాతాలను స్తంభింపజేస్తారు.

లూమినస్ నుంచి హైకెపాసిటీ ఇన్వెర్టర్ల విడుదల



హైదరాబాద్ : పవర్ బ్యాకప్, రెసిడెన్షియల్ సోలార్ రంగంలోని లూమినస్ పవర్ టెక్నాలజీస్ కొత్తగా మార్కెట్లోకి అధిక సామర్థ్యం కలిగిన ఇన్వెర్టర్లను విడుదల చేసింది. శనివారం హైదరాబాద్‌లో వీటిని లూమినస్ పవర్ టెక్నాలజీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ గుంజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని ఈ వినూత్న ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చామన్నారు. కంపెనీ నిరంతర ప్రయత్నాలలో భాగంగా వీటిని అందుబాటులోకి తెచ్చామన్నారు. పవర్ బ్యాకప్ పరిష్కారాల్లో తమకు 35 ఏండ్ల అనుభవం ఉందన్నారు. దాదాపు 10 కోట్ల కుటుంబాలు తమ ఉత్పత్తులను వినియోగిస్తున్నాయన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

ఆ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలి

- నియామక ప్రక్రియలో లోపించిన పారదర్శకత
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

న్యూఢిల్లీ : దేశంలోని ప్రభుత్వ పాఠశాల్లో 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సూచించింది. లోక్‌సభకు విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలకు సంబంధించిన శాఖ సంబంధిత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇచ్చిన నివేదికలో ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిందని స్పష్టం చేసింది. కొత్త జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ని సకాలంలో అమలు చేసేందుకు, ఎన్ఈపీలో 30 :1 విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని సాధించడానికి ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ "సమయ పరిమితి పద్ధతిలో" భర్తీ చేయాలని విద్యా మంత్రిత్వ శాఖ (ఎంఓఈ)ని పార్లమెంటరీ ప్యానెల్ కోరింది. విద్యా మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, దేశంలోని ఎలిమెంటరీ, ప్రైమరీ, సెకండరీ, హయ్యర్ సెకండరీ స్థాయిల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 2022 డిసెంబర్ 31 వరకు అన్ని రాష్ట్రాల్లో 62,71,380 పోస్టులు మంజూరయ్యా యని, వాటిలో 9,86,565 (15.7 శాతం) పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది.

ప్రభుత్వ పాఠశాల్లో ప్రాథమిక స్థాయిలో 7,47,565, సెకండరీ స్థాయిలో 1,46,334, హయ్యర్ సెకండరీ స్థాయిలో 92,666 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కమిటీ తెలిపింది. కాబట్టి, 30:1 విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తిని సాధించడానికి సమయానుకూలంగా బోధనా సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడానికి రిక్రూట్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సహించాలని కమిటీ సిఫార్సు చేసింది. ఉపాధ్యాయుల నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ప్యానెల్ ధ్వజమెత్తింది. రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో పారదర్శకత లేదని, "గజిబిజిగా" ఉందని కమిటీ తన నివేదికలో పేర్కొంది. వివిధ విద్యా కమిటీలు సిఫార్సు చేసిన విధంగా రాష్ట్ర స్థాయిలో స్వయం ప్రతిపత్త ఉపాధ్యాయ నియామక బోర్డును ఏర్పాటు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. గతేడాది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకంపై ఇంకా సంతకం చేయని ఎనిమిది రాష్ట్రాలు (బీహార్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కేరళ, ఒరిస్సా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్) సమస్యను పరిష్కరించాలని సూచించింది.

24 గంటలు.. 3095 కేసులు..



- ఆరు నెలల తర్వాత ఇదే అత్యధికం
- మూడు రాష్ట్రాలకు కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ: కరోనా మహమ్మారి మరోసారి చాప కింద నీరులా విస్తరిస్తోంది. ఇటీవల కాలంలో కొత్త కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. రోజువారీ కేసులు వేలల్లో నమోదవుతున్నాయి. తాజాగా గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా కొత్తగా 3095 కేసులు నమోదయ్యాయి. ఆరునెలల తరువాత ఈ స్థాయిలో కేసులు నమోదు కావడం ఇదే మొదటి సారి. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 15028 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కేసులు రోజురోజుకీ పెరుగుతుండడంతో కేంద్ర ప్రభుత్వం అలర్ట్ అయింది. అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేస్తోంది. టెస్టులు, వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించింది. ప్రజలు మాస్కులు ధరించాలనీ, భౌతిక దూరం నిబంధనను కచ్చితంగా పాటించాలని కేంద్రం సూచించింది. ప్రధా నంగా ఉత్తరప్రదేశ్ , మహారాష్ట్ర , ఢిల్లీ, కేరళలో ఇటీవల కాలంలో కరోనా కేసుల్లో పెరుగుదల కనిపిస్తోంది. ఇప్పటివరకు ఎక్స్‌బీబీ వేరియంట్, దాని సబ్ వేరియంట్ కేసులు మాత్రమే నమోదువుతున్నట్టు, కొత్త వేరియంట్ పుట్టుకురాలేదని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇక రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం స్వల్పంగానే కేసులు నమోదవుతున్నాయి. తెలంగాణలో తాజాగా 17 కేసులు నమోదు కాగా, ప్రస్తుతం మొత్తం యాక్టివ్ కేసులు 155 కు చేరాయి. ఏపీలో 6 కేసులు నమోదు కాగా, యాక్టివ్ కేసుల సంఖ్య 71కి చేరింది.

శతాబ్దాల సంగీత కళ..



(మొదటిపేజీ తరువాయి)

మతతత్వానికి బలి పెద్ద కమ్యూనిటీలు. ఇవి 1920లలో తబ్లిఘి జమాత్, హిందూ రైట్ వింగ్ రెండింటి దృష్టిని ఆకర్షించాయి. వీరిలో ప్రతి ఒక్కరు కమ్యూనిటీని దానిలోకి లాగడానికి ప్రయత్నించారు. అయినప్పటికీ సఫలం కాలేకపోయారు. మియోస్‌లో ప్రదర్శకుల నాలుగు వంశాలున్నాయి - జోగిలు, మిరాసీలు (సంగీతకారులు మరియు నత్యకారులు), భండ్‌లు మరియు నాట్‌లు. చివరి ఇద్దరు వారి నటనా నైపుణ్యాలకు ప్రసిద్ధి చెందారు.

కుటుంబ వేడుకలను ఉత్సాహపరచడానికి జోగిలు కీలకంగా ఉంటారు. వారి పాటలను వినడానికి చుట్టుపక్కల ప్రాంతాలవారు కూడా వస్తుంటారు. కానీ అదంతా ఇప్పుడు గతం. నేడు సమాజంలో వారి స్థానం, వారి కళ రెండింటికీ ముప్పు ఏర్పడింది. హిందూ, ముస్లిం అనే మత విభజన ఒకనాటి కళావైభవానికి పాతరేస్తోంది. ఈ ప్రాంతంలోని చాలా మంది జోగిలు తమ సంగీతంతో యూరప్‌కు వెళ్లారు. కానీ, పేదరికంతోనే తిరిగొచ్చారు. నేడు తమ కళతోపాటు జీవితాలనే కోల్పోతున్నారు. ఇలాంటి కళారూపాలు అంతరించిపోవడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఆ కళాకారులకు జీవనోపాధి చూపాలని వేడుకుంటున్నారు.

ఢిల్లీకి వస్తే.. ఏకే-47తో కాల్చేస్తానని బెదిరింపులు

- సంజయ్ రౌత్

న్యూఢిల్లీ: శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్‌కు గ్యాంగ్‌స్టర్ల నుంచి బెదిరింపులు వచ్చాయి. దీంతో ఆయన ముంబయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జైల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి తనకు ఈ బెదింపులు వచ్చాయని ఆయన ఆరోపించారు. పంజాబ్ గాయకుడు సిద్ధూ మూసేవాలా మాదిరిగానే తననూ చంపేస్తామని వారు హెచ్చరించారని రౌత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు."లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో కొందరు నాకు ఫోన్ చేసి బెదిరించారు. ఢిల్లీకి వస్తే ఏకే-47 తుపాకీతో కాల్చి చంపేస్తామని వారు హెచ్చరించారు. మూసేవాలాకు పట్టిన గతే నాకూ పడుతుందన్నారు. దీనిపై నేను పోలీసులకు ఫిర్యాదు చేశా" అని రౌత్ మీడియాకు తెలిపారు.

అయితే ఈ విషయంపై తాను ఫిర్యాదు చేసినా.. రాష్ట్ర ప్రభుత్వం దీన్ని తీవ్రంగా పరిగణించట్లేదని ఆయన ఆరోపించారు. "గతంలోనూ నాకు ఇలాగే బెదిరింపులు వచ్చాయి. కానీ రాష్ట్ర హోంమంత్రి ఇది కేవలం స్టంట్ అని కొట్టిపారేస్తున్నారు. ప్రతిపక్ష నేతల భద్రతను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు" అని రౌత్ వాపోయారు. కాగా.. రౌత్ ఫిర్యాదుపై ముంబయి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బెదిరింపులు వచ్చిన ఫోన్ నంబరును ట్రేస్ చేస్తున్నామని తెలిపారు. ఓ అనుమానితుడిని అరెస్టు చేసి విచారిస్తున్నట్టు పేర్కొన్నారు. కాగా.. ఇటీవల మరో గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ నుంచి బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో శరత్ చంద్రారెడ్డికి బెయిల్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరబిందో శరత్ చంద్రారెడ్డికి బెయిల్ మంజూరైంది. తన భార్య కనికా రెడ్డి అనారోగ్య కారణంగా బెయిల్ కావాలని ఆయన వేసిన పిటిషన్ పై విచారించిన రౌస్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు, నాలుగు వారాల మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న ఆయన త్వరలోనే విడుదల కానున్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో శరత్ చంద్రారెడ్డి కీలక నిందితుడిగా ఉన్నారు. ఆయనకు చెందిన మూడు కంపెనీల ద్వారా రూ.64 కోట్లకు పైగా అక్రమంగా సంపాదించినట్లు ఈడి గుర్తించింది.

అయితే పూచీకత్తుతో పాటు కొన్ని షరతులు కూడా న్యాయస్థానం విధించినట్లుగా తెలుస్తోంది. 2022 నవంబర్ 9న శరత్ చంద్రారెడ్డిని ఈడి అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ఏడాది జనవరిలోనూ శరత్ చంద్రారెడ్డికి కోర్ట్ బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. తన నానమ్మ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బెయిల్ మంజూరు చేయాలని శరత్ చంద్రారెడ్డి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఆయనకు జనవరి 27న 14 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అప్పుడు కూడా రూ. 2 లక్షల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు కొన్ని షరతులు కూడా పెట్టింది. ఈ గడువు ముగిసిన తరువాత ఆయన తిరిగి తీహార్ జైలుకు వెళ్లారు. ట్రైడెంట్ లైఫ్ సైన్సెస్ సంస్థకు శరత్ రెడ్డి డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ సంస్థతో పాటు పలు సంస్థల్లో శరత్ చంద్రారెడ్డికి భాగస్వామ్యం ఉంది. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి ఆయన సౌత్ గ్రూప్‌కు ప్రతినిధిగా ఉన్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్ట్ కేంద్రంగా నగదు బదిలీ అయినట్లుగా ఈడి అభియోగం మోపింది. ప్రైవేట్ జెట్ విమానాల ద్వారా నగదు తరలించినట్లుగా పేర్కొంది. శరత్ చంద్రారెడ్డి భార్య నడుపుతోన్న కనికా టెక్రివాల్ సంస్థ ద్వారా లావాదేవీలు జరిగినట్లుగా తెలిపింది. జెట్ సెట్ గో సంస్థ ద్వారా డబ్బులు బదిలీ అయినట్లుగా పేర్కొంది. ప్రస్తుతం జెట్ సెట్ గో సంస్థ సిఈవోగా శరత్ చంద్రారెడ్డి భార్య పనిచేస్తున్నారు. దీనిపై ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాను ఈడి వివరాలు కోరింది.

కళాక్షేత్రలో లైంగిక వేధింపులు..

- దద్దరిల్లిన తమిళనాడు

చెన్నై: లైంగిక వేధింపుల నిరసనలతో తమిళనాడు దద్దరిల్లుతోంది. ప్రతిష్ఠాత్మక సంప్రదాయ కళల సంస్థ కళాక్షేత్ర ఈ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. ఆ సంస్థలోని అసిస్టెంట్ ప్రొఫెసర్, మరో ముగ్గురు ఆర్టిస్టులు తనపై వేధింపులకు పాల్పడ్డారంటూ ఓ పూర్వ విద్యార్థిని చేసిన ఆరోపణలు వివాదాస్పదంగా మారాయి. లైంగిక వేధింపులు, బాడీ షేమింగ్, దూషణలకు పాల్పడ్డారనే ఆరోపణలపై కొద్దిరోజులుగా దాదాపు 200 మంది విద్యార్థినులు, విద్యార్థులు ఆందోళన చేపడుతున్నారు. ఈ క్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కేసు నమోదైంది. శుక్రవారం 90 మంది విద్యార్థులు రాష్ట్ర మహిళా కమిషన్ చీఫ్‌కు ఫిర్యాదుచేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్‌కు లేఖ రాశారు. తప్పు చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. స్టాలిన్‌తోపాటు కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డికి రాసిన లేఖలో.. ఏండ్లుగా ఈ వేధింపులు, వర్ణ వివక్ష ఎదుర్కొంటున్నామనీ, ఈ ఫిర్యాదులపై యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కళాక్షేత్ర డైరెక్టర్ రేవతి రామచంద్రన్‌ను పదవి నుంచి తొలగించాలని కోరారు. ఇదిలా ఉంటే.. ఇవన్నీ నిరాధారమైన ఆరోపణలు అంటూ జాతీయ మహిళా కమిషన్ తోసిపుచ్చడం గమనార్హం.

వడోదర అల్లర్లపై 'సిట్' దర్యాప్తు

గాంధీనగర్: శ్రీరామ నవమి శోభాయాత్ర సందర్భంగా వడోదరలో చెలరేగిన అల్లర్లపై దర్యాప్తు జరిపేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఏర్పాటయింది. క్రైమ్ విభాగం డీసీపీ సారథ్యంలోని ఐదుగురు సభ్యులతో కూడిన పోలీసు టీమ్ ఈ సిట్‌లో ఉంటుంది. గుజరాత్‌లోని వడోదర సిటీ కుంభద్వార-హాథిఖానా ప్రాంతంలో మార్చి 30న శోభాయాత్ర సందర్భంగా రాళ్ల రువ్వుడు ఘటన చోటుచేసుకుని తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తాయి.

అల్లర్లను ప్రేరేపించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో ప్రమేయమున్నట్టు అనుమానిస్తున్న 23 మందిని వడోదర పోలీసులు అరెస్టు చేశారు. ఐదుగురిని వడోదరలోని స్థానిక కోర్టు పోలీసు రిమాండ్‌కు పంపగా, 19 మందిని జ్యుడిషియల్ కస్టడీలోకి తీసుకున్నారు.

ప్రపంచ గమనం

ప్రపంచీకరణతో సంపద పంపిణీ న్యాయంగా జరగలేదు

అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎమ్ఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్



వాషింగ్టన్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరింపబడిన తరువాత దేశాల మధ్య, ప్రజల మధ్య సంపద పంపిణీ న్యాయంగా జరగలేదని అంతర్జాతీయ ద్రవ్యనిధి మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జీవా అభిప్రాయపడింది. చైనాలో జరిగిన బోవావో ఫోరాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రజలు లాభపడాలంటే ప్రపంచీకరణతో అంతర్జాతీయ వాణిజ్యాన్ని పెంపొందించటానికి దేశాలు సమిష్టిగా పనిచేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం గ్లోబల్ సప్లై చైన్లు వైవిధ్యభరితంగాను ఉండాలని ఆమె అన్నారు. సప్లై చైన్లు తెగిపోవటంవల్ల ప్రపంచ స్థూల ఉత్పత్తిలో 7శాతం అధికంగా వ్యయం అవుతుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి పరిశోధనలో వెల్లడైంది. ఇలా నష్టపోతున్న దేశాలలో ఆసియా దేశాలు ముందున్నాయి. అధిక వడ్డీ రేట్లు, కరెన్సీ విలువ పడిపోవటం వంటి సమస్యలను ఎదుర్కొంటున్న బలహీన దేశాలను సాపేక్షంగా బలమైన దేశాలు ఆదుకోవాలని ఆమె అన్నారు.

ఆసియా దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించటం, మిగిలిన ప్రపంచ దేశాలతో ఆర్థిక సంబంధాలను మెరుగుపర్చటం లక్ష్యంగా "తూర్పు డావోస్"గా పేరొందిన బోవావో ఎకనామిక్ ఫోరమ్ 2001వ సంవత్సరంలో ఏర్పాటు చేయబడింది.

రైల్వే ప్రమాదాలపై చర్యల నివేదికలను ఇవ్వండి

- రూల్స్, కోడ్‌లు, మాన్యువల్స్‌లో రైల్వే ఏకపక్ష మార్పులను నివారించాలి : రైల్వే బోర్డును కోరిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

న్యూఢిల్లీ : రైల్వే ప్రమాదాల గురించి రైల్వే బోర్డు చర్యలు తీసుకున్న (యాక్షన్ టేకన్) నివేదికలను త్వరగా సమర్పించాలనీ, అందుకోసం నిర్ణీత కాలపరిమితిని నిర్దేశించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసింది. రూల్స్, కోడ్‌లు, మాన్యువల్స్ లో రైల్వే ఏకపక్ష మార్పులను నివారించాలని కమిటీ పేర్కొంది. లోక్‌సభలో రవాణా, పర్యాటకం, సాంస్కృతి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇచ్చిన రిపోర్టులో రైల్వే భద్రతా కమిషన్ అంశంపై రైల్వే బోర్డు యాక్షన్ టేకెన్ రిపోర్టులను (ఏటీఆర్‌లు) సమర్పించడానికి నిర్ణీత కాలపరిమితి ఉండాలని పేర్కొంది.

అలాగే, ప్రమాదానికి గల కారణాలను పరిశోధించే ప్రక్రియను, అటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా, దాని ఫలితంగా ఆస్తి, మానవ ప్రాణాలకు నష్టం జరగకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి నేతృత్వంలోని కమిటీ పార్లమెంట్‌లో సమర్పించిన నివేదికలో 2013-14లో జరిగిన ప్రమాదాల్లో రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి 15 ఏటీఆర్‌లు ఇప్పటికీ రైల్వే బోర్డులో పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఏటీఆర్‌లను సమర్పించడంలో విపరీత మైన జాప్యం ప్రమాద పరిశోధనల మొత్తం ప్రయత్నాన్ని అడ్డుకుంటుందని కమిటీ అభిప్రాయ పడింది. అందువల్ల రైల్వే బోర్డు ఎటిఆర్‌లను సమర్పించే విధానాన్ని క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందని కమిటీ పేర్కొంది. ఇండియన్ రైల్వే చట్టం, మాన్యువల్స్ మొదలైన వాటిలో మార్పులు చేస్తూ రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే భద్రతా కమిషన్‌తో సంప్రదింపులు జరపాలని, రైల్వే భద్రతా కమిషన్ స్వయం ప్రతిపత్తిని కొనసాగించాలని కమిటీ సూచించింది. అందువల్ల రైల్వే మంత్రిత్వ శాఖ చెల్లుబాటయ్యే సూచనను పరిశీలించవచ్చని, దానిని అమలు చేయడానికి మంత్రిత్వ శాఖతో సమన్వయంతో ఒక యంత్రాంగాన్ని అనుసరించవచ్చని కమిటీ సిఫార్సు చేసింది. రైల్వే సేఫ్టీ కమిషన్‌ను సంప్రదించకుండా రైల్వే భద్రతపై ప్రభావం చూపే రూల్స్, కోడ్‌లు, మాన్యువల్స్‌లో ఏకపక్ష మార్పులను రైల్వేలు నివారించాలని కమిటీ పేర్కొంది.



వేలాది ప్రాణాలు పోతున్నా శాంతి చర్చలకు సిద్ధంకాని ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్స్కీ

ఉక్రెయిన్: భీకర పోరు జరుగుతున్న బాఖ్మట్‌ను కోల్పోవటమంటే 'మా దేశం అలసిపోయి నట్టే. అలా అలసిపోయిన సమాజం నన్ను రాజీపడేలా చేస్తుంది' అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఒక ఇంటర్వ్యూలో అన్నారు. అమెరికా అండ లేకుండా ఉక్రెయిన్ యుద్ధాన్ని కొనసాగించలేదని అందరికీ తెలుసు. గత 13నెలలుగా రష్యాతో కొనసాగుతున్న యుద్ధంలో అపార నష్టాన్ని చవిచూసిన ఉక్రెయిన్ కోల్పోయిన ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకోకుండా రష్యాతో రాజీపడితే ఆ దేశంలోని అజోవ్ బెటాలిన్ వంటి ఫాసిస్టు శక్తులు, ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యంపోసిన అమెరికా అంగీకరించవు.

2022వ సంవత్సరం ఏప్రిల్ నెల తరువాత ఎటువంటి శాంతి చర్చలు జరగలేదు. అప్పటివరకు జరుగుతున్న శాంతి చర్చలకు ఆశ్చర్యకరంగా అమెరికా తరపున ఉక్రెయిన్‌ను దర్శించిన బ్రిటీష్ ప్రధాని బోరిస్ జాన్సన్ జోక్యంతో ముగింపు పలికి యుద్ధాన్ని కొనసాగేలా చేయటం జరిగింది. అమెరికా నాయకత్వంలోని పశ్చిమ దేశాల లక్ష్యం పుతిన్‌ను లొంగదీసి, రష్యాను బలహీన పరచటంగా ఉంది.

ఆగస్టు నుంచి అనేకవేల మంది ప్రాణాలను కోల్పోయారు. బాఖ్మత్ కేంద్రంగా భీకర పోరు జరుగుతోంది. డోనెస్క్, లుగానె ప్రాంతాలమీద పట్టు సాధించాలంటే రష్యాకు బాఖ్మత్ మీద నియంత్రణ అవసరం. అలాగే బాఖ్మత్ యుద్ధంలో రష్యా సైన్యాన్ని బలహీన పరచటమే ఉక్రెయిన్, దాని మద్దతుదారులైన సామ్రాజ్యవాద పశ్చిమ దేశాల లక్ష్యంగా ఉంది. బాఖ్మత్ రష్యా ఆక్రమణ నుంచి రక్షించాలంటే వేలాది ఉక్రెయిన్ సైన్యం బలవ్వటం అనివార్యం.

అయినప్పటికీ జెలెన్స్కీ వెనక్కు తగ్గటం లేదు. అయితే అటువంటి ఎత్తుగడతో ప్రాణాలు పోవటం తప్ప ఉపయోగం ఏమీ ఉండదని ఉక్రెయిన్ సైన్యం భావిస్తున్నది. యుద్ధ రంగం నుంచి వచ్చిన సైనికులు తిరిగి యుద్ధంలో పాల్గొనటానికి సుముఖత చూపటంలేదు. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా నష్టాలను మాత్రమే ఎత్తి చూపుతున్న పశ్చిమ దేశాల మీడియా ఉక్రెయిన్‌లో జరుగుతున్న అపార నష్టాన్ని తక్కువచేసి చూపుతోంది.

అమెరికా, నాటో దేశాల నుంచి వస్తున్న ధన, ఆయుధ సహాయం మత్తులలో తమ దేశవాసులు హననాన్ని నివారించటానికి జెలెన్స్కీ ఏమాత్రం ఆసక్తి చూపటం లేదు. ఇప్పటి వరకు దాదాపు 1.5లక్షల ఉక్రెయిన్ సైనికులు హతులయ్యారు. నాలుగు కోట్లమంది ప్రజలలో ఒక కోటిమంది కాందిశీకులుగా మారి వివిధ దేశాలలో తలదాచుక కుంటున్నారు.

రానున్నది 'కష్టకాలం'

సెర్బియన్ అధ్యక్షులు, అలెగ్జాండర్ ఉసిక్



సెర్బియా: 'అగ్రరాజ్యాల మధ్య ఘర్షణ వాతావరణం, అణ్వాయుధ ప్రయోగ ప్రమాదం అంచున ప్రపంచం ఉంది. అగ్రరాజ్యాలు ప్రత్యక్షంగా తలపడే అవకాశమున్న వాతావరణంలో సెర్బియా చితికిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది' అని సెర్బియన్ అధ్యక్షులు అలెగ్జాండర్ ఉసిక్ అన్నారు. ఒకవైపు యూరోపియన్ యూనియన్ సభ్యత్వం కోసం ప్రయత్నిస్తూనే రష్యాపైన ఆంక్షలను విధించటాన్ని వ్యతిరేకించే విధానాన్ని ఆయన సమర్థించారు.

"మనం రాజకీయ, సైనిక సంబంధిత విషయాలలో అత్యంత కష్టకాలంలో ఉన్నాము. మన పౌరుల సంక్షేమాన్ని పట్టించుకుంటూ, శాంతిని సంరక్షించుకుంటూ, మన స్థూల జాతీయోత్పత్తి వృద్ధి కోసం పెట్టుబడులను పెంచుకుంటూ మనల్ని మనం రక్షించుకోవాలి" అని సెర్బియా అధ్యక్షుడు తన క్రల్జెవో నగర పర్యటనలో పేర్కొన్నారు.

సెర్బియా చిన్న దేశమైనప్పటికీ దాని స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవలసిన అవసరం ఉంది. చైనాతో సెర్బియాకు పెరుగుతున్న వాణిజ్యాన్ని కొన్ని దేశాలు ఆక్షేపించటం గర్హనీయం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో సెర్బియా తటస్థంగా ఉంది. రష్యాపైన ఆంక్షలను విధించే దేశాలలో సెర్బియాను చేర్చటానికి యురోపియన్ యూనియన్ చేస్తున్న ప్రయత్నాన్ని సెర్బియా ఆమోదించలేదు.

వాహన అమ్మకాల్లో మిశ్రమ ఫలితాలు

న్యూఢిల్లీ : ఆర్థిక సంవత్సరం చివరి నెల గడిచిన మార్చిలో దేశంలో వాహన కంపెనీల అమ్మకాల్లో మిశ్రమ ఫలితాలు చోటు చేసుకున్నాయి. 2022 మార్చితో పోల్చితే గడిచిన నెలలో మారుతి సుజుకి, కియా అమ్మకాల్లో తగ్గుదల చోటు చేసుకోగా.. టివిఎస్ మోటార్, టాటా మోటార్స్ విక్రయాల్లో పెరుగుదల నమోదయ్యింది. దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీదారు మారుతి సుజుకి మార్చి అమ్మకాల్లో 3 శాతం తగ్గి 1,70,071 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. టివిఎస్ అమ్మకాలు మూడు శాతం పెరిగి రూ.3,17,152 యూనిట్లుగా నమోదయ్యాయి. కియా ఇండియా విక్రయాలు 5 శాతం తగ్గి రూ.21,051 యూనిట్లుగా ఉన్నాయి. టాటా మోటార్స్ దేశీయ అమ్మకాలు 3 శాతం పెరిగి 89,351 యూనిట్లకు చేరాయి. హ్యూందాయ్ మోటార్ అమ్మకాలు 11 శాతం పెరిగి 61,500 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి.

ఒకాయ ఇవికి ఐకాట్ ధృవీకరణ



హైదరాబాద్ : ఒకాయ విద్యుత్ ద్విచక్ర వాహనాలకు ఎఐఎస్ 156 సవరణ మూడో దశ కింద ఐకాట్ ధృవీకరణ పొందినట్లు ఆ సంస్థ తెలిపింది. ఇది ఇవిల కోసం డిజైన్, నిర్మాణం, ప్రభుత్వం నిర్దేశించిన భద్ర తా ప్రమాణాలకు అనుగుణంగా బ్యాటరీ ప్యాక్ అలాగే దాని భాగాలను పరీక్షించడంతో పాటు అన్ని భద్రతా అవసరాల ను కవర్ చేస్తుందని తెలిపింది. దీంతో కొత్త నిబంధన లకు పూర్తిగా అనుగుణంగా ఉండే ఇవి మొదటి తయారీ దారులలో ఒకటిగా ఒకాయ మారిందని పేర్కొంది.

గ్రీన్‌టాక్స్ బాదేశారు...

వెయ్యిరెట్లు పెరిగిన ఆదాయం రికార్డు స్థాయిలో రవాణాశాఖ రెవెన్యూ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గ్రీన్‌టాక్స్ పేరుతో రవాణాశాఖ వాహనదారుల్ని భారీగా బాదేసింది. ఏకంగా వెయ్యి రెట్లు ఆదాయం పెరిగేలా గ్రీన్‌టాక్స్‌ను పెంచేసి, వసూలు చేశారు. అది కడితేనే వాహన రిజిస్ట్రేషన్ జరిగేలా రవాణాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. దీనితో విధిలేక వాహనదారులు తిట్టుకుంటూనే గ్రీన్‌టాక్స్ కట్టి వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే ఏ వాహనానికి ఎంత గ్రీన్‌టాక్స్ కట్టాలో ఎక్కడా అధికారికంగా ప్రకటన లేదు. వాహన రిజిస్ట్రేషన్ సమయంలో కంప్యూటర్‌లో కాలమ్స్ నింపే క్రమంలో ఆటోమేటిక్ జనరేటింగ్ అమౌంట్ వచ్చేలా రవాణాశాఖ అప్లికేషన్ రూపొందించింది. దీనితో 2022-23 ఆర్థిక సంవత్సరంలో గ్రీన్‌టాక్స్ ఆదాయం 1067.41 శాతం పెరిగింది. 2021-22లో గ్రీన్‌టాక్స్ ఆదాయం రూ.5.54 కోట్లు కాగా, 2022-23లో ఆ ఆదాయం రూ.64.63 కోట్లకు (1067.41 శాతం) పెరిగింది.

2023 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రవాణాశాఖ పన్నుల్ని భారీగా పెంచేసింది. ఫలితంగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.3,971.38 కోట్ల ఆదాయం వస్తే, 2022-23లో ఈ ఆదాయం రూ.6,390.80 కోట్లకు పెరిగింది.

60.92 శాతం అధిక ఆదాయం సమకూరింది. వాస్తవానికి 2022-23లో రవాణాశాఖ ఆదాయ లక్ష్యం రూ.4,953 కోట్లుగా అంచనా వేశారు. కానీ పెరిగిన పన్నులతో అంతకు మించి ఆదాయం సమకూరింది.



రవాణాశాఖ ఆదాయం ఇలా...(రూ.కోట్లలో)

కేటగిరి	2022 (మార్చి నాటికి)	2023 (మార్చి నాటికి)	పెంపుశాతం
త్రైమాసిక పన్ను	466.38	779.09	67.05
లైఫ్‌ట్యాక్స్	2,896.14	4,670.04	61.25
గ్రీన్‌టాక్స్	5.54	64.63	1067.41
ఫీజులు	418.91	552.53	31.90
గుర్తింపు చార్జీలు	64.95	189.93	192.44
యూజర్ చార్జీలు	119.46	134.58	12.66
మొత్తం	3,971.38	6,390.80	60.92

ఇండ్లస్థలాలపై దశలవారీ పోరాటం

- 3న హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో సంతకాల సేకరణ

నవతెలంగాణ - హైదరాబాద్

ఈనెల మూడున హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టులకు ఇండ్లస్థలాలివ్వాలంటూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు టీడబ్ల్యూజేఎఫ్ ప్రకటించింది. జర్నలిస్టులు భారీ సంఖ్యలో సంతకాల సేకరణలో పాల్గొనాలనీ, తద్వారా సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరింది. కొద్దిరోజుల్లోనే హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌తోపాటు జిల్లాల్లోనూ దీక్షలు సైతం చేప డతామని ప్రకటించింది. అనంతరం ప్రభుత్వానికి జర్నలిస్టుల పేర్లతో కూడిన జాబితాలను అందజేస్తామని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

టీఎస్‌పీఎస్సీ కేసుపై రేవంత్ ట్వీట్..

- ఎవరా ఇద్దరూ అని జోరుగా చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్ కేసులో సంబంధిత ఉన్నతాధికారులను విచారించాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ అనితా రామచంద్రన్, టీఎస్‌పీఎస్సీ కమిటీ సభ్యుడు లింగారెడ్డికి సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ ఘటనపై టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా శనివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. పనిలో పనిగా మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ సెటైర్ విసిరారు. "టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్.. తీగలాగితే ప్రగతిభవన్ డొంక కదిలిందా?.. విచారణలో 'బావ'.. తెలంగాణ సీఎంవోలో బావమరిది?.. మీకు అర్థం అవుతుందా "పరువు" గల కేటీఆర్ గారూ...?" అంటూ రేవంత్ ట్వీట్ చేశారు. ట్వీట్‌తో పాటు టీఎస్‌పీఎస్సీ కమిటీ సభ్యుడు లింగారెడ్డి బయోడేటాను జతచేస్తూ రేవంత్ పోస్ట్ చేశారు. ప్రస్తుతం రేవంత్ ట్వీట్ వైరల్‌గా మారింది. అసలు రేవంత్ ట్వీట్ చేసిన బావా.. బావమర్దులు ఎవరనే దానిపై జోరుగా చర్చ జరుగుతోంది. ట్వీట్‌లో రేవంత్ ప్రస్తావించిన ఈ బావా బావమర్దుల్లో ఒకరు గతంలో సీఎంవోలో పనిచేసిన ఒక రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి అనే చర్చ రాజకీయవర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులుగా బందెల నరసయ్య

- ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బందెల నరసయ్య, మారుపాక అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆ సంఘం ప్రథమ మహాసభ శనివారం హైదరాబాద్‌లో జరిగింది. అందులో నూతన రాష్ట్ర నాయకత్వాన్ని ఎన్నుకున్నామని ఆ సంస్థ గౌరవాధ్యక్షులు కె. ఏసురత్నం తెలిపారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలో కార్యనిర్వహణ అధ్యక్షులుగా తాళ్లపల్లి లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా కే రత్నకుమారి, రాజరత్నం, సహదేవ్, దేవి పోషన్న, సహాయ కార్యదర్శులుగా ఉషశ్రీ, లక్ష్మీపతి, వెంకటస్వామి, జె.కుమారస్వామి, సలిగంటి శ్రీనివాస్, కోశాధికారి ఆరుట్ల రాజ్ కుమార్ తోపాటు 35 మంది రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, 81 మంది రాష్ట్ర సమితి సభ్యులుగా ఈ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు.

పెద్దపులుల సంరక్షణతోనే అడవుల రక్షణ

- ఎంపీ సంతోష్ కుమార్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అడవులను రక్షించాలంటే పెద్దపులులను సంరక్షించాల్సిందేనని రాజ్యసభ సభ్యులు, అడవులు, పర్యావరణంపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు జోగినపల్లి సంతోశ్ కుమార్ తెలిపారు. ఇందుకోసం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ తరపున పులుల రక్షణకు మద్దతిస్తున్నట్టు చెప్పారు. ప్రాజెక్ట్ టైగర్‌కు యాభై ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఆయన ట్వీట్ చేశారు. 1973లో ప్రాజెక్ట్ టైగర్ ప్రారంభించే నాటికి 1,827గా నమోదైన పులుల సంఖ్య 2022 నాటికి 2,967కు పెరిగిందని పేర్కొన్నారు. సేవ్ టైగర్ ఉద్యమం గోల్డెన్ జూబ్లీ సందర్భంగా రాష్ట్రానికి చెందిన అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్ట్ అధికారులు విడుదల చేసిన టైగర్ బుక్, టీ షర్ట్, కాఫీ మగ్ సావనీర్లను ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ ద్వారా అమ్రాబాద్, కవాల్ పులుల అభయారణ్యంలను చాలా బాగా నిర్వహిస్తోందనీ, పులుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నదని ఈ సందర్భంగా సంతోశ్ కుమార్ చెప్పారు. పర్యావరణ సమతుల్యతలో పెద్దపులి అగ్రభాగాన ఉంటుందని పేర్కొన్నారు. కొత్త తరాలకు ఈ అమోఘమైన జంతువును చూసి, కాపాడాల్సిన బాధ్యత అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

నాసా ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్‌మెంట్ పోటీలో

ప్రపంచ చాంపియన్‌గా శ్రీచైతన్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికా నాసా వారి ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్‌మెంట్ పోటీలో వరుసగా పదోసారి ప్రపంచ చాంపియన్‌గా శ్రీచైతన్య స్కూల్ నిలిచింది. ప్రపంచ నలుమూలల నుంచి సుమారు 30కిపైగా దేశాలు పాల్గొన్నాయి. అందులో భారత్‌ను నెంబర్‌వన్ స్థానంలో శ్రీచైతన్య విద్యార్థులు నిలబెట్టారు. నాసా వారి ఎన్ఎస్ఎస్ పోటీలో ప్రపంచ వ్యాప్తంగా ఎంపికైన 138 ప్రాజెక్టుల్లో 89 ప్రాజెక్టులు భారత్ నుంచి ఎంపికయ్యాయి. ఇందులో 54 ప్రాజెక్టులు శ్రీచైతన్య నుంచి ఎంపికయ్యాయని ఆ స్కూల్ డైరెక్టర్ సీమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 729 మంది విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో ఒకటి, రెండు, మూడో బహుమతి, గెలిచిన ప్రాజెక్టుల సంఖ్య, పాల్గొన్న విద్యార్థుల సంఖ్యలో శ్రీచైతన్య విద్యార్థులే ఈ ఘనత సాధించారని వివరించారు. బట్టీపట్టే విధానానికి స్వస్తి పలుకుతూ అవగాహన కల్పించేలా బోధన ప్రక్రియతోపాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంతటి అనితరసాధ్యమైన విజయానికి కారణమైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందాన్ని శ్రీచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మెన్ బిఎస్ రావు అభినందించారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి : ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ని ప్రక్షాళన చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దానికి కొత్త పాలకమండలిని ఏర్పాటు చేయాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులకు భరోసా కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సిట్ నోటీసులు అందుకున్న ప్రస్తుత కమిషన్ నేతృత్వంలో మళ్లీ పరీక్షలు నిర్వహించే లీకేజీ అయ్యే అవకాశముందని తెలిపారు. నిరుద్యోగులు అభద్రతాభావంలో ఉన్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. పర్యవేక్షణ పటిష్టంగా ఉండాలని సూచించారు. లీకేజీ వెనుక ఎంత పెద్దవారున్నా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



ఐపీఎల్ మ్యాచ్‌లకు భద్రత కట్టుదిట్టం

- రంగంలో క్యూఆర్‌టీ బృందాలు1500 సిబ్బందితో పటిష్టమైన నిఘా
- ప్రేక్షకులకు, సాధారణ వాహనదారులకు ఇబ్బందుల్లేకుండా పార్కింగ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషల్ క్రికెట్ స్టేడియంలో ఐపీఎల్-2023 క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్టు రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని హెచ్‌సీఏ, ఐపీఎల్ ప్రతినిధుల సమన్వయంతో అన్ని చర్యలూ చేపట్టామన్నారు. శనివారం ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో విలేకరుల సమావేశంలో జాయింట్ సీపీ ఏ.సత్యనారాయణతో కలిసి సీపీ వివరాలు వెల్లడించారు.

ఈ నెల 2 నుంచి వచ్చే నెల 18వ తేదీ వరకు ఉప్పల్ స్టేడియంలో 7 మ్యాచ్‌లు జరగనున్నాయన్నారు. స్టేడియంలో 38 వేల సిటింగ్ కెపాసిటీ ఉందన్నారు. ప్రతి మ్యాచ్‌కూ 1500 మందితో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రత్యేకంగా క్విక్ రెస్పాన్స్ బృందాలను(క్యూఆర్‌టీ) రంగంలోకి దించుతున్నామని తెలిపారు. వీటితోపాటు సెక్యూరిటీ వింగ్, ఎస్బీ, ఆక్టోపస్ తదితర బలగాలను ఉపయోగిస్తున్నామన్నారు. మహిళలకు రక్షణగా షీ బృందాలను రంగంలోకి దించుతామన్నారు. పోకిరీలు, అసాంఘిక శక్తులపై షీ టీమ్స్, స్పెషల్ పార్టీలు ప్రత్యేకంగా నజర్ పెడతాయని చెప్పారు. హైదరాబాద్, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ సిబ్బంది సమన్వయంతో స్టేడియం నుంచి క్రికెటర్లు బస చేసే హోటల్స్ వరకు ఎస్కార్ట్ కల్పించనున్నట్టు తెలిపారు. అత్యవసర సేవల కోసం మెడికల్ టీంలను అందుబాటులో ఉంచామన్నారు.

క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో జారీ చేసిన అక్రిడేషన్లను మార్చుకోవద్దని సూచించారు. సీసీ కెమెరాలతో స్టేడియంలోని ప్రతి వ్యక్తి కదలికలనూ క్షుణ్ణంగా పరిశీలిస్తామని తెలిపారు. ఒక వ్యక్తికి కేటాయించిన పాస్‌లు, అక్రిడేషన్లపై ఇతరులు వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా వ్యక్తులకు కేటాయించిన సీట్లలోనే కూర్చోవాలని, అనవసరంగా తిరుగొద్దన్నారు. మ్యాచ్‌కు రెండు గంటల ముందు ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతిస్తామన్నారు. మ్యాచ్ అయిపోయిన తదనంతరం గుంపులుగుంపులుగా ఒకేసారి బయటకు రావద్దని కోరారు.

ఎలక్ట్రానిక్ వస్తువుల నిషేధం

భద్రతా చర్యల్లో భాగంగా స్టేడియంలో 17 వస్తువులపై నిషేధం విధించామని సీపీ తెలిపారు. ల్యాప్‌టాప్స్, కెమెరాలు, మ్యాచ్‌బాక్స్, బైనాక్యులర్స్, బ్యాటరీస్, బ్యాగ్స్, బ్యానర్స్, సిగరెట్స్, లైటర్స్, కాయిన్స్, హెల్మెట్స్, బయటి తినుబండారాలు, వాటర్ బాటిళ్లు, ఎలక్ట్రానిక్ ఐటమ్స్, పదునైన మెటల్స్/ప్లాస్టిక్ వస్తువులు, పెన్స్, పెర్ఫ్యూమ్స్, జెండా కర్రలు స్టేడియంలోకి తీసుకెళ్లొద్దన్నారు. తనిఖీ సమయంలో సెల్‌ఫోన్‌ను సెక్యురిటీ సిబ్బందికి చూపిస్తే వారు స్విచ్ఛాఫ్ చేసి.. తిరిగి అందిస్తారన్నారు. హ్యాకర్లు స్టేడియం పరిసరాల్లోకి రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును ఉపయోగించాలి

మ్యాచ్‌లు చూసేందుకు వచ్చే క్రికెట్ అభిమానులు, ప్రేక్షకులతోపాటు సాధారణ వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలూ చేపట్టామని సీపీ తెలిపారు. ట్రాఫిక్ విభాగం నుంచి ప్రత్యేకంగా 215మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించామని, భారీ వాహనాలను శివారు ప్రాంతాల నుంచే మళ్లిస్తామని తెలిపారు. వాహనాలకు ఎలాంటి పార్కింగ్ రుసుమూ వసూలు చేయరని, ప్రేక్షకుల కోసం 9వేలకుపైగా వాహనాలకు పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. మెట్రో, బస్సులు, క్యాబ్‌లాంటి పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును ఉపయోగించుకుంటే ట్రాఫిక్ జామ్‌లు ఉండవని వివరించారు. సికింద్రాబాద్, హబ్సి గూడ, అంబర్‌పేట్, రామంతాపూర్, ఎల్బీనగర్, వారాసి గూడ వైపు నుంచి వాహనాలు స్టేడియానికి వస్తాయని, ఆయా రూట్లలో చుట్టూ మొత్తం 18 పార్కింగ్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రేక్షకులు సులువుగా గుర్తించే విధంగా 324 సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు.

బ్లాక్‌లో టికెట్లు విక్రయిస్తే కఠిన చర్యలు

బ్లాక్‌లో మ్యాచ్ టికెట్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. బ్లాక్‌లో టికెట్లు కొనొద్దని, అలాంటి వారిపై ప్రత్యేక నిఘా వేసి వారి సమాచారం పోలీసులకు అందించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో నగరంలో మెట్రో రైల్ సర్వీసులను పెంచుతున్నట్టు అధికారులు ప్రకటించారు.

జూన్ 1న ఇంటర్ ఫస్టియర్ తరగతులు

- నవంబర్ 20 నుంచి అర్ధసంవత్సర పరీక్షలు
- 2024, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు
- జూనియర్ కాలేజీల పనిదినాలు 227
- ఏప్రిల్ 1 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు
- వచ్చే విద్యాసంవత్సరం అకడమిక్ క్యాలెండర్ విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జూన్ ఒకటి నుంచి జూనియర్ కాలేజీలకు కొత్త విద్యాసంవత్సరం (2023-24) ప్రారంభం కానుంది. అయితే ఇంటర్ ద్వితీయ సంవత్సరంతోపాటు మొదటి సంవత్సరం విద్యార్థులకూ అదే రోజు తరగతులను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన జూనియర్ కాలేజీల అకడమిక్ క్యాలెండర్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ శనివారం విడుదల చేశారు. మొత్తం 304 రోజులకుగాను ఆదివారాలు, పండుగలు, ఇతర సెలవులు 77 ఉన్నాయని తెలిపారు. వచ్చేవిద్యాసంవత్సరంలో జూనియర్ కాలేజీలకు 227 పనిదినాలుంటాయని స్పష్టం చేశారు. 48వ బోర్డు సమావేశం ప్రకారం వాటికి 220 పనిదినాలుండాలని వివరించారు. ఈ ఏడాది నవంబర్ 20 నుంచి 25వ తేదీ వరకు అర్ధసంవత్సర పరీక్షలుంటాయని తెలిపారు. 2024, మార్చి మొదటివారంలో ఇంటర్ వార్షికలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఫిబ్రవరి రెండు వారంలో ప్రాక్టికల్ పరీక్షలుంటాయని తెలిపారు. వచ్చేఏడాది జనవరి 22 నుంచి 29వ తేదీ వరకు ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహిస్తామని వివరించారు. జూనియర్ కాలేజీలకు చివరి పనిదినం మార్చి 31 అని పేర్కొన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి మే 31వ తేదీ వరకు వేసవి సెలవులుంటాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను మే చివరి వారంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో జూనియర్ కాలేజీలు వచ్చే ఏడాది జూన్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమవుతాయని వివరించారు. అక్టోబర్ 19 నుంచి 25 వరకు దసరా సెలవులు, 2023, జనవరి 13 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులుంటాయని తెలిపారు.

షెడ్యూల్ ప్రకారమే ప్రవేశాలు కల్పించాలి

రాష్ట్రంలోని ప్రయివేటు జూనియర్ కాలేజీలన్నీ ఈనెల ఒకటి నుంచి మే 31వ తేదీ వరకు బంద్ చేయాలని నవీన్ మిట్టల్ ఆదేశించారు. వేసవి సెలవులు, ఆదివారాలు, పండుగలకు ప్రభుత్వం ఆదేశాల ప్రకారం తప్పనిసరిగా కాలేజీలు సెలవు ప్రకటించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటర్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు కల్పించిన కాలేజీలపై చర్యలు తీసుకుంటామేని హెచ్చరించారు.

అకడమిక్ క్యాలెండర్‌లో ముఖ్యాంశాలు

- జూన్ 1 నుంచి జూనియర్ కాలేజీలు ప్రారంభం
- ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభం
- నవంబర్ 20 నుంచి 25 వరకు అర్ధసంవత్సరం పరీక్షలు
- జనవరి 22 నుంచి 29 వరకు ప్రీఫైనల్ ఎగ్జామ్స్
- ఫిబ్రవరి రెండోవారంలో ప్రాక్టికల్స్
- మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు
- ఏప్రిల్ 1 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు

సంపాదకీయం

రామ! రామ!

రామ, రామా అని నోటి మీద చెయ్యిపెట్టుకుని విస్తుబోయి అన్యాయం, అధర్మం అని అనుకుంటే సరిపోదు. గొంతులిప్పి నిలేయికపోతే వీరి ఆగడాలు మరింత పెరిగే ప్రమాదముంది. మొన్న శ్రీరామనవమి రోజున రాములవారి కళ్యాణము జరిగింది. భక్తులు, సామాన్య ప్రజలు వేడుకగా ఈ కార్యక్రమాన్ని సంప్రదాయంగా చేసుకున్నారు. ఇదేమీ

సామరస్యతకు, సౌహార్ధతకు, సహనశీలతకు, దయ కరుణ, సౌభాతృత్వాలు వెల్లివెరియాల్సిన ఉత్సవాలను, పండుగలను, విద్వేష పూరితం చేస్తున్న ఉన్మాద ఆలోచనల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఈ దేశంలో అన్య మతస్తులు పరిపాలనలో ఉన్నప్పుడూ పండుగలు, ఉత్సవాలూ ప్రశాంతంగానే కొనసాగాయి. ఇప్పుడీ దేశంలోని మతానికి ఎదురవుతున్న ప్రమాదమేమీలేదు. ఉన్నదల్లా ప్రజల బాధలు తీర్చకుండా మతోన్మాదాన్ని, ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్న వారితోనే అసలైన ముప్పు ఎదురవుతున్నది. వారి పట్లనే భక్తులు జాగ్రత్తగా ఉండాలి.

కొత్తకాదు. ప్రతియేడూ జరుగుతున్నదే. చిన్నతనంలో రామనవమి పందిరి క్రింద బెల్లం పానకం గ్లాసులకొద్దీ తాగి సరదాగా గడిపిన జ్ఞాపకాలూ ఉన్నాయి. అప్పుడు పందిరిలో చేరిన భక్తుల వదనాల్లో సంతోషమూ, భక్తిభావన, సౌహార్ధత, కరుణ, దానశీలత, సౌమ్యత మొదలైన గుణాలు తొణికిసలాడేవి. ఒక ప్రశాంత శాంతియుత వాతావరణంలో సమ్మేళనం కొనసాగేది. సందడి యెంతున్నా సంయమనం కనిపించేది. కానీ ఇప్పుడేమిటీ ఉద్రిక్త విద్వేషం! నాడు, రామనామస్మరణ, రామదాసు సంకీర్తన, స్వరమాధుర్యాలు సంబరాలను సమున్నత పరచేవి. ఆరాధనా భావన అల్లుకొనేది. రాముని చరిత్రా, కథా, ప్రవచనాలు, గీతాలూ వినిపించేవి.

ఇప్పుడిదేమిటి? రామ! రామ! రాముడి పెండ్లిరోజు ఒక ఉద్రిక్త వాతావరణం నెలకొల్పటమా! రెచ్చగొట్టే ప్రసంగాలు, బూతులు, తిట్లు, పలకటానికి కూడా వీలులేని దుర్మార్గ ప్రేలాపనలు, ఒక ఉన్మత్త విన్యాసం భక్తి పేరున కొనసాగటమా! శోభాయాత్ర పేరుతో సాగిన ఊరేగింపులు శత్రువులపై యుద్ధ యాత్రలుగా మార్చిన తీరు చూస్తే, ఇది పూర్తిగా విద్వేష ప్రచారయాత్రలుగా కనపడుతున్నాయి.



హైదరాబాద్‌లోని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ నాయకత్వాన సాగిన శ్రీరాముడి శోభాయాత్రలో రాముని స్మరణగానీ, భక్తికానీ కించిత్ కనిపించదు, వినిపించదు. కానీ వినిపించినవి ఏమిటంటే బూతులు, యాత్రావేదికపై నుండి రెచ్చగొట్టే విధంగా ఉద్రిక్తంగా బెదిరింపులు చేయటం ఇక్కడి భక్తులకు రాముడికీ అవమానకరంగా మారింది. అంతేకాదు, ఈ యాత్రలో మన జాతిపిత, రామరాజ్యం కోసం కలగన్న మహాత్మాగాంధీని హత్య చేసిన నాథూరాంగాడ్సే చిత్రపటాన్ని ప్రదర్శిస్తూ ఊరేగటం ఎంత దారుణం! ఈ దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చటమే మాలక్ష్యం అంటూ అడ్డొచ్చే వారిని అంతమొందిస్తామని హెచ్చరిస్తూ సాగిన శోభాయాత్ర, భక్తి పూర్వక యాత్ర ఎలా అవుతుంది. నీచమైన బుద్ధితో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ ఓట్ల రాజకీయం కోసం రామనామాన్ని వాడుకోవడం ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఒకవైపు దోపిడీ దొంగలను దొంగలని అన్నందుకు పదవులకు అనర్హత ప్రకటిస్తారు. మరోవైపు హంతకులను ఊరేగించే నాయకులకు కితాబులిస్తారు! ఇదేమి న్యాయం? ఇదెక్కడి దుర్మార్గం? ఈ విచ్ఛిన్నకులకు శిక్షలు లేవా? మతాన్ని రాజకీయాలను కలిపేసి ఉన్మాదాన్ని ఎగదోసే ఇట్లాంటివారి పట్ల ఎందుకు ఈ ఉదాసీనత! రాజ్యాంగం ప్రకారం మనదేశం లౌకిక ప్రజాస్వామిక దేశం. దీన్ని హిందూ రాష్ట్రంగా మారుస్తామని, రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లడుతుంటే నేరం కాదా! భక్తి కొనసాగే సందర్భంలో మతాలపై ద్వేషాన్ని ఉసిగొల్పటం నేరపూరితం కాదా!

ఇటీవల సుప్రీంకోర్టు ధర్మాసనం ఏమనిచెప్పింది. విద్వేష ప్రసంగాలపై మాట్లాడుతూ, రాజకీయాలు, మతాలను వేరుచేయాలని సుప్రీం వ్యాఖ్యానించింది. నాయకులు రాజకీయాల కోసం మతాన్ని వాడుకోవడం ఆపాలని, అప్పుడే విద్వేష ప్రసంగాలు ఆగుతాయని పేర్కొంది. విద్వేష ప్రసంగాలపై కేసులు నమోదు చేయడంలో విఫలమయ్యారని మహారాష్ట్ర సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలపై కోర్టు ధిక్కరణ కేసు సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ... నాయకులు రాజకీయాలను మతంతో కలిపేయడం వల్ల పెద్ద సమస్య ఉత్పన్నమైందని నొక్కివక్కాణించారు. ఈ కోర్టు వ్యాఖ్యలను పట్టించుకోవటం చేస్తారా లేదా! "కేవలం తుపాకీలతో కాల్చడం, బాంబులను పేల్చడం ఉగ్రవాదం కాదు, మతాలుగా, కులాలుగా ప్రజలను విభజించడం కూడా అతి భయంకరమైన ఉగ్రవాదం" అని బాలీవుడ్ నటుడు చెప్పిన విషయం అక్షరాలా వాస్తవం. కేవలం ఇంటి పేరు ప్రస్తావనలకే పరువునష్టం జరిగితే, ఒక జాతిపితను చంపినవాడిని దేశభక్తుడని కీర్తిస్తున్న సంఘటన దేశ ప్రజల మనోభావాలు, పరువు ప్రతిష్టలకు సంబంధించిన విషయం కాదా! కోట్లాది ప్రజల మనసులను గాయపరచడం కాదా! గాంధీ కూడా నిత్య రామస్మరణ చేసినవాడన్న విషయం మరువరాదు.

సామరస్యతకు, సౌహార్ధతకు, సహనశీలతకు, దయ కరుణ, సౌభాతృత్వాలు వెల్లివెరియాల్సిన ఉత్సవాలను, పండుగలను, విద్వేష పూరితం చేస్తున్న ఉన్మాద ఆలోచనల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఈ దేశంలో అన్య మతస్తులు పరిపాలనలో ఉన్నప్పుడూ పండుగలు, ఉత్సవాలూ ప్రశాంతంగానే కొనసాగాయి. ఇప్పుడీ దేశంలోని మతానికి ఎదురవుతున్న ప్రమాదమేమీలేదు. ఉన్నదల్లా ప్రజల బాధలు తీర్చకుండా మతోన్మాదాన్ని, ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్న వారితోనే అసలైన ముప్పు ఎదురవుతున్నది. వారి పట్లనే భక్తులు జాగ్రత్తగా ఉండాలి.

బీజేపీకి గడ్డుగానే కర్నాటక సమరం

మోడీ ప్రభుత్వ నిరంకుశ పోకడలపై దేశ వ్యాపితంగా అనేక రూపాలలో ప్రతిపక్షాల ఉమ్మడి పోరాటం ఉధృతమవుతున్న సమయంలో కర్నాటక శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. మే10న ఒకే విడతగా ఎన్నికలు పూర్తవుతాయన్న ప్రకటనే ఒక విధంగా ఆశ్చర్యం కలిగించింది. ఆయన మూలపీఠమైన గుజరాత్ వంటి చిన్న రాష్ట్రంలోనే ఏడు దఫాలుగా ఎన్నికలు జరిగిన నేపథ్యంలో కొంత వింతగానే అనిపిస్తుంది. అదలా ఉంచితే అదానీ భాగోతంతో మోడీ ఇరకాటంలో చిక్కుకోవడం, రాహుల్‌గాంధీపై అనర్హత వేటుకు దేశవ్యాపిత నిరసన, కార్పొరేట్ అనుకూల విధానాలపై ఉద్యమాలు, సంఘ్ పరివార్ మతతత్వ రాజకీయాలపై ఆగ్రహం పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఎన్నికలు వస్తున్నాయి. దక్షిణాదిన కాలూనడం కష్టమైన బీజేపీకి కర్నాటక ఒక్కటే దింపుడుకళ్లెం ఆశకాగా ఇప్పుడు అదీ ఎదురీతగా మారింది. కులాలకుంపట్లకు మారుపేరైన కర్నాటకలో దాంతోపాటు మతతత్వ మంటలు రాజేసిన ఘనత బీజేపీదే. గత ముప్పై ఏండ్లలో ఒకసారి కూడా అధికారంలోని సర్కారు మళ్లీ గెలవకపోవడం కర్నాటక ప్రత్యేకత. దేవగౌడ కుమారస్వామి జేడీఎస్ అవకాశవాద రాజకీయాల ఫలితంగా మొదటిసారి రాష్ట్రంలో అధికార భాగస్వామ్యం పొందిన బీజేపీ తరపున యడ్యూరప్ప



తెలకపల్లి రవి

కర్నాటకకూ తెలుగువారికి సంబంధాలు చారిత్రకమైనవి. తెలుగు వారి సంఘాలు, తెలుగునాట గల పార్టీలపట్ల అనుకూల ప్రతికూలతలు అక్కడ సర్వసాధారణం. మొత్తం కోటి మంది వరకూ తెలుగువారు అక్కడ ఉన్నారని, బెంగుళూరులోనే పాతికలక్షల వరకూ ఉంటారని తెలుగు సంఘాలు చెబుతుంటాయి. మైసూర్ కర్నాటక, హైదరాబాద్ కర్నాటక, బెంగుళూరు కర్నాటక అని మూడు భాగాలుగా పిలుస్తుంటారు. జేడీఎస్ నాయకుడు కుమారస్వామి కేసీఆర్‌తో కలవడమే గాక బీఆర్ఎస్ ప్రారంభసభకూ హాజరైనారు. అక్కడ ఆ పార్టీ పోటీ చేస్తుందని కూడా కథనాలు వచ్చాయి కాని తర్వాత లేదని వివరణ ఇచ్చారు.

ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఆయనే లింగాయత్‌లను సమీకరించి, అవినీతి గని సామ్రాట్ గాలి జనార్ధన్‌రెడ్డి వత్తాసుతో స్వంతంగా మంత్రివర్గం ఏర్పాటు చేశారు. అయితే కుంభకోణాల పరంపరలో వరుసగా మరో ముగ్గురు ముఖ్యమంత్రులు మారిపోవలసి వచ్చింది. ఒకదశలో యడ్యూరప్ప కూడా తిరుగుబాటు చేసి స్వంత పార్టీ పెట్టుకున్నారు. కాని మళ్లీ 2018 ఎన్నికల నాటికి అన్యథా శరణం నాస్తి అంటూ ఆయననే మళ్లీ చేర్చుకోవడం బీజేపీ దురవస్థకు అద్దం పడుతుంది. గత ఎన్నికల్లో 102స్థానాలతో పెద్దపార్టీగా బీజేపీ వచ్చినా ఎవరికీ మెజార్టీ దక్కలేదు. కాంగ్రెస్‌కు 78, జేడీఎస్‌కు 37స్థానాలు వచ్చాయి. మెజార్టీ లేకున్నా యెడ్యూరప్ప ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం, బలపరీక్ష రణరంగంగా మారడంతో తోకముడవడం తెలిసినవే. కుమారస్వామిని ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ మిశ్రమ ప్రభుత్వం ఏర్పాటు చేసినా దాన్ని బతకనివ్వలేదు. ఫిరాయింపుల ఆసరాతో మళ్లీ బీజేపీ గద్దెక్కడం, బసవరాజ్ బొమ్మై ముఖ్యమంత్రి కావడం తెలిసిన విషయాలే.

అవినీతి, మతతత్వ ప్రజ్వలన

బొమ్మై ప్రభుత్వ పాలనతో కర్నాటక పరిస్థితి దారుణంగా పరిణమించింది. ఉత్తరాది తరహా మతోన్మాద రాజకీయాలను రాజేసింది. ముస్లిం బాలికలు హిజాబ్ ధరించి రాకూడదనే ఆంక్షలు దేశంలోనే చిచ్చుపెట్టాయి. విద్యార్థులు ఏ మతానికి చెందిన వారైనా యూనిఫాం ఒకటే ధరించాలి గాని బురఖా వేసుకూడదనే కొత్త షరతు విమర్శల పాలైంది. దీనిపై రాజ్యాంగరీత్యా తమకు గల హక్కులను గురించి ముస్లిం సంస్థలు చేసిన పోరాటం, వాదోపవాదాల మధ్య విద్యా సంవత్సరాన్నే దెబ్బతినిపోయింది. కర్నాటక హైకోర్టు కూడా ఇందుకు మద్దతు తెల్పడంతో కేసు సుప్రీం కోర్టు దాకా వెళ్లింది. అక్కడ కూడా కొందరు న్యాయమూర్తులు మతపరమైన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికీ అది అపరిష్కృతంగానే ఉంది. టిప్పుసుల్తాన్ జయంతి విగ్రహ స్థాపన వంటి విషయాలపై సంఘ్ పరివార్ సృష్టించిన వివాదం మరో రభజకు దారితీసింది. దీనికి పరాకాష్టగా, ఎన్నికల తేదీ ప్రకటనకు కొద్దిగా ముందే హోంమంత్రి అమిత్ షా కర్నాటకలో ముస్లింలకు కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్ ఎత్తివేస్తామని ప్రకటించారు. తమ హిందూత్వ రాజకీయాలకు దక్షిణ భారత దేశంలో కర్నాటకను కేంద్రంగా చేసుకోవాలన్నదే ఇక్కడ దుర్నీతి. వీటన్నిటి ఫలితంగా రాష్ట్రంలో ఇస్లామిక్ తీవ్రవాద శక్తులు కూడా కొంత పట్టు సంపాదించడంతో బీజేపీ మరింత వ్యతిరేతను రెచ్చగొట్టే అవకాశం కలిగింది. మతాంతర వివాహాలు మత మార్పిళ్లు, చరిత్ర పాఠాల మార్పు వంటి నిర్ణయాలన్నీ ఇందుకే కారణమైనాయి. లింగాయత్‌లలో పట్టు పెంచింది యెడ్యూరప్ప అయినా ఆ సమీకరణాలలో కొత్త ఫార్ములాలు తీసుకురావాలన్న కోణంలోనే ఆయనను తప్పించి బొమ్మైని తీసుకొచ్చారు. ముస్లింలకు రద్దుచేసిన నాలుగు శాతం రిజర్వేషన్లలో వొక్కలింగ లింగాయత్ రిజర్వేషన్ రెండు శాతం చొప్పున కోటా ఇవ్వడం ఇందులో భాగమే. దీనివల్ల ఆ తరగతులు కూడా సంతృప్తిచెందింది లేదు. ముఖ్యమంత్రి ఇంటిదగ్గర నిరసనలు కూడా జరిగాయి. అధిష్టానం తనను దూరం పెట్టడం జీర్ణించుకోలేని యడ్యూరప్ప అసంతృప్తి శిబిరం నడిపించారు. ఆఖరుకు ప్రధాని మోడీ స్వయంగా వచ్చి ఆయనను బహిరంగ వేదికపై పొగిడి బుజ్జగించాల్సి వచ్చింది. అవినీతి ఏ స్థాయికి చేరిందంటే కాంట్రాక్టర్ల సంఘం తాము 40శాతం కమిషన్లు భరించలేక బహిరంగ ప్రకటన చేశారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటనకు ముందే రూ.93కోట్లు అక్రమ ధనం పట్టుపడటం దీనికో ఉదాహరణ. ఇదేగాక గిడ్డంగులలో గుట్టలు పేర్చిన మద్యం ఖరీదైన కానుకలు భారీ ఎత్తున పట్టుపడ్డాయి. ఇవి బీజేపీ జాతీయ కార్యదర్శిగా ఉన్న ఎంఎల్‌ఏ సిటి రవికి సంబంధం చినవిగా తేలింది. కర్నాటక సోప్స్ డిటర్జంట్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న మదల్ విరూపాక్షను లోకాయుక్త అభిశంసించగా ముందస్తు బెయిల్ కూడా రద్దయి అరెస్టయ్యారు. అనేక అక్రమ లావాదేవీలలో అనుమానితుడుగా ఉన్న మరో దళారీ అనుమానాస్పద పరిస్థితులలో మరణించారు.

కాంగ్రెస్ ఆశలు, సవాళ్లు

బొమ్మై సర్కారు పట్ల ప్రజల్లో అసంతృప్తి తీవ్రంగానే ఉందని పరిశీలకులు అంచనా వేస్తుంటే అదే తమకు లాభిస్తుందని కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. కాంగ్రెస్‌కు ఎస్సీ, ఎస్టీలు, వక్కలింగలు ప్రధాన మద్దతుదారులుగా ఉన్నారు. సిద్ధరామయ్యతో సహా బలమైన గుర్తింపు గల నాయకులు కూడా కాంగ్రెస్‌లో ఉన్నారు. మధ్యలో జేడీఎస్ కూడా పరిమిత ప్రాంతాలలో వక్కలింగలలో పట్టు కలిగివున్నా ఆ ప్రభావం తగ్గుముఖంలో ఉంది. పలుసార్లు రాజకీయ పొత్తులు మార్చిన ఆ పార్టీకి విశ్వసనీయతా లోపం కూడా ఉంది. దక్షిణభారతంలో కాంగ్రెస్ ప్రధాన శక్తిగా ఉన్న ఒకే ఒక రాష్ట్రం ఇదొక్కటే. ఆ విధంగా కర్నాటక ఎన్నికల ప్రభావం జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బీజేపీ ముఖాముఖి తలపడే చోట్ల పరిస్థితికి సంకేతాలుగా నిలుస్తాయి. కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న దళిత నేత మల్లికార్జునఖర్గే స్వంత రాష్ట్రం గనక ఇది ఆయన వ్యక్తిగత ప్రతిష్టకు కూడా ఒక పరీక్షగా ఉంటాయని ఆపార్టీ వర్గాలు అంటున్నాయి. దేశంలో మూడే రాష్ట్రాల్లో ప్రభుత్వాలు నడుపుతున్న కాంగ్రెస్‌కు ఇది చాలా కీలకమైన పరీక్ష. అంతర్గత విభేదాలు కూడా ఎక్కువే అయినా ఏకాభిప్రాయం ఉన్న 124చోట్ల అభ్యర్థులను ప్రకటించి కాంగ్రెస్ ముందుగా రంగంలో నిలిచింది.

20చోట్ల తెలుగు ముద్ర

కర్నాటకకూ తెలుగువారికి సంబంధాలు చారిత్రకమైనవి. తెలుగు వారి సంఘాలు, తెలుగునాట గల పార్టీలపట్ల అనుకూల ప్రతికూలతలు అక్కడ సర్వసాధారణం. మొత్తం కోటి మంది వరకూ



తెలుగువారు అక్కడ ఉన్నారని, బెంగుళూరులోనే పాతికలక్షల వరకూ ఉంటారని తెలుగు సంఘాలు చెబుతుంటాయి. మైసూర్ కర్నాటక, హైదరాబాద్ కర్నాటక, బెంగుళూరు కర్నాటక అని మూడు భాగాలుగా పిలుస్తుంటారు. జేడీఎస్ నాయకుడు కుమారస్వామి కేసీఆర్‌తో కలవడమే గాక బీఆర్ఎస్ ప్రారంభసభకూ హాజరైనారు. అక్కడ ఆ పార్టీ పోటీ చేస్తుందని కూడా కథనాలు వచ్చాయి కాని తర్వాత లేదని వివరణ ఇచ్చారు. జేడీఎస్ ఒంటరిగా పోటీ చేస్తే పొత్తుపెట్టుకోవడమో బలపర్చడమో చేయొచ్చని బీఆర్ఎస్ నాయకులు వెల్లడించారు. తాము స్థానిక ఎన్నికలలో మాత్రం పోటీ చేస్తామన్నారు. 20 నియోజనవర్గాలలో తెలుగువారే నిర్ణాయక శక్తిగా ఉంటారని చెబుతున్నారు. ఇందులో ఒకటైన బాగేపల్లి

ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నాయకత్వ లోపం కారణంగా ఈ సారి తాము గెలిచే అవకాశం లేదని బీజేపీ నేతలు చాలామంది ఒప్పుకుంటున్నారు. ఆరెస్సెస్ నేతల అంచనా కూడా అలాగే ఉంది. అందుకే రాష్ట్రంలో మోడీ, అమిత్ షా వంటివారు విస్తారంగా పర్యటించి గట్టెక్కించాలని తంటాలు పడుతున్నారు. మోడీనే తమ ఎన్నికల ముఖచిత్రంగా ఉంటారని బీజేపీ నేతలు చెప్పడానికి కారణమదే. కాంగ్రెస్ జాతీయ నేతలు కూడా పర్యటనలకు సిద్ధమవుతున్నారు. తనపై పరువునష్టం కేసుకు శిక్ష అనర్హతలకు కారణమైన కోలార్ నియోజకవర్గం నుంచే రాహుల్‌గాంధీ పర్యటన ప్రారంభిస్తున్నారని సమాచారం.

గతంలో సీపీఐ(ఎం) గెలుచుకున్నది. ఇప్పుడు కూడా అక్కడ సన్నాహాల కోసం బి.వి.రాఘవులు, ఎం.ఎ.బేబీ పర్యటించారు. వైసీపీ ఏపీ బయట తాము జోక్యం చేసుకోమని చెబుతున్నా టీడీపీ పరోక్షంగానైనా ఏదైనా చేయొచ్చనే అభిప్రాయం ఉంది. అక్కడ తమ పార్టీని గెలిపించేందుకు సహకరించాలని ఏపీ ముఖ్యమంత్రి జగన్‌ను హోంమంత్రి అమిత్‌షా ఇటీవల కోరారనే కథనాలు ఉన్నాయి. మజ్లిస్ కూడా రంగంలో ఉంటూ ఆప్ కూడా దాదాపు అన్ని స్థానాలలో పోటీ చేస్తానని ప్రకటించడంతో ఓట్ల చీలిక ఇంకా పెరుగుతుందనే అంచనాలు ఉన్నాయి.

పర్యటనల జోరు

ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నాయకత్వ లోపం కారణంగా ఈ సారి తాము గెలిచే అవకాశం లేదని బీజేపీ నేతలు చాలామంది ఒప్పుకుంటున్నారు. ఆరెస్సెస్ నేతల అంచనా కూడా అలాగే ఉంది. అందుకే రాష్ట్రంలో మోడీ, అమిత్ షా వంటివారు విస్తారంగా పర్యటించి గట్టెక్కించాలని తంటాలు పడుతున్నారు. మోడీనే తమ ఎన్నికల ముఖచిత్రంగా ఉంటారని బీజేపీ నేతలు చెప్పడానికి కారణమదే. కాంగ్రెస్ జాతీయ నేతలు కూడా పర్యటనలకు సిద్ధమవుతున్నారు. తనపై పరువునష్టం కేసుకు శిక్ష అనర్హతలకు కారణమైన కోలార్ నియోజకవర్గం నుంచే రాహుల్‌గాంధీ పర్యటన ప్రారంభిస్తున్నారని సమాచారం. సోనియాగాంధీ కూడా బాధ్యతల విరమణ యోచన తాత్కాలికంగా వాయిదా వేసినట్టు చెబుతున్నారు. 1977, 78లో ఇందిరాగాంధీకి కర్నాటక అండగా నిలిచినట్టే ఇప్పుడూ తోడు కావచ్చనే ఆశ లేకపోలేదు. 2018లో బీజేపీకి 104 సీట్లు 36.35శాతం ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 78 సీట్లు 38.14 శాతం ఓట్లు వస్తే జెడిఎస్‌కు 37సీట్లు 18.3శాతం ఓట్లు రావడం అక్కడ తీవ్ర విభజనను తెల్పుతాయి. జేడీఎస్ ప్రభావాన్ని మరింత తగ్గించి ఆ స్థానంలో తాను ప్రవేశించాలనేది బీజేపీ వ్యూహంలో ఒక ముఖ్యాంశం. ఈ ఫలితాల ప్రభావం వెంటనే జరిగే తెలంగాణ ఎన్నికలపైనా 2024 లోక్‌సభ సమరంపైనా ప్రభావం చూపించడం ఖాయం. కనుకనే కర్నాటకలో బీజేపీని అధికారానికి దూరం చేయడం ప్రతిపక్షాల ఉమ్మడి లక్ష్యంగా ఉంది. ఇందులో ఎవరి వ్యూహాలు ఏ మేరకు ఫలిస్తాయనేది ఓటర్లే తేల్చి చెబుతారు. •



'ఆటిజం' పిల్లల్ని పట్టించుకోరా?



ఎం. అడివయ్య
9490098713

ప్రపంచ ఆటిజం అవేర్‌నెస్ డే గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది. ప్రతి ఏడాది ఏప్రిల్ 2 అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన రోజు ఇది. ప్రపంచవ్యాప్తంగా ఆటిస్టిక్ వ్యక్తుల గురించి అవగాహన పెంచడానికి చర్యలు తీసుకోవాలని ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలను యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ తీర్మానం ఆదేశించింది. ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలు దీన్ని యుఎన్ జనరల్ అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించాయి. మానవ హక్కులను మెరుగు పరచడం కోసం ఐరాస అమలు చేస్తున్న కార్యక్రమాల్లో ఆటిజం దినోత్సవం ఒక్కటి. "ఆటిజం అవేర్‌నెస్ డే", "ఆటిజం అవేర్‌నెస్ మంత్" అనే పదాలు తరచుగా న్యాయ నిపుణులు ఉపయోగిస్తున్నారు. ఆటిజంపై ఐరాస ఒప్పందాలను అమలు చేస్తామని భారత ప్రభుత్వం కూడా సంతకం పెట్టింది. కానీ ఆ దిశగా కృషి చేయడం లేదు. ఆటిజంతో బాధపడుతున్న పిల్లలు ఎదుర్కొనే ఇబ్బందులను అర్థం చేసుకోవడం చాలా కష్టం. ఆటి జంతో బిడ్డను కలిగి ఉండటం అంత తేలికైన పరిస్థితి కాదు. పిల్ల వాడు అనేక సామాజిక సమస్యలను ఎదుర్కోవడమే కాకుండా, పిల్లలకు భద్రత, గౌరవం, అవకాశాలను నిర్ధారించడం తల్లిదండ్రులకు కూడా కష్టమవుతుంది.

ఆటిజంను "ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్" (ఏఎస్‌డీ) అని కూడా పిలుస్తారు. ఇది జీవితంలో మొదటి మూడు సంవత్సరాలలో అభివృద్ధి చెందుతుంది. సామాజిక, కమ్యూనికేషన్ సామర్థ్యాల పరంగా మెదడు సాధారణ అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది. ఇది నాడీ సంబంధిత (నాడీ వ్యవస్థ) పరిస్థితి, దీనిలో మెదడు నాడీ కణాలు సమస్యలను కలిగిస్తాయి. పిల్లలకి 18నెలల వయస్సు వచ్చేటప్పటికి తల్లిదండ్రులు ఏదో తప్పును గుర్తిస్తారు. పిల్లవాడు 1 లేదా 2 సంవత్సరాల వయస్సు వరకు సాధారణంగా ఉంటాడు. తరువాత సామాజిక, భాషా నైపుణ్యాలను కోల్పోతారు. లక్షణాలు తేలికపాటి నుండి తీవ్రమైన వరకు మారుతాయి. ఆటిజం అత్యంత వేగంగా విస్తరిస్తోంది. ఆటిజంతో బాధపడే పిల్లలు అందరూ ఒకే రకంగా ఉండరు. 2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశంలో సుమారు 50లక్షల మంది పిల్లలు ఆటిజంతో బాధపడుతున్నారు. కానీ ప్రస్తుతం ఈ సంఖ్య అనేక రెట్లు పెరిగింది. ప్రతి 66మంది పిల్లలలో ఒక్కరికి ఆటిజం సమస్య ఈ సమస్య కలిగిన పిల్లల్లో 40శాతం మంది పిల్లలు మాట్లాడలేక పోతున్నారు. ఇది బాలికల కంటే అబ్బాయిల్లో 40శాతం ఎక్కువగా నిర్ధారణ అవుతుందనీ ప్రభుత్వ లెక్కలు చెబుతున్నవి. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ఆటిజంను కూడా అంగవైకల్యంగా గుర్తించింది. కానీ నేటికీ వారికి వైకాల్య ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదు. నేషనల్ ట్రస్ట్ ద్వారా ఆటిజం, సెరిబ్రల్ పాల్సి, మానసిక వికలాంగుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. కేంద్ర ప్రభుత్వం నేషనల్ ట్రస్ట్‌కు చైర్మన్‌ను నియమించకుండా కాల యాపన చేస్తోంది. రూ.100కోట్ల కార్పస్ ఫండ్‌తో నేషనల్ ట్రస్ట్ ఉన్నా అది ఎవ్వరికి ఉపయోగపడటం లేదు.

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 5లక్షల మంది పిల్లలు ఆటిజంతో బాధపడుతున్నారు. వీరి గురించి ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. రాష్ట్రంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రయి వేటు సంస్థలు ఆటిజం సమస్యపై ప్రత్యేక కేంద్రాలను నడుపుతున్నవి. రాష్ట్ర వ్యాపితంగా వందలాది ప్రయివేటు క్లీనిక్స్ నడుస్తున్నవి. ఆర్థిక స్థోమత లేనటువంటి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ప్రయివేటు క్లీనిక్స్ విచ్చలవిడిగా నెలకు రూ.15వేల నుండి 50వేలు ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రయివేటు క్లీనిక్స్‌పై ప్రభుత్వ పర్యవేక్షణ ఉండవలసిన అవసరం ఉంది. సికింద్రాబాద్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే నేషనల్ ఇనిస్టిట్యూట్ అఫ్ మెంటల్లి హ్యాండిక్యాపడ్(ఎన్ఐఎంహెచ్) ఉంది.కానీ అక్కడ సరిపడా సిబ్బంది లేరు. పరికరాలూ అంతకన్నా లేవు. 33జిల్లాల నుండి ట్రీట్‌మెంట్ కోసం చంటి పిల్లలతో హైదరాబాద్‌కు రావడం చాలా కష్టం. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో మూడేండ్ల వయస్సు కలిగిన పిల్లలకు ఆటిజం పరీక్షలు నిర్వహించి, వారికోసం ప్రభుత్వం ఉచితంగా థెరపీ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.ఆటిజం సమస్య కలిగిన పిల్లలకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆటిజం స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలి. ఆటిజంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రుల్లోనూ, సమాజంలో ఆటిజంపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. (నేడు అంతర్జాతీయ ఆటిజం డే)

రిపోర్టర్స్ డైరీ

జర్నలిజం భయపడుతోంది!

ప్రశ్నించే గొంతుకను పాలకపక్షాలు ఫిర్యాదులు, కేసులు, బెదిరింపులతో గొంతు నొక్కుతున్నాయి. జర్నలిస్టులు... ప్రశ్నించే తోటి జర్నలిస్టులపై ప్రెస్‌మీట్‌లోనే అధికార పార్టీ నేత విషం కక్కితే బాధిత జర్నలిస్టుకు ఫొటోలు, వీడియోలు షేర్ చేసేందుకు సైతం భయపడుతున్నారు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలంలో 'ముప్ప మౌనం ఎందుకో!' అనే కథనాన్ని రాసినందుకు దళితుడు కానీ ప్రజా ప్రతినిధి సదరు విలేకరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశాడు. ప్రధాన మీడియా సభ్యుల సంస్థలకు ఫిర్యాదులు లేదంటే మీడియా ప్రతినిధుల సతీమణుల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలపై ఫిర్యాదులు, అధికారులతో విచారణలు చేపడతానని బెదిరింపులకు గురిచేస్తాడని ముందు గానే భయపడు తున్నారు. ఉగాది పండుగ రోజు ఆలయం వద్ద ఫ్లెక్సీ పెడితే తండ్రి, కొడుకులను తన అనుమతి తీసుకోలేదని సర్పంచ్ భర్త అసభ్యకరంగా దూషించి, కాలితో తన్ని మళ్లీ తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. దీనిపై పట్టించుకోని అదే మీడియా అదే రోజు పిచ్చికుక్క కరిస్తే నలుగురికి గాయాలు' అనే వార్త రాయడం పట్ల పాలకపక్షాన్ని ప్రశ్నించాల్సిన జర్నలిజం ఎంత భయపడుతుందో అని నవ్వు కుంటున్నారు జనం. - జాదవ్ శరత్

ధర్మ సూక్ష్మం

యథావిధిగా శ్రీమహావిష్ణువు యోగ నిద్రలో ఉన్నాడు. ఆదిలక్ష్మి తన భర్త పాదములు ఒత్తుతున్నది. లక్ష్మికి ఏదో అనుమానం వచ్చింది. తన సందేహాన్ని తీర్చుకొనుటకై "స్వామీ!" అని భర్తను పిలిచింది. కానీ స్వామి వారు శ్రీదేవి పిలుపును ఆలకించలేదు! నిద్రను వీడలేదు! ఇంతలో నారదుడు ప్రవేశించాడు. వసస్తానే "నారాయణ! నారాయణ!" అంటూ కీర్తించాడు.

శ్రీహరి కళ్ళు తెరిచి, "ఏమి! నారదా బహుకాల దర్శనము! ఏమి భూలోక విశేషాలు?" అని చిరునవ్వుతో కుశలప్రశ్నలు వేశాడు.

"ఆహాహా! పాదాలు ఒత్తే దేవేరి పిలుపు ఆవధరించరుగాని, కీర్తనలు చేసే భజన పరులను మాత్రం ఆదరిస్తారు" అన్నది ఆదిలక్ష్మి ఆగ్రహంగా.

"ఆగ్రహించకు దేవీ! నారదుడు భజనపరుడే కాదు! మన మనవడు పైగా మన ఇంటికి వచ్చినాడు. అతడు కలహభోజనుడు. మన ఇంట్లోకి రాకుండానే భోజనం దొరికనట్లున్నది!" అన్నాడు శ్రీహరి.

"ఎంత మాట స్వామి! ఆది దంపతుల మధ్య కలహం పెట్టగల సమర్థుడనా! ఏదో మీ జగన్నాటకంలో నేనూ ఒక పాత్రధారినే. అంతే. ఒక సందేహము నివృత్తి చేసుకొనుటకై మీ దర్శనం చేసుకుంటిని కాని మా నాయనమ్మ గారేమో కారాలు, మిరియాలు నూరుతున్నారు. నాకు సెలవిప్పించండి!" అన్నాడు నారదుడు.

"ఎంత మాట నారదా! నేనూ సందేహ నివృత్తికే స్వామివారిని పిలిచాను! ఇంతలో నీవు వచ్చి పిలిచారు! స్వామి నీకు ముందుగా ప్రసన్నమయ్యారు! అంతే కానివ్వు!" అన్నది లక్ష్మి నవ్వుతూ.

"చిత్తం! భావప్రకటనా స్వేచ్ఛ అంటే ఏమిటో తెలుసుకుందామని వస్తిని స్వామి!" అన్నాడు నారదుడు.

"స్వామీ! నాకునూ ఇదే సందేహం కలిగినది!" అన్నది లక్ష్మి ఆశ్చర్యంగా.

శ్రీహరి ముసి ముసి నవ్వు నవ్వాడు "ఇది చాలా చిన్న ప్రశ్న! మన భారతదేశం వెళ్ళినచో మీకు బోధపడును కదా!" అన్నాడు.

"వద్దు! తాతగారు ఇప్పుడున్న పరిస్థితుల్లో నన్ను అక్కడికి పంపించవద్దు!" అన్నాడు నారదుడు.

"ఎవరి అభిప్రాయాలు వారు స్వేచ్ఛగా వెల్లడించగల స్వేచ్ఛనే భావ ప్రకటనా స్వేచ్ఛ అంటారు నాయనా! ఇది ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకం. భారత రాజ్యాంగం ఈ హక్కును కల్పించింది! అది తెలుసుకోగలవని నిన్ను అక్కడికి వెళ్ళమంటిని!" అన్నాడు శ్రీహరి.


"అక్కడ భావ ప్రకటనా స్వేచ్ఛ కొందరికే ఉన్నది. ముఖ్యంగా అధికారంలో ఉన్నవారే ఆ హక్కును అనుభవిస్తున్నది. మిగిలినవారు ఆ హక్కును అనుభవించే ప్రయత్నం చేసినా అరెస్టు అవుతున్నారు!" అన్నాడు నారదుడు.

"అధికారంలోని వారు భావప్రకటనా స్వేచ్ఛ ఉన్నదని ప్రజల సమైక్యత, దేశ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ప్రకటనలు చేయరాదు కదా! నిజానికి ఆ స్వేచ్ఛను దుర్వినియోగం చేయటం అని గుర్తించాలి!" అన్నాడు శ్రీహరి.

"స్వామీ విమర్శకు, నిందకూ, ఎత్తిచూపటానికి, అప్రతిష్ఠపాలు చేయటానికి వ్యత్యాసం లేదా!" అడిగాడు నారదుడు.


"లేకేమి నారదా! విమర్శ తప్పును ఎత్తి చూపి సరిచేయుటకు నిందించటం అప్రతిష్టపాలు చేయటానికి తోడ్పడుతాయి!" అని వివరించాడు శ్రీహరి.

"అధికారంలో ఉన్నవారు విమర్శలకు, ప్రశ్నలకు అతీతులా? వారిని ఎవరూ పల్లెత్తు మాట అనటం ప్రజాస్వామ్యంలో నేరమా?" మళ్ళీ ప్రశ్నించాడు నారదుడు.



శ్రీహరి చిరునవ్వుతో లక్ష్మీదేవి వంక చూశాడు.

"నీ ప్రశ్నకు నా అవతారాల్లోనే సమాధానాలు ఉన్నాయి! లోతుగా పరిశీలిస్తే అర్థమవుతుంది! నేనే వివరిస్తాను విను నేను కృష్ణావతారం దాల్చినప్పుడు శమంతక మణిని నేనే దొంగిలించానని నాపై కొందరు అపవాదు మోపినారు! అలాంటి వారిని నేను ఖైదు చేయటమో, జరిమానా విధించటమో చేయలేదు! నేను శమంతకమణి దొంగిలించలేదని రుజువు చేయటానికి ఎంతో కష్టపడి, ఆ మణి ఎక్కడుందో తెలుసుకుని, జాంబవంతుడితో యుద్ధం చేసి, ఓడించి ఆ శమంతకమణి తెచ్చి, సత్రాజిత్తుకి అందచేసి, నా నిజాయితీని నిరూపించుకున్నాను!" అన్నాడు.



నజర్

"తన నిజాయితీని నిరూపించుకునే క్రమంలోనే జాంబవతిని, సత్యభామలను నాకు చెల్లెళ్ళుగా చేశాడు శ్రీవారు!" అన్నది మహాలక్ష్మి శ్రీహరి ముసి ముసిగా నవ్వాడు.

"అధికారంలో ఉన్నవారిని, మీ అర్హతలు, యోగ్యతలు, చూపమని ప్రజలు తెలుసుకునే హక్కు ప్రజాస్వామ్యం కలదా ప్రభూ!" అని అడిగాడు నారదుడు.

శ్రీహరి మరోసారి నవ్వాడు.

"తమను పరిపాలించే వారి గురించే తెలుసుకునే హక్కు ప్రజాస్వామ్యంలో ప్రజలకున్న గొప్ప హక్కు. సమాచార హక్కు పేరిట ప్రజలకు ఈ హక్కును కల్పించి ప్రజాస్వామ్యాన్ని అత్యున్నత స్థానంలో నిలబెట్టింది భారతదేశం. అయితే నీవడిగిన ప్రశ్నకు రామావతారం దాల్చి, త్రేతాయుగంలోనే సమాధానం ఇచ్చాను!" అన్నాడు శ్రీహరి.

నారదుడికి రామావతారంలో తన ప్రశ్నకు ఏవిధంగా సమాధానం ఉండేనో స్ఫూరించలేదు! దాంతో బుర్ర గోక్కున్నాడు.

"నిత్యమూ నా నామాన్నే జపించే నీవే మర్చిపోతే ఎట్లా నారదా! వివరిస్తాను విను! నేను సీతను వెతుకుతూ సుగ్రీవుడిని కలుసుకున్న విషయం నీకు తెలుసుకదా! అప్పుడు వాలికి తనకున్న వైరం గురించి చెబుతూ, వాలి మహాబలశాలి యనీ, ఒక్క గుద్దుతో మూడు తాటిచెట్లను కూల్చగల శక్తిశాలి యని, మరి నాకు అంతశక్తి ఉందా? సుగ్రీవుడు సందేహం వ్యక్తం చేశాడు. అంటే నేను వాలికంటే బలవంతుడినా అని నా బల పరాక్రమాల మీదా, నా యోగ్యత మీద సందేహం వ్యక్తం చేశాడు. నా యోగ్యత మీద అనుమానం వెలిబుచ్చినందుకు సుగ్రీవుడి మీద నా తమ్ముడైన లక్ష్మణునికి కోపం వచ్చింది. కాని నేను లక్ష్మణుని వారించి, ఒక్క బాణంతో ఏడు తాటిచెట్లను కూల్చి, నా యోగ్యతను నిరూపించుకున్నాను! ప్రభువైన వాడు ఆచరించవలసిన తీరు తెన్నులను నేను నా అవతారాలలో స్పష్టంగా వివరించాను!" అన్నాడు శ్రీహరి.

"రాజే సాక్షాత్తూ మహావిష్ణువు! అన్న నానుడి గలిగిన త్రేతద్వాపర యుగాల్లోనే మీరు దాల్చిన అవతారాల్లో రాజు ఎంత ప్రజాస్వామ్యయుతంగా ఉండాలో ఆచరించి చూపారు. మీ అవతారాల్లో ఇదే ముఖ్యమైన పరమార్థమని నేడు నేను తెలుసుకోగలిగాను. మీ అవతారాల్లోని ఈ ధర్మసూక్ష్మాన్ని, ఈనాటి ప్రజాస్వామ్య ప్రభువులు అర్థం చేసుకుని ఆచరిస్తే, అది నిజమైన ప్రజాస్వామ్యం అనిపించుకుంటుంది! ధన్యుడిని స్వామి సెలవు!" అంటూ నారదుడు సెలవు తీసుకున్నాడు.

- ఉషాకిరణ్

నియమాలు పాటిస్తున్నారా?

అందంగా, ఆరోగ్యంగా మెరిసే చర్మం కావాలనుకోవడం సహజమే! అందుకు తగ్గ నియమాలు పాటిస్తున్నారా మరి? అవేంటంటే..



- ఎండకి వీలైనంత దూరంగా ఉండండి. ఇది చర్మానికి హాని చేయడమే కాదు.. ఇతర సమస్యలనూ కలిగించ గలదు. అంతేకాదు వృద్ధాప్య ఛాయ లకీ ఇదే ప్రధాన కారణం. ఎండలోకి వెళ్లాల్సి వస్తే బ్రాడ్ స్పెక్ట్రమ్ సన్ స్క్రీన్‌ని తప్పనిసరిగా రాయాలి. సహజ సౌందర్య ఉత్పత్తులకు ప్రాధాన్యమివ్వండి. రసాయనాలు, ప్రిజర్వేటివ్స్‌తో కూడినవి చేటు చేయగలవు.
- చర్మానికి లోపలి నుంచి పోషణ కావాలి. కాబట్టి ఆరోగ్యానికి హాని కలిగించే ప్రాసెస్డ్, చక్కెర పదార్థాలు, జంక్ ఫుడ్‌కి దూరంగా ఉండాలి. బదులుగా తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలకు ప్రాధాన్యమివ్వాలి. రోజులో తగినన్ని నీరు తాగుతున్నారా లేదా అన్నది చూసుకోవాలి.
- ఒత్తిడి ప్రభావం మనసుపైనే కాదు.. చర్మంపైనా పడుతుంది. యాక్నే, త్వరిత వృద్ధాప్యఛాయలు వంటి ఎన్నో సమస్యలకు కారణమవుతుంది. కాబట్టి ఒత్తిడిని తగ్గించుకునే మార్గాలపై దృష్టి పెట్టండి. 7-8 గంటల నిద్ర తప్పనిసరి చేసుకోండి.
- చర్మానికి రోజువారీ సంరక్షణ మంచిదే. అయితే అది హద్దు దాటుతోందేమో కూడా చూసుకోవాలి. అతిగా స్క్రబింగ్, పదే పదే ఉత్పత్తులను మార్చడం వంటి వన్నీ చర్మంపై ఒత్తిడికి కారణమవుతాయి.



పుట్టుకతో చూపు లేకపోతే అదో భరించలేని బాధ. ఎలాగో అలవాటు పడిపోతాం. అయితే జీవితంలో ఓ స్థాయికి వచ్చి ఉద్యోగం సంపాదించి, ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత చూపు పోతే. ఇక ఆ బాధ మాటల్లో చెప్పడం కష్టం. అప్పటి వరకు అంతా చూస్తున్న ఆ కండ్లు ఇక ఏమీ చూడలేవని తలచుకుంటే... గుండెలు జారిపోతాయి. అలాంటి బాధనే భరించారు నాగేంద్రమ్మ. తన బిడ్డకు ఆరేండ్లున్నపుడు కండ్లతో చూసుకున్నారు. ఇప్పుడు ఆ బిడ్డ రూపు రేఖలు ఎలా ఉంటాయో తెలియదు. ఇది తలచుకుంటే ఆమెకు ఏడుపు తన్నుకొస్తుంది. చూపు కోల్పోయిన కొత్తలో రెండేండ్లు అత్యంత క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కొన్నారు. చివరకు దాక్టర్లు, భర్త, బిడ్డ ఇచ్చిన ధైర్యంతో ముందుకు సాగుతున్నారు. అంతే కాదు తనలాంటి వారికి చేతనైన సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. అందుకే బ్లయిడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌లో పని చేస్తున్నారు. ప్రస్తుతం దానికి మహిళా కార్యదర్శిగా బాధ్యతలు చూస్తున్న ఆమె స్ఫూర్తిదాయక ప్రయాణం నేటి మానవిలో...

కన్నుల్లో చీకట్లు చేరినా కల మానలేదు!

నాగేంద్రమ్మ ఖమ్మం జిల్లా, ఎర్రిపాలెం మండలం, జమలాపురం గ్రామంలో పుట్టారు. తండ్రి భూక్యా పరుసు కార్పెంటర్‌గా పని చేస్తున్నారు. తల్లి చిట్టెమ్మ. వీరికి నలుగురు పిల్లలు. నిరుపేద కుటుంబం. అయినా ఎంతో కష్టపడి అందరినీ చదివించాడు తండ్రి. నగేంద్రమ్మ ఇంట్లో అందరి కంటే పెద్దది. సెలవులు వస్తే తను కూడా ఏదో ఒక పనికి పోయి ఆర్థికంగా సహకరించేది. చెల్లెళ్ళు, తమ్ముడుని కూడా తనే చూసు కునేది. పదో తరగతి చదవడానికి వారి ఊరి నుండి 7 కి.మీ నడిచి వెళ్ళేవారు. అప్పట్లో బస్సులు కూడా ఉండేవి కావు. అంత కష్టపడి చదువుకున్నారు. ఆమె ఇంటర్‌కి వచ్చే వరకు కనీసం వాళ్ళ ఇంట్లో కరెంట్ కూడా లేదు. డిగ్రీ ఖమ్మం ఉమెన్స్ కాలేజీలో పూర్తి చేశారు. బి.ఇడి హన్మకొండలో పూర్తి చేశారు.

కుటుంబం అండతో...

ఎంత ధైర్యంగా నా జీవితాన్ని, ఉద్యోగాన్ని కొనసాగిస్తున్నా కొందరు ఎగతాళి చేస్తుంటారు. మా అమ్మాయి ప్రస్తుతం ఇంటర్ చదువుతుంది. ఎప్పుడో ఆరేండ్లు ఉన్నప్పుడు తన ముఖాన్ని చూశాను. ఇప్పుడు తను ఎలా ఉంటుందో కూడా తెలియదు. తలచుకుంటే ఏడుపు వస్తుంది. మొదటి నుండి కండ్లు లేకపోతే ఇంత బాధ ఉండేది కాదు. మధ్యలో ఇలా జరగడం వల్ల భరించలేని బాధను అనుభవిస్తున్నాను. ఇప్పటికీ ఎన్నో రాత్రులు ఏడుస్తూ ఉంటాను. మావారు, మా అమ్మాయి నాకు చాలా సపోర్ట్ చేస్తున్నారు. నాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటారు. మా అమ్మాయి 'నీకేం కావాలన్నా నేను చూసుకుంటాను మమ్మీ' అంటుంది. నా భర్త నాకు తోడుగా ఉండడం కోసం తన ఉద్యోగాన్ని వదిపెట్టేశారు. నేను ఇప్పుడు ఈ స్థాయిలో ఇలా ఉన్నానంటే దానికి కారణం నా భర్త. అలాగే నా తల్లిదండ్రులు, తోబుట్టువులు ఇచ్చిన ప్రోత్సాహమే.

ఉద్యోగం సంపాదించి...

డిగ్రీ తర్వాత బంధువుల



అబ్బాయి సామ్యతో పెండ్లి జరిగింది. తర్వాత భర్త ప్రోత్సాహంతో హన్మకొండలో బిఈడ్ చేశారు. 2010లో కాకతీయ యూనివర్సిటీలో ఎమ్మె ఓపెన్‌గా పూర్తి చేశారు. 2002లో టీచర్‌గా పోస్టింగ్ వచ్చింది. సొంత గ్రామంలో తను చదువుకున్న పాఠశాలలోనే 9 ఏండ్లు చేశారు. తర్వాత 2010లో హెడ్ మాస్టర్‌గా ప్రమోషన్ వచ్చింది. దాంతో వాజేడు మండలం, అరుణాచలపురంలో కొన్ని నెలలు పని చేశారు. ఆ తర్వాత పినపాక మండలం, ఎల్చిరెడ్డిపల్లికి బదిలీ అయ్యారు. ఆ ప్రాంతం అత్యంత దూరంగా ఉంటుంది. ఆ సమయానికి వీరికి నాలుగేండ్ల పాప జోషరిత ఉంది. పాపను వదిలి అంత దూరం ఉద్యోగానికి వెళ్ళవలసి వచ్చేది. ప్రయాణం కూడా చాలా కష్టంగా ఉండేది. బస్సులు కూడా సరిగా ఉండవు. దాంతో అక్కడే ఓ గది తీసుకుని వుంటూ వారాంతరాల్లో ఖమ్మం వచ్చి పోయేవారు.

అకస్మాత్తుగా...

నాగేంద్రమ్మకు చిన్నతనం నుండి కంటి సమస్య ఉంది. ఏడో తరగతికి వచ్చే సరికి అక్షరాలు సరిగా కనిపించేవి కాదు. దాంతో తండ్రి దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్ళారు. అక్కడ తాత్కాలికంగా కళ్ళజోడు ఇచ్చారు. హైదరాబాద్ తీసుకొచ్చి పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్ళి చూపించే అవగాహన కానీ, ఆర్థిక స్తోమత కానీ అప్పట్లో ఆయనకు లేవు. దాంతో నాగేంద్రమ్మ అలాగే తన చదువు కొనసాగించారు. అప్పుడు ఆమె ఎల్చిరెడ్డి పల్లిలో ఉద్యోగం చేస్తున్నారు. ఎప్పటిలాగే ఆరోజు కూడా తెల్లవారు జామున 5గంటలకు భర్త ఆమెను బస్సు ఎక్కించేందుకు ఖమ్మం బస్టాప్‌కు వచ్చాడు. ఆకస్మాత్తుగా ఆమెకు కొన్ని సెకండ్లు కండ్లు తిరిగాయి. తర్వాత ఏమీ కనిపించడం లేదు. కండ్ల జోడు ఉన్నా ఏదో నీడ మాత్రం కంటి ముందు కనిపిస్తుంది. అప్పుడు ఆమె వయసు 34 ఏండ్లు. సరిగా నిద్రలేకపోవడం వల్లనేమో కొద్ది సేపటిలో అంతా మామూలు అవుతుందనికుని అలాగే బస్సు ఎక్కి నిద్రపోయారు. చివరకు తను దిగాల్సిన స్టేజ్ వచ్చింది అయినా కంటి ముందు అంతా అలికినట్టే ఉంది. ఏమీ కనిపించడం లేదు. దాంతో స్కూల్లో మధ్యాహ్నం వరకు ఉండి సెలవు పెట్టి ఓ మాస్టారు సహాయంతో బస్సు ఎక్కి ఖమ్మం వచ్చి భర్తకు చెప్పారు. వెంటనే ఖమ్మంలోనే ఓ డాక్టర్ దగ్గరకు వెళితే హైదరాబాద్ వెళ్ళి చూయించుకుంటే మంచిదని సలహా ఇచ్చారు.

కుంగిపోయారు...

హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి వెళితే అన్ని రకాల టెస్టులు చేశారు. రెండు మూడు రోజులు పట్టింది. కోటి మందిలో ఒక్కరికి ఇలాంటి సమస్య వస్తుందన్నారు. దీనికి ఎలాంటి ట్రీట్‌మెంట్ లేదన్నారు. ప్రస్తుతం ఆమెకు పగలు, రాత్రి మాత్రమే తెలుస్తాయి. ముందు ఎవరో మనిషి ఉన్నట్టు కనిపిస్తుంది కానీ ఎవరో అర్థం కాదు. ఈ చూపు కూడా ఎంత కాలం ఉంటుందో చెప్పలేము అన్నారు. తర్వాత ఎంతోమంది డాక్టర్లను కలిశారు, అయినా లాభం లేదు. తెలిసిన వారు చెబితే చివరగా సరోజిని ఆస్పత్రికి వెళ్లారు. ఎక్కడో చిన్న ఆశ ఆమెలో. కానీ అక్కడ కూడా ట్రీట్‌మెంట్ లేదనే అన్నారు. దాంతో కుంగిపోయారు. తన భవిష్యత్తును, బిడ్డ జీవితాన్ని తలచుకుని భయపడ్డారు. ఇలాంటి పరిస్థితి వస్తుందని ఎప్పుడూ ఊహించ లేదు. ఆమె భయాన్ని గమనించి సరోజని ఆస్పత్రిలోని సీనియర్ డాక్టర్ విశ్వనాథ్ ధైర్యం చెప్పి ట్రైనింగ్ ఇప్పించారు.

సహాయకురాలి సాయంతో...

ఆ తర్వాత రెండేండ్లు బాగా ఇబ్బంది పడ్డారు. సంతకం కూడా పెట్టలేని పరిస్థితి. ఎంతో కష్టపడి సంపాదించుకున్న ఉద్యోగం ఉంటుందో లేదో తెలియదు. అంధ ఉద్యోగులకు ప్రభుత్వం సర్టిఫికేట్ ఇస్తుందని ఎవరో చెప్పారు. ఆ సర్టిఫికేట్ ఉంటే ఒక సహాయకురాలి ద్వారా తన ఉద్యోగాన్ని చేసుకోవచ్చని తెలిసింది. దాంతో వెంటనే అందులో దరఖాస్తు చేసుకున్నారు. వాళ్ళు కొన్ని టెస్టులు చేసి సర్టిఫికేట్ ఇచ్చారు. సహాయకురాలిని పెట్టుకునేందుకు పర్మిషన్ ఇచ్చారు. అయితే ప్రభుత్వం నుండి సహాయకురాలికి 15 వందలు ఇస్తారు. ఆ కొద్ది మొత్తంతో రోజంతా ఆమెతో పని చేయడానికి ఎవరూ ముందుకురారు. అందుకే ఏడు వేలు ఇచ్చి ఆమే ఒక సహాయకురాలిని పెట్టుకున్నారు. ఆ సహాయకురాలు చదివితే ఆమె ఆ పాఠాన్ని పిల్లలకు వివరిస్తాను. బోర్డుపైన రాయడం, హోం వర్కులు, పేపర్లు దిద్దడం, ఆన్ లైన్ చేయడం అన్నీ ఆమే చూసుకుంటుంది. ప్రస్తుతం నాగేంద్రమ్మ ఖమ్మం టౌన్‌లోని దానివాయిగూడెం స్కూల్లో హెచ్‌ఎంగా చేస్తున్నారు.

సపోర్ట్ ఇవ్వాలి

మహిళలు సొంత కాళ్ళపై నిలబడడం చాలా అవసరం. చదువు దీనికి చాలా ఉపయోగపడుతుంది. చదువుంటే మనం గౌరవంగా బతకొచ్చు. అంతే కాదు అవకాశం ఉంటే మరొకరికి జీవితాన్ని కూడా ఇవ్వొచ్చు. నాలాంటి వాళ్ళను పై అధికారులు పరిశీలిస్తుండాలి. ఉద్యోగ పరంగా ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అనేది తెలుసుకుని మోరల్ సపోర్ట్ ఇవ్వాలి. అప్పుడు మా చుట్టూ ఉన్నవారు మమ్మల్ని గౌరవిస్తారు. ఉద్యోగ పరంగా నేను కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నాను. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ధైర్యంగా ముందుకు వెళుతున్నాను. మన ఊరు మన బడి అనే కార్యక్రమం నడుస్తుంది. ప్రతీది ఆన్‌లైన్ చేయాలి. చాలా కష్టంగా ఉంటుంది. ఒక్కోసారి ఏడుపు వస్తుంది. నాకే కండ్లుంటే నా పని నేనే చేసుకునేదాన్ని కదా అని అప్పుడప్పుడు అనిపిస్తుంది. నాకన్నా కనీసం పగలూ రాత్రి తెలుస్తుంది. ఈ చూపుకూడా లేని వారు ఎందరో ఉన్నారు. వాళ్ళను చూస్తూ నాకు నేను ధైర్యంగా చెప్పకుంటాను. అయితే ఎం.ఈడి చేయాలనేది నా కోరిక. నాకున్న సమస్య వల్ల చేయలేకపోతున్నాను. ఈ కోరిక అలాగే ఉండిపోయింది.



తనలాంటి వారికి సాయం చేయాలని

చూపు పూర్తిగా కోల్పోయిన ఆమె బ్లయిడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌తో కలిసి పని చేస్తున్నారు. ఆ కుటుంబంలోకి వెళ్లడం తనకు ఎంతో ఓదార్పు నిచ్చిందంటున్నారు. అక్కడ తనకంటే ఎక్కువ ఇబ్బంది పడేవారిని చూసి వారి కంటే తన సమస్య చాలా చిన్నది కదా అని తనకు తానే ధైర్యం చెప్పుకునేవారు. తనలా ఇబ్బంది పడేవారికి తోచిన సాయం చేయాలనే ఉద్దేశంతో ఆ యూనియన్‌లో పని చేస్తున్నారు. మొదట్లో ఆ సంఘానికి మహిళా ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. ప్రస్తుతం మహిళా సెక్రటరీగా బాధ్యతలు చూస్తున్నారు. ఎవరికి ఎలాంటి సాయం కావాలన్నా స్పందిస్తున్నారు. వారి సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న నిరుద్యోగ అంధులకు కూడా కావల్సిన సహకారం అందిస్తున్నారు.

- సలీమ

జీఎస్టీ వసూళ్లు రూ.1,60,122 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో గతేడాది మార్చిలో రూ.3,174 కోట్లు వసూలు అయితే, ఈ మార్చిలో రూ.3,532 కోట్లు వసూలు అయిందని తెలిపింది. గతేడాదితో పోల్చితే, 11.26 శాతం వసూలు పెరిగింది. తెలంగాణలో గతేడాది మార్చిలో రూ.4,242 కోట్లు వసూలు అయితే, ఈ ఏడాది రూ.4,804 కోట్లు వసూలు అయిందని పేర్కొంది. గతేడాదితో పోల్చితే, 13.25 శాతం వసూలు పెరిగింది.

పెరిగిన ఆర్టీసీ టిక్కెట్ ధరలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులపై టోల్ చార్జీలను ఐదు శాతం పెంచుతూ తీసుకున్న నిర్ణయం ఆర్టీసీ ప్రయాణీకులపై పడింది. దీన్ని అవకాశంగా తీసుకొని టీఎస్‌ఆర్టీసీ టిక్కెట్ రేట్లను పెంచింది. పెరిగిన చార్జీలు తక్షణం అమల్లోకి వస్తాయని యాజమాన్యం ప్రకటించింది. ఆర్డీనరి నుంచి గరుడ ప్లస్ వరకు బస్సుల్లో ఒక్కో ప్రయాణికుడిపై టోల్ ప్లాజా ఛార్జీలను రూ.4 వరకు పెంచినట్టు టీఎస్‌ఆర్టీసీ అధికారులు తెలిపారు. నాన్ ఏసీ స్లీపర్ బస్సుల్లో చార్జీని రూ.15 పెంచారు. ఏసీ స్లీపర్ బస్సుల్లో ఒక్కో ప్రయాణికుడిపై టోల్ ఛార్జీ రూ.20 వసూలు చేస్తున్నారు. టోల్‌ప్లాజాల మీదుగా వెళ్లే సిటీ ఆర్డినరీ బస్సుల్లో టిక్కెట్ రేటును అదనంగా రూ.4 పెంచారు.

టోలు తీస్తున్నారు..

(మొదటిపేజీ తరువాయి)

సమయం నుంచి 24 గంటల లోపు వరకు రూ.165 చెల్లించాలి. తేలికపాటి వాణిజ్య వాహనాలు, సరుకు రవాణా వాహనాలు, మినీ బస్సులు అయితే ఒకవైపు ప్రయాణానికి రూ.180 చెల్లించాలి. బస్, ట్రక్ (రెండు ఇరుసుల వాహనాలకు రూ.410, భారీ నిర్మాణ యంత్రవాహనాలకు, బహుళ ఇరుసుల అంటే నాలుగు నుంచి ఆరు ఇరుసుల వరకు వాహనాలకు రూ.715 చెల్లించాల్సి ఉంటుంది. ఒకవైపు వెళ్లడానికి మాత్రమే ఈ చార్జీలు వర్తిస్తాయి. అది కూడా ఫాస్టాగ్ ద్వారా మాత్రమే. నగదు రూపంలో చెల్లించాల్సి వస్తే అదనపు చార్జీలు పడతాయి.

ఇతర ధరల పెరుగుదల

టోల్ చార్జీలను పెంచడం వల్ల ఇతర వస్తువుల ధరలు కూడా పెరిగే అవకాశముంది. ఇప్పటికే గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు మండిపోతున్నాయి. దీంతో వాహనాలకు ధరల భారాలు మోయలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా డీజిల్ ధరలు పెరగడం వల్ల ఆర్టీసీలో బస్ చార్జీలు పెంచారు. తాజాగా టోల్ ధరలు పెరిగినందున ప్రయాణిలకులపైనే ఆ భారం వేయనున్నారు. అదే విధంగా లారీ, ట్రక్కులు, జీపులు, కార్లు, బస్సులు, ఇతర భారీ వాహనాలకు పెట్రోల్, డీజిల్ ధరలు భారంగా మారాయి. రోజువారీగా వచ్చే కిరాయిల కంటే ఆయిల్ ధరలే ఎక్కువవుతున్నాయని స్వంత వాహనదారులు అమ్మేసుకుంటున్నారు. మినీ వాహనాలపై ఈ భారాల ప్రభావం అధికంగా ఉంది. తాజాగా టోల్ ఛార్జీలు పెరిగినందున ప్రతి సరుకుల ధరల్లోనూ పెరుగుల తప్పదని వ్యాపారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా నిత్యవసరాల ధరలు మరింత పెరుగుతాయంటున్నారు. తేలికపాటి వాహనాల ద్వారా నిత్యవసర సరుకులు, కూరగాయలు, పాలు, ఇతర సరుకుల్ని రవాణా చేస్తున్నారు. వీటిపైన డీజిల్, టోల్ ధరల భారం పెరగడంతో చాలా మంది ఈఎంఐలు కట్టలేకపోతున్నారు.



వాహనాలు నడపలేకపోతున్నం
చిలకపల్లి లక్ష్మణ్- మునిపల్లి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ధరలు బాగా పెంచుతోంది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు నాలుగింతలు చేసింద్రు. నిత్యావసరాల ధరలు ఆకాశానంటాయి. వాహనాల్ని రోడ్డెక్కించాలంటే భయమేస్తుంది. ఇట్ల వెళ్లి వద్దామంటే టోల్ చార్జీలు పిండేస్తున్నారు. ప్రతి ఏటా టోల్ చార్జీలు పెరుగుతున్నయి. వాహనాల కిరాయిలు, ఆదాయం మాత్రం పెరగట్లేదు. అప్పులు చేసి వాహనాలు కొనుక్కున్న యజమానులు ఎలా బతికేది. డీజిల్ ధరలు, టోల్ చార్జీలు భరించలేక వాహనాల్ని అమ్మేసుకోవాల్సి వస్తోంది. టోల్ చార్జీలను ఎత్తేయాలని డిమాండ్ చేస్తున్నం. అయినా కేంద్రం పట్టించుకోవడం లేదు.

రైతుల్లారా..ఐక్యమవ్వండి..

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు తమ రాష్ట్రంలో అమలు కావడంలేదన్నారు. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ, దేశంలోని రైతుల కష్టం చూసి రైతుల సమస్యలను తలకెత్తుకున్నానని చెప్పారు. తన 50 ఏండ్ల రాజకీయ అనుభవంలో ఎన్నో ఆందోళనలు, సమస్యలు, ఆటుపోట్లను చూశానని..చిత్తశుద్ధితో ప్రయత్నం చేసి విజయం సాధించామన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి 1935 నుంచి పోరాటాలు సాగుతూనే వున్నాయనీ, సర్ చోటూరామ్, మహిందర్ సింగ్ టికాయత్, శరద్ జోషీ, చౌదరి చరణ్ సింగ్, దేవిలాల్ వంటి నేతల నుంచి నేటి గుర్నామ్ సింగ్ దాకా రైతు సమస్యలపై పోరాటాలు చేస్తూనే ఉన్నారని తెలిపారు. తమ హక్కుల సాధన కోసం నల్ల చట్టాలు ఎత్తేయాలని 13 నెలల పాటు దేశ రైతులు రాజధాని ఢిల్లీ రోడ్లమీద ఆందోళన చేస్తే.. వారిని నక్సలైట్లు అని, తీవ్రవాదులు అనీ కేంద్ర ప్రభుత్వం ముద్రవేసిందన్నారు. ఆసమయంలో రైతుల కోసం ప్రధాని మోడీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని చెప్పారు. 750 మంది రైతులు అమరులైన తర్వాత ప్రధాని దిగివచ్చి రైతులకు క్షమాపణలు చెప్పిన సంగతిని గుర్తుచేశారు. పంజాబ్, యూపీ అసెంబ్లీ ఎన్నికల కోసమే రైతులకు ప్రధాని తియ్యటి మాటలు చెప్పి చట్టాలను వెనక్కు తీసుకున్నాడని అన్నారు. అయినా, ఇప్పటికీ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. గిట్టుబాటు ధరల కోసం రైతులు ఇంకెంత కాలం పోరాడాలి..? అని కేసీఆర్ ప్రశ్నించారు.కేంద్ర వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం దేశంలో మొత్తం 94 లక్షల ఎకరాల్లో వరి పండుతుంటే..ఒక్క తెలంగాణలోనే 56 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా రిజర్వాయర్లల్లో నీళ్లు నిండుగా ఉన్నాయన్నారు. తెలంగాణలో ఇంతటి ప్రగతి సాధ్యమైతే..పెద్ద రాష్ట్రం మహారాష్ట్రలో ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. మన దేశంలో సహజ సంపదలకు కొదువలేకున్నా..అసమర్థ నాయకత్వం వల్ల వెనకబడ్డామని చెప్పారు. రైతుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 4.5 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే.. కేంద్ర ప్రభుత్వం ఎందుకు చేయదన్నారు. తెలంగాణ మోడల్ రైతు సంక్షేమాన్ని మహారాష్ట్రలో అమలు చేసి చూపించేందుకే తాను మహారాష్ట్ర వస్తున్నానని ఫడ్నవీస్ విమర్శలకు కేసీఆర్ బదులిచ్చారు. మోడీ ప్రధాని కాకముందు దేశవ్యాప్తంగా ఎఫ్‌సీఐ గోదాములు నిర్మిస్తుండేదనీ, మోడీ పీఎం అయిన తర్వాత మొత్తం అదానీకి గుత్తకిచ్చారని తెలిపా రు. రైతు సమస్యల పరిష్కారం కావాలంటే రైతు రాజ్యాన్ని తెచ్చుకోవాలని కేసీఆర్ స్పష్టం చేశారు. దీని కోసం రోడ్ల మీద ఆందోళనలు, పోరాటాలు అవసరం లేదు.. లాఠీ దెబ్బలు, తూటాలు తినాల్సిన అవసరం లేదు. ఓటు ఆయుధాన్ని వాడుకుంటే చాలని సూచించారు. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ 200 సీట్లు గెలుస్తుందనీ, అందుకు గట్టి సంకల్పం కావాలని కేసీఆర్ అన్నారు. ఈ సందర్భంగా రైతు నాయకులు అడిగిన ప్రశ్నలకు కేసీఆర్ సమాధానమిచ్చారు. వ్యవసాయం, రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తే తెలంగాణ ఫలితాలే దేశమంతా వస్తాయని కెసిఆర్ వివరించారు.

మహారాష్ట్ర షెట్కారీ సంఘటన్ (మహారాష్ట్రకు చెందిన ప్రముఖ రైతు సంఘం)కు చెందిన ముఖ్య నేతలు సుధీర్ బిందు, కైలాష్ తవార్, శరద్ మర్కాడ్, సువర్ణ కాళే, రాంజీవన్ బోండార్, నారాయణ్ విభూధే, బీజి కాకా, అనిల్ రజంకార్, పవన్ కర్వార్, భగవత్ పాటిల్, తదితరులు కేసీఆర్ సమక్షంలొ బీఆర్‌ఎస్‌లో చేరారు.



3 నెలలు ఎండలే

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నా...మధ్యాహ్న సమయాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ మరో పిడుగులాంటి వార్త చెప్పింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో ఏప్రిల్ నుంచి జూన్ వరకు సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ శనివారం తెలిపింది. పలు ప్రాంతాల్లో వేడి గాలులు వీస్తాయని చెప్పింది, బీహార్, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా బంగాల్, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్ హరియాణా రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు దక్షిణ, వాయువ్య దేశంలోని కొన్ని ప్రాంతాలు మినహా అనేక చోట్ల సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఈశాన్య వాయువ్య భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని చెప్పింది. ఏప్రిల్‌లో సాధారణ వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. వాయువ్య మధ్య భారతదేశ ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

పేపర్ లీకేజ్ కేసులో లింకులపై ఆరా

(మొదటిపేజీ తరువాయి)

సెక్రటరీ ఆధీనంలోనే జరుగుతాయి. లీకేజీ కేసులో ప్రధాన నిందితుడు ప్రవీణ్ అనితా రామచంద్రన్ వద్ద పీఏగా పనిచేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష రాసిన ప్రవీణ్‌కు అందులో 103 మార్కులు వచ్చాయి. అదేలా సాధ్యమని అనుమానించిన సిట్ అధికారులు ప్రవీణ్‌కు సంబంధించిన వివరాలపై అనితా రామచంద్రన్‌ను ప్రశ్నించినట్టు తెలిసింది. పరీక్ష నిర్వహణపై కూడా సిట్ అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం. ఈ కేసులో ఇప్పటి వరకు 15మందిని అరెస్టు చేసిన అధికారులు పలువురిని విచారించిన విషయం తెలిసిందే. దర్యాప్తు అంతా ప్రశ్నాపత్రాలు లీక్ కావడం, ఎవరెవరికి వెళ్లాయి, ఎంత మేరకు ఆర్థిక లావాదేవీలు జరిగాయి అనే కోణంలో విచారణ కొనసాగింది. అయితే తాజాగా టీఎస్‌పీఎస్సీ సభ్యులను సైతం విచారిస్తుండటంతో చర్చనీయాంశంగా మారింది.

రేపటినుంచి టెన్త్ పరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 13వ తేదీ వరకు అవి కొనసాగనున్నాయి. ఈ పరీక్షలను ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. కాంపోజిట్ కోర్సు, సైన్స్ పేపర్ల వ్యవధి మాత్రం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరుగుతాయి. ఈ పరీక్షల నిర్వహణ కోసం పాఠశాల విద్యాశాఖ అధికారులు సర్వంసిద్ధం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లాల కలెక్టర్లు, డీఈవోలతో విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి పలుసార్లు వీడియో కాన్ఫరెన్స్,సమీక్ష సమావేశాలను నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం 2,652 కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4,94,620 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారు.ఇందులో 4,85,826 మంది రెగ్యులర్ విద్యార్థులున్నారు.ఈ విద్యాసంవత్సరం నుంచి పదో తరగతి పరీక్షలు 11 పేపర్లకు బదులుగా ఆరు పేపర్లతోనే నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి గతంలోనే ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకూ విద్యాశాఖ అధికారులు హాల్‌టికెట్లను పంపించారు. ఇంకోవైపు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో కూడా వాటిని అందుబాటులో ఉంచారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించారు. పరీక్షా సిబ్బంది, ఫ్లైయింగ్ స్క్వాడ్‌ల నియామకం, స్టోరేజీ పాయింట్లకు రహస్య సామగ్రి పంపిణీ వంటి పనులను ఇప్పటికే పూర్తి చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్ష విధులకు నియమించిన సిబ్బంది అందరికీ గుర్తింపు కార్డులను ఇచ్చారు. ప్రస్తుతం ఎండల తీవ్రత నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలతోపాటు విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు,తాగునీరు అందుబాటులో ఉంచనున్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్‌లతోపాటు పరీక్షలు జరిగే అన్ని రోజుల్లో ఒక ఏఎన్‌ఎంను కేటాయించేలా ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవడానికి వీలుగా టీఎస్‌ఆర్టీసీ ఆ సమయానికి ఎక్కువ సంఖ్యలో బస్సులను నడిపేందుకు సిద్ధమైంది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌ను చూపించి ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. పరీక్షా కాలంలో నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేలా విద్యుత్ శాఖ చర్యలు చేపట్టనుంది.

ఒకేఒక్కడు...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మెరుపు ధర్నాకు దిగారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శనివారం ఉదయం 11 ఒక్కడే వచ్చి అక్కడ బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను, వివిధ శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులను జారీ చేయాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న 11,103 మంది కాంట్రాక్టు ఉద్యోగులను ఈనెల ఒకటో తేదీ నుంచి క్రమబద్ధీకరిస్తామంటూ ప్రభుత్వం హామీ ఇచ్చిందనీ, 2023-24 బడ్జెట్ ప్రసంగంలోనూ రాత పూర్వకంగా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇది కొత్త హామీ కాదని చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం 2016లోనే జీవోనెంబర్ 16ను విడుదల చేశారని వివరించారు. అది హైకోర్టులో కొంతకాలం పెండింగ్‌లో పడిందన్నారు. ఆ తర్వాత క్రమబద్ధీకరణ చేయొచ్చని కోర్టు తీర్పునిచ్చిందని చెప్పారు. ఇప్పుడు కోర్టుతోపాటు ఎలాంటి ఆటంకాల్లేవని అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకుల సర్టిఫికెట్లను కూడా పరిశీలించారని వివరించారు. దీనికి సంబంధించి అన్ని రకాల సమాచారం సీఎం కేసీఆర్‌కు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పంపించారని చెప్పారు. క్రమబద్ధీకరణకు సంబంధించి సీఎం ఆదేశాలిస్తే వెంటనే ఉత్తర్వులు జారీ చేసే అవకాశముందని అన్నారు. కానీ కేసీఆర్ తాత్సారం చేయడం పట్ల 11,103 మంది ఆవేదనతో ఉన్నారని చెప్పారు. వారి ఆవేదనను అర్థం చేసుకుని వెంటనే ఉత్తర్వులు జారీ అయ్యేలా అధికారులను ఆదేశించాలని సీఎంను కోరారు. ఒక్కడే అయినా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు నిరసనకు దిగిన తీరును ప్రసంశించారు. ఈ విషయం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమైంది. ఉపాధ్యాయులు, అధ్యాపకుల పక్షాన పోరాడే ఒకే ఒక్కడు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అంటూ కామెంట్లు పెడుతూ ఆయనకు మద్దతుగా నిలిచారు. చివరకు ధర్నాకు అనుమతి లేదనే కారణంతో మధ్యాహ్నం నర్సిరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. దీన్ని పలు సంఘాలు ఖండించాయి.

టీఎస్‌యూటీఎఫ్ సంఘీభావం

నర్సిరెడ్డి చేపట్టిన దీక్ష వద్దకెళ్లి టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి, తెలంగాణ వాయిస్ ఆఫ్ టీచర్ ప్రధాన సంపాదకులు పి.మాణిక్‌రెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ ఆంజనేయులు సంఘీభావం ప్రకటించారు. నర్సిరెడ్డి అరెస్టును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (టీఎస్‌జీసీసీఎల్‌ఏ-475), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీలు ఖండించాయి. వెంటనే క్రమబద్ధీకరణ ఉత్తర్వులను విడుదల చేయాలని కోరుతూ టీఎస్‌జీసీసీఎల్‌ఏ-475 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి రమణారెడ్డి, కొప్పిశెట్టి సురేష్, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తక్షణమే జోక్యం చేసుకుని ఇచ్చిన మాట ప్రకారం క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐలకు అభినందన వెల్లువ



నవతెలంగాణ-వనస్థలిపురం
వనస్థలిపురం సీఐగా బాధ్యతలు స్వీకరించిన డి.జలంధర్ రెడ్డిని, ఇక్కడి నుంచి సాధారణ బదిలీపై సీసీఎస్ మల్కాజ్గిరి విభాగ సీఐగా శనివారం బాధ్యతలు స్వీకరిస్తున్న కే.సత్యనారాయణను వనస్థలిపురంకి చెందిన ఎంఎస్ఆర్ యూత్ ఫోర్స్ అధ్యక్షులు మిట్టకంటి సత్తిరెడ్డి తన సభ్యులతో కలిసి శాలువా కప్పి బొకేలతో సత్కరించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ వనస్థలిపురం సీఐగా కె.సత్యనారాయణ వనస్థలిపురంవాసుల అభిమానాన్ని కైవసం చేసుకున్నారని, సత్యనారాయణ ఎక్కడ విధులు నిర్వహించినా ఆ ప్రాంతం చట్టానికి లోబడి ఉంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఆర్ యూత్ ఫోర్స్ సభ్యులు సంగ్రామ్, శివ, ఉదయ్, వెంకట్, ప్రసాద్, బాబి తదితరులు పాల్గొన్నారు .

బీజేఆర్ భవన్ కార్యాలయానికి వస్తువులు అందజేత

నవతెలంగాణ - సరూర్‌నగర్
ఆర్కే పురం డివిజన్ పరిధిలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌కు ఈనెల 5వ తేదీన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం, జాతీయ నాయకుల చిత్రపటం, వాటర్ క్యాన్‌సెట్, వాల్ క్లాక్ మొదలగునవి కార్యాలయ సిబ్బందికి ఉచితంగా అందజేయడం జరిగిందని, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, రచయిత, ప్రముఖ కళాకారులు, సోషల్ వర్కర్ డా.పెండెం కృష్ణకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ ఇన్‌చార్జి బి.రాజు, ఎం.శేఖర్ రెడ్డి, దేవేందర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్రం నిధులు ఆపినా అభివృద్ధిలో తెలంగాణ ముందంజ

ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-హయత్‌నగర్
కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంపై నిధులు ఇవ్వడంలో వివక్షత చూపినా తెలంగాణ మాత్రం అభివృద్ధిలో ముందంజలో ఉందని ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. శనివారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని స్వామి శంకర్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, కాలనీవాసులు, సంక్షేమ సంఘాలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం 8సంవత్సరాల్లో 14రంగాల్లో దేశంలో తెలంగాణ 5వ స్థానంలో నిలిచిందన్నారు. ఎల్బీనగర్‌లో ఫ్లై ఓవర్‌లు, టిమ్స్ హాస్పిటల్, ఆక్సిజన్ పార్కులు, తెలంగాణలో ఎక్కడా లేనివిధంగా పార్కులు ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపడం వలన తెలంగాణ మాత్రం అభివృద్ధిలో ముందంజలో ఉందని, దేశం నుండి తెలంగాణకు మెడికల్ కాలేజీ, నవోదయ స్కూల్స్, మెట్రోకు నిధులు ఇవ్వడంలేదని కేంద్రంపై మండిపడ్డారు. ఆదానికి నరేంద్రమోదీ అండగా ఉండడం వలన 2020లో ప్రపంచంలో 609వ స్థానంలో ఉండగా 2022లో ప్రపంచ కుబేరుల్లో 3వ స్థానానికి ఎగబాకిన విషయం అందరికీ తెలిసిందన్నారు. కాంగ్రెస్ హయాంలో స్కామ్‌లు జరిగితే జాయింట్ పార్లమెంట్ కమిటీ చేశారని, మోడీ హయాంలో అలాంటి కమిటీ ఆదానికి వ్యతిరేకంగా ఎందుకు వేయడంలేదని కేంద్ర ప్రభుత్వంని విమర్శించారు. కేవలం ఎన్నికలు ఉన్న రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గిస్తారని, ఎన్నికలు ముగిసిన తరువాత మళ్ళీ గ్యాస్ ధరలు పెంచుతున్నది కేంద్రం అని దుయ్యబట్టారు. నోట్ల రద్దు, ఆర్టికల్ 317 రద్దు విషయంలో కేంద్రంకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలకు ఉపయోగపడే విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎవరితోనైనా చేతులు కలుపుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దాయనంద్ గుప్తా, మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి, గుడాల మల్లేష్, మహిళ అధ్యక్షురాలు అంజలి, భాస్కర్ సాగర్, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, బీసీ సెల్ నాయకులు పాల్గొన్నారు.



ఇంకా అభివృద్ధి కాలేదు : నియోజకవర్గ పరిధిలో పలు నూతన కాలనీలు ఏర్పడడం వలన తక్కువ మంది అట్టి కాలనీల్లో నివాసం ఉండడం వలన కొంతమేర డ్రైనేజీ సమస్యలు, మంచినీటి సరఫరా లేకపోవడం, విద్యుత్ సరఫరా లేకపోవడం, రోడ్లు సరిగా లేని విషయాన్ని ప్రజలు విస్మరిస్తారే తప్ప, కరోనా సమయంలో ప్రపంచం అతలాకుతలం అయిందనే విషయాన్ని మాత్రం ప్రజలు పట్టించుకోరని ఎమ్మెల్యే అన్నారు.

బీఆర్ఎస్‌లో ఫ్లెక్సీ గొడవ : హయత్‌నగర్ డివిజన్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఫ్లెక్సీ ఏర్పాటు విషయంలో గొడవ జరిగింది. ఎమ్మెల్యే రాక కోసం సభలో స్వాగత ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా, ప్రస్తుతం బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఫోటోను మాజీ కార్పొరేటర్ అనుచరులు ఫ్లెక్సీలో చిన్నగా పెట్టడంతో అధ్యక్షుడి అనుచరులు వెంటనే దానిని చించివేయగా, ఎమ్మెల్యే రాకముందే మరో నూతనంగా అన్ని కులాల నాయకులు వుండే విధంగా మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అసలే గత ఏడాది నుంచి రెండు వర్గాలుగా ఉన్న బీఆర్ఎస్ ఆత్మీయ సభ సందర్భంగా కనిపించకుండా చేద్దామనుకున్నారు. కానీ కార్యకర్తల్లో మాత్రం తమ నాయకుడు ఫ్లెక్సీల్లో చిన్నగా కనిపించేసరికి తట్టుకోలేక అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్స్‌ని చించివేశారు.

క్రికెట్ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్..మెట్రో రైళ్ల సంఖ్య పెంపు

నవతెలంగాణ-సిటీబ్యూరో
నగరంలో నేటి నుంచి ఐపీఎల్ సందడి మొదలు కానుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తమ తొలి మ్యాచ్‌ను ఆదివారం రాజస్థాన్ రాయల్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం 3.30గంటలకు ప్రారంభం కానుంది. అయితే ఉప్పల్ వేదికగా మొత్తం ఏడు మ్యాచుల్లో ఆడనున్నది. ఈ నేపథ్యంలో క్రికెట్ అభిమానులకు మెట్రో శుభవార్త చెప్పింది. ఆదివారం జరిగే మ్యాచ్ సందర్భంగా మెట్రో రైళ్ల సంఖ్యను పెంచాలని నిర్ణయించింది. రద్దీ నేపథ్యంలో నాగోల్-అమీర్‌పేట మార్గంలో ఎక్కువ సంఖ్యలో రైళ్లను నడుపనున్నట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఎక్కువ సంఖ్యలో మెట్రో సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. మరో వైపు ఉప్పల్ మ్యాచ్‌కు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి.



ఎల్బీనగర్ జోన్‌లో రూ.259.06 కోట్లు పన్నుల వసూలు

జోనల్ కమిషనర్ పంకజం

నవతెలంగాణ-ఎల్బీనగర్
ఆర్థిక సంవత్సరం 2022 - 2023లో జీహెచ్ఎంసీ ఆస్తి పన్ను వసూలులో ఎల్.బి.నగర్ జోన్ మూడో స్థానంలో నిలిచింది. ఎల్బీనగర్ జోనల్ పరిధిలోని ఐదు సర్కిల్స్ పరిధిలోని డిప్యూటీ కమిషనర్‌లు, రెవిన్యూ అధికారులు కలిసి ఆస్తి పన్ను వసూలులో నగరంలోనే ముందు ఉన్నారు. జోనల్ కమిషనర్ పంకజం ఆస్తి పన్ను వసూలులో అగ్ర స్థానం సంపాదించారు. ఎల్బీనగర్ జోన్‌లో పేరుకుపోయిన ఆస్తి పన్నును రాబట్టారు. జోనల్ కమిషనర్ పంకజం ఆస్తి పన్ను వసూలు చేయడంలో సిబ్బంది టార్గెట్స్ ఇచ్చి ఇంటింటికీ వెళ్లి వసూలు చేయాలని అధికారులను అదేశించారు. ఇచ్చిన టార్గెట్స్‌ను పూర్తిచేసి



ఎల్బీనగర్ జోన్‌కు మంచి పేరు తీసుకొచ్చిన సిబ్బందిని, అధికారులను, జోనల్ కమిషనర్ పంకజం అభినందించారు.

జీహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు ఆర్థిక సంవత్సరం 2022-2023 ఆస్తి పన్ను లక్ష్యాలను సాధించడం జరిగిందని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజం తెలిపారు. వివిధ సర్కిల్స్‌కు ఇచ్చిన టార్గెట్స్ వసూలు చేసిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

1. కాప్రా సర్కిల్ :
లక్ష్యం : 52.00 కోట్లు, **వసూలు అయింది :** 53.17 కోట్లు, 102.24%

2. ఉప్పల్ సర్కిల్ :
లక్ష్యం : 37.00 కోట్లు, **వసూలు అయింది :** 35.04 కోట్లు, 94.69%

3. హయత్ నగర్ సర్కిల్ :
లక్ష్యం : 62.00 కోట్లు, **వసూలు అయింది :** 59.70 కోట్లు, 96.29%

4. ఎల్.బి. సర్కిల్ :
లక్ష్యం : 49.00 కోట్లు, **వసూలు అయింది :** 50.26 కోట్లు, 102.56%

5. సరూర్ నగర్ సర్కిల్ :
లక్ష్యం : 62.00 కోట్లు, **వసూలు అయింది :** 60.91 కోట్లు, 98.24%

ఎల్.బి.నగర్ జోన్ మొత్తం : లక్ష్యం : 262.00 కోట్లు, **వసూలు అయింది :** 259.06 కోట్లు, 98.88%.

ఇందులో భాగంగా ఎల్.బి.నగర్ జోన్‌ను మూడో స్థానంలో నిలిపేందుకుగాను కృషి చేసిన ఐదు సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్‌లకు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లకు, వాల్యుయేషన్ ఆఫీసర్లకు, టాక్స్ ఇన్స్‌పెక్టర్లకు మరియు బిల్ కలెక్టర్‌లకు కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలిపారు.
అదే విధంగా జీ.హెచ్.ఎం.సి. కమిషనర్, ఆర్థిక సంవత్సరం 2023 - 2024 ఎర్లీ బర్డ్ స్కీం కింద ఇచ్చిన లక్ష్యాలు

1. కాప్రా సర్కిల్	:	24.29 కోట్లు
2. ఉప్పల్ సర్కిల్	:	14.50 కోట్లు
3. హయత్ నగర్ సర్కిల్	:	23.54 కోట్లు
4. ఎల్.బి. సర్కిల్	:	20.17 కోట్లు
5. సరూర్ నగర్ సర్కిల్	:	23.18 కోట్లు
ఎల్.బి.నగర్ జోన్ మొత్తం	:	105.68 కోట్లు కూడా సాధించాలని ఎల్.బి. నగర్ జోనల్ కమిషనర్ ఎస్.పంకజం అధికారులను ఆదేశించారు.

మున్సిపల్ కార్మికులకు వారాంతపు సెలవులు అమలు చేయాలి



- **యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిషన్**

నవతెలంగాణ-తుర్కయంజాల్
తుర్కయాంజల్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వారాంతపు సెలవులను వెంటనే అమలు చేయాలని కోరుతూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి.కిషన్ ఆధ్వర్యంలో శనివారం తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ సాబేర్ అలీకి రాగన్నగూడలోని మున్సిపల్ వార్డు కార్యాలయంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని, ప్రతి నెలా 5వ తేదీ లోపు కార్మికులందరికీ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సబ్బులు, నూనెలు, బట్టలు మరియు చెప్పులు లాంటి రక్షణ పరికరాలను వెంటనే ఇవ్వాలని, అలాగే ఎండలు తీవ్రమవుతున్న ఈ పరిస్థితుల్లో కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఎండలబారి నుండి వారిని రక్షించేందుకు ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే పనిచేయించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జె.ఆశీర్వాదం ఎన్.యాదగిరి, తుర్కయంజాల్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మేతరి దాసు, యూనియన్ నాయకులు మేతరి నవీన్ కుమార్, చెక్క వెంకటేష్, కంప్యూటర్ ఆపరేటర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఆన్‌లైన్‌లో అన్నమాచార్య కీర్తనలు' దరఖాస్తుల ఆహ్వానం

ఏప్రిల్ 27 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్
ఈనెల 27 నుంచి మే 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అన్నమాచార్య కీర్తనలు, రామదాసు కీర్తనలు, పురందరదాసు కీర్తనలలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు 'సాయినృత్య తరంగిణి' డైరెక్టర్ కె.ఎస్.రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులకు ఎటువంటి వయోపరిమితి లేదని, సంగీతం పట్ల ఆసక్తి గలవారు ఎవరైనా నేర్చుకోవచ్చని చెప్పారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసినవారికి సర్టిఫికెట్ అందజేయబడుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు నెం.9032559938 కు సంప్రదించవచ్చన్నారు.

విద్యార్థులు శ్రద్ధతో చదవాలి

నవతెలంగాణ-ఘట్కేసర్
విద్యార్థులు శ్రద్ధతో చదివినప్పుడే తను అనుకున్న లక్ష్యాన్ని ఇస్తారని విద్యా కిరణ్ స్కూల్ డైరెక్టర్ పుష్పలత రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఎదులాబాద్‌లోని కూడలి సమీపంలో విద్యార్థులను స్కూల్లో వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు విద్యను అభ్యసించినప్పుడే తాను అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని విద్యుత్‌తో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని ఆమె కోరారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూస్తూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రమేష్, ప్రిన్సిపల్ దేవేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- **రూ.80కోట్ల 30లక్షల 87వేల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం**
- **మేయర్ పారిజాత నర్సింహారెడ్డి**



నవతెలంగాణ-బడంగ్‌పేట్
బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్లలోని ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు కృషి చేస్తున్నామని మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 2023-24 సంత్సరం వార్షిక బడ్జెట్ సమావేశం మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ బడ్జెట్ సమావేశంలో వివిధ అంశాల వారిగా సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను కార్పొరేటర్ల సమక్షంలో ఏకాభిప్రాయంతో బడ్జెట్‌కు తీర్మానం చేసి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 2023-24సంవత్సరంకు గాను రూ.80కోట్ల 30లక్షల 87వేల వివిధ అభివృద్ధి పనులను పూర్తిచేయటానికి కౌన్సిల్ తీర్మానం చేయటం జరిగిందన్నారు. అందులో ప్రస్తుతం రూ.23కోట్ల 91లక్షల మిగులు బడ్జెట్ ఉన్నట్లు తెలిపారు. గత సంవత్సరం ఎస్ఎన్‌డిపి నిధులతో వరద కాలువల నిర్మాణ పనులకు చేయుటకు రాష్ట్ర ఐటి, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిలు అట్టహాసంగా శంకుస్థాపనలు చేశారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయక పోవటం వలన కాంట్రాక్టర్ నాలా నిర్మాణ పనులను పూర్తి చేయకపోవటంతో అర్థాంతరంగా ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. స్థానికంగా ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఈ సంవత్సరం ఎస్ఎన్‌డిపి వరద కాల్వల నిర్మాణ పనులకు ప్రత్యేకంగా రూ.18 కోట్ల నిధులు కేటాయించి దశల వారీగా పనులు పూర్తి చేయుటకు రూ.1 కోటి చెల్లించటం జరిగిందని, అందుకు సభ ఆమోదం తెలిపిందన్నారు. అప్పటి నుంచి కాలనీలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో ఈ సంవత్సరం ఎస్ఎన్‌డిపి పనులకు ప్రత్యేకంగా అంచనా నిధులను సుమారు రూ.44 కోట్ల రూపాయల కేటాయించడం జరిగిందని, మేయర్ సమావేశం అనంతరం పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రమ్ శేఖర్, కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి, కార్పొరేటర్లు, కోఅప్షన్ సభ్యులు, డీఈఈలు అశోక్ రెడ్డి, జ్యోతి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి కృషితోనే నెంబర్ వన్

- **రూ.13.11 కోట్ల పన్నులు వసూళ్లు**
- **రాష్ట్రంలోని 13 కార్పొరేషన్‌లతో పోలిస్తే ప్రథమ స్థానంలో నిలిచిన పీర్జాదిగూడ**
- **142 మున్సిపాల్టీలతో పోలిస్తే పదవ స్థానం**
- **అధికారులను, రెవెన్యూ సిబ్బందిని అభినందించిన మేయర్ జక్కా వెంకట్ రెడ్డి**

నవతెలంగాణ-బోడుప్పల్
2022-23 ఆర్థిక సంవత్సరం పన్ను వసూళ్లలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా నిలిచింది. మొత్తం డిమాండ్‌లో 92.65శాతం పన్నులను రాబట్టి రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్‌లలో అగ్రస్థానంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ నిలిచిందని అధికారులు తెలిపారు. అలాగే 142 మున్సిపాలిటీలతో పోలిస్తే పీర్జాదిగూడ రాష్ట్ర స్థాయిలో 10వ స్థానంలో నిలిచిందని తెలిపారు. 2023 మార్చి 31వ తేదీతో 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసిన సంగతి విదితమే. ఈ క్రమంలోనే పన్నుల వసూళ్లపై అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మొత్తం ట్యాక్స్ డిమాండ్ రూ.14.49 కోట్లు కాగా, ఇందులో రూ.13.11కోట్ల పన్నులను (92.65శాతం) రాబట్టినట్లు తెలిపారు. మేయర్ జక్క వెంకట్‌రెడ్డి సహచర కార్పొరేటర్లతో కలిసి కాలనీల్లో, బస్తీల్లో పర్యటించి ప్రతి ఒక్కరూ ఆస్తి పన్ను చెల్లించాలని అభ్యర్థించడంతోపాటు జనవరి నుంచి బిల్ కలెక్టర్లకు డైలీ టార్గెట్స్ ఇచ్చారు. ఈ క్రమంలోనే పన్ను వసూళ్లలో మంచి ఫలితాలను రాబట్టామని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

భువన్ సర్వేతో మేలు
కిందటేడాది కేవలం రూ.9.31కోట్ల డిమాండ్ మాత్రమే ఉండగా, ఈ దఫా ఏకంగా రూ.14.49 కోట్లకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు ప్రత్యేక చొరవ తీసుకుని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భువన్ సర్వేను 100 శాతం అమలు చేశారు. భువన్ సర్వే ప్రకారం ప్రజల ఆస్తుల వాస్తవ కొలతల ప్రకారం డిమాండ్ నోటీసులను జారీ చేశామని అధికారులు తెలిపారు. దీంతో ప్రజల ఆస్తికి తగినంత వాస్తవ పన్ను వసూలు చేయడంతో కిందటేడాదితో పోలిస్తే రూ.5.18కోట్ల రెవెన్యూ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు పెరిగిందని అధికారులు తెలిపారు. మిగిలిన పన్నులను కూడా వారం వ్యవధిలో 100 శాతం వసూలు చేస్తామని మున్సిపల్ కమిషనర్ డా.రామకృష్ణ రావు తెలిపారు.



పన్ను చెల్లింపుదారులకు కృతజ్ఞతలు



సకాలంలో పన్నులు చెల్లించి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌ను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపిన పన్ను చెల్లింపుదారులకు ప్రత్యేక కృతజ్ఞతలు. మున్ముందు కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షిస్తున్న ప్రజలు చెల్లించిన పన్నులతో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌ను అభివృద్ధిలోను అగ్రస్థానంలో నిలుపుతాం. అహర్నిశలు శ్రమించి పన్నులను వసూలు చేసిన కార్పొరేషన్ అధికారులను, రెవెన్యూ సిబ్బందికి, బిల్ కలెక్టర్లకు అభినందనలు.

జక్క వెంకట్ రెడ్డి, మేయర్,
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్

టోల్ గేట్ ఫీజులు పెంచినందుకు నిరసనల వెల్లువ

- **జాతీయ రహదారిపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**
- **తెలంగాణ స్టేట్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్**

నవతెలంగాణ-వనస్థలిపురం
అర్ధరాత్రి నుంచి పెరిగిన టోల్ గేట్ చార్జీలు, డీజిల్ పెరుగుదలకు నిరసనగా వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఆటోనగర్ వద్ద ఆటోనగర్ ఇసుక లారీల అడ్డా అధ్యక్షుడు కేసారం బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన వెలువ్వకు తెలంగాణ స్టేట్ లారీ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నందా రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని శనివారం జాతీయ రహదారిపై ప్లే కార్డ్స్‌తో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నందా రెడ్డి మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం 8 నుంచి 15% టోల్ గేట్ చార్జీలు పెంచిందని, ఈ ఏడాది రేట్లు కార్లు, జీపులకు అదనంగా ఐదు నుంచి పది వరకు, బస్సులు, లారీలకు 15 నుంచి 25 వరకు, భారీ వాహనాలకు 40 నుంచి 50 వరకు అదనంగా టోల్ చార్జీలను పెంచి అధిక భారం మోపిందన్నారు.
జీఎస్టీ బరిలోకి డీజిల్‌ని ప్రవేశపెట్టాలని, ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని, మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిత్యావసర వస్తువులతో పాటు ప్రజలకు అధిక భారం మోపి, ప్రభుత్వపరమైన వ్యవస్థను ప్రైవేటీకరణ చేస్తూ ప్రజలను మభ్యపెట్టి వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం ఏకైక ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యాదగిరి గౌడ్, బాల్‌రెడ్డి, రాజాగౌడ్, శ్రీనివాస్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



అక్రమంగా డ్రగ్స్ అమ్మకాలు : ఇద్దరు నిందితులు అరెస్టు రిమాండ్

- **నిందితులను పట్టుకున్న లా అండ్ ఆర్డర్, ఎస్ఓటి పోలీసులు**

నవతెలంగాణ-వనస్థలిపురం
రోగులకు డాక్టర్ల సలహా మేరకు మెడికల్ షాప్‌లో దొరికే డ్రగ్స్‌ను అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలన్న వ్యామోహంతో చట్ట విరుద్ధంగా ఎక్కువ ధరలకు అమ్ముతున్న ఇద్దరు నిందితులను హయత్‌నగర్ పోలీసులు, ఎల్బీనగర్ ఎస్ఓటి పోలీసులు సంయుక్తంగా వలపన్ని పట్టుకున్నారు. శనివారం వనస్థలిపురం ఏసీబీ కార్యాలయంలో ఏసీపీ పురుషోత్తం రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హయత్‌నగర్ అనుమగల్ ప్రాంత నివాసి బాలాజీ ధర్మాజీ (36) వృత్తి రీత్యా హయత్‌నగర్ శ్రీనివాస హాస్పిటల్‌లో కాంపౌండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.
హయత్‌నగర్ అనుమకల్ ప్రాంతానికి చెందిన ప్రసాద్ గుల్బరో ఫొండేంగే (23) వృత్తి రీత్యా హయత్‌నగర్ మాక్స్ కేర్ హాస్పిటల్‌లో సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇద్దరూ కలిసి మందులు షాపులో 200 రూపాయలకు దొరికే డ్రగ్స్‌ను యువతకు 1000 రూపాయలకు అమ్ముతున్నారన్న సమాచారం మేరకు హయత్‌నగర్ పోలీసులు, ఎల్బీనగర్ ఎస్ఓటి పోలీసులు సంయుక్తంగా వలపన్ని ఇద్దరు నిందితుల్ని అదుపులోకి తీసుకుని, వారి వద్దనున్న డ్రగ్స్‌తోపాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ పురుషోత్తం రెడ్డి తెలిపారు.
ఈ డ్రగ్స్ యువత జిమ్ములో ఎక్సర్‌సైజ్ చేసే తరుణంలో వాడడానికి, డాక్టర్ సలహా మీద రోగులకు మందులు షాపులో దొరికే మత్తు మందులని పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎల్బీనగర్ ఎస్ఓటి ఏసీపీ వెంకన్న నాయక్, హయత్ నగర్ ఇన్స్‌పెక్టర్ హెచ్ వెంకటేశ్వర్లు, ఎస్ఓటి సీఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌లోని మాధవపురి కాలనీలో రూ. ఒక కోటి ఐదు లక్షలతో సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో కాప్ర మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శంకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిలాల్, ఏఈ అభిషేక్, స్థానిక కార్పొరేటర్ స్వర్ణ రాజు, మాజీ ఎంటీసీ చైర్మెన్ తాడూరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు , స్థానిక కాలనీవాసులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగనవాడీ కేంద్రంలో అవగాహన సదస్సు



నవతెలంగాణ-కంటోన్మెంట్

మోండా డివిజన్ కుమ్మరిగూడ అంగన్వాడీ సెంటర్‌లో శనివారం పోషణ అభియాన ఆధ్వర్యంలో పోషణ పక్వాడ న్యూట్రిషనల్ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు కార్పొరేటర్ దీపిక ముఖ్యఅతిథిగా పాల్గొని చిరుధాన్యాలు/ మిల్లెట్స్ గురించి అవగాహన కల్పించారు. పిల్లల గ్రోత్ మెజర్మెంట్ చేసి పోషక పదార్థాలు అందజేస్తున్న అంగన్వాడీ టీచర్స్‌ను అభినందించారు కార్యక్రమంలో సీడీపీఓ చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పాల్గొని అంగన్వాడీలోని పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- అధికారులతో సమీక్ష



నవతెలంగాణ-బేగంపేట్

సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యే విధంగా పర్యవేక్షించాలని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం మాసాబ్ ట్యాంక్ లోని తన కార్యాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, హెచ్ఎండీఏ, ఎలెక్ట్రికల్, టౌన్ ప్లానింగ్, హార్టికల్చర్ తదితర శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, వాటర్ వర్క్ ఎండీ దాన కిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, టీఎస్ఎస్ పీడీసీఎల్ రఘుమారెడ్డి, ఎస్ఎన్‌డీపీ ఈఎన్‌సీ జియా ఉద్దీన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సనత్ నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం ద్వారా ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కషి చేస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గ పరిధిలో అనేక ప్రధాన, అంతర్గాట్ రోడ్లను అభివృద్ధి చేసి వాహనదారుల ఇబ్బందులను తొలగించడం జరిగిందని తెలిపారు. సనత్ నగర్‌లోని ఇండస్ట్రియల్ ప్రాంతం నుండి బాల నగర్ చౌరస్తా వరకు అండర్ పాస్ నిర్మాణం, ఫతే నగర్ ఫ్లై ఓవర్ విస్తరణ పనుల కోసం హెచ్ఎండీఏ నుంచి రూ.100 కోట్లను మంజూరు చేసినందుకు మంత్రి కేటీఆర్‌కు మంత్రి శ్రీనివాస్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ పనులను చేపట్టడానికి స్థల సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫతే నగర్ ఫ్లై ఓవర్ విస్తరణ, కింద స్థల సేకరణ చేపట్టి రోడ్డు విస్తరణ చేయడం వల్ల ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య భారీగా తగ్గుతుందని వివరించారు. అదేవిధంగా రాణిగంజ్ రైల్వే బ్రిడ్జి విస్తరణ పనులను కూడా త్వరితగతిన చేపట్టే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాంగోపాల్ పేట డివిజన్ పాన్ బజార్‌లో మల్టి పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ప్రతిపాదనలను రూపొందించాలని ఆదేశించారు.

సనత్ నగర్ లోని కేఎల్ఎన్ పార్క్ అభివద్ధి పనుల కోసం రూ. 2.41 కోట్లు మంజూరైనాయని, పార్క్ లోని లేక్‌ను అభివద్ధి చేయడం, మెడిటేషన్ సెంటర్ ఏర్పాటు, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, టాయిలెట్స్ నిర్మాణం, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు వంటి పనులను చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇవన్నీ చేపట్టేందుకు అదనంగా మరో 2.50 కోట్ల రూపాయలు అవసరం అవుతాయని, సీఎస్ఆర్ నిధులతో చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ పరిపాలన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌ను మంత్రి ఆదేశించారు. బీకే గూడ పార్క్ కు వచ్చే వారికోసం టాయిలెట్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శిధిలావస్థకు చేరుకున్న బీకే గూడ వార్డ్ ఆఫీస్ స్థానంలో నూతన భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల తవ్వకాలు జరిపే సమయంలో డ్రయినేజీ, వాటర్ పైప్ లైన్ లు ధ్వంసం కాకుండా జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులు సమన్వయంతో వ్యవహరించి పనులు చేపట్టాలన్నారు. బేగంపేట, పికెట్ నాలా అభివృద్ధి పనులను వర్షాకాలం లోగా పూర్తి చేయాలన్నారు. బోర్ వెల్స్ మరమ్మతులు వచ్చినప్పుడు సకాలంలో చేయకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయన్నారు. అల్లా ఉద్దీన్ కోటిలో ప్రమాదకరంగా ఉన్న హై టెన్షన్ విద్యుత్ లైన్‌ను తొలగించి అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనేక చోట్ల విద్యుత్ వైర్లు ప్రమాదక రంగా ఉన్నాయని, వాటిని తొలగించి బంచ్ కేబుల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితులలో ప్రభుత్వ పాఠశాలలకు బిల్లులు చెల్లించాలనే కారణంతో విద్యుత్ సరఫరా నిలిపివేయవద్దని స్పష్టం చేశారు. అమీర్ పేటలోని డీకే రోడ్డులో గల స్విమ్మింగ్ పూల్, సికింద్రాబాద్ లోని గురుమూర్తి స్విమ్మింగ్ పూల్‌లను అవసరమైన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశిం చారు. ఈఎస్ఐ గ్రేవ్ యార్డ్‌ను అభివృద్ధి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రతిపాదనలను రూపొందిం చాలని అధికారులను ఆదేశించారు. వారం రోజులలో ఈఎస్ఐ గ్రేవ్ యార్డ్‌ను సందర్శించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ లు రవి కిరణ్, శ్రీనివాస్ రెడ్డి, డీసీలు మోహన్ రెడ్డి, ముకుంద రెడ్డి, ఈఈలు ఇందిర, ఎలెక్ట్రికల్ డీఈ శ్రీధర్, సుదర్శన్, వాటర్ వర్క్స్ జీఎంలు హరి శంకర్, రమణారెడ్డి, హార్టికల్చర్ డీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాప్రా సర్కిల్ కార్యాలయంలో మందు.. చిందు

- అధికారుల నిర్వాకం
- స్థానికుల ఆగ్రహం





నవతెలంగాణ-కాప్రా

ఎంతో ఆదర్శంగా ఉండవలసిన కాప్రా సర్కిల్ కార్యాల యం కొంతమంది సిబ్బంది వల్ల అసాంఘిక శక్తులకు అడ్డగా మారుతోంది. గతంలో కాప్రా కార్యాలయం అంటేనే ప్రజలు పరిశీలించి ఆదర్శంగా తీసుకునేవారు ప్రస్తుతం అందుకు విరుద్ధంగా ఉంది. మార్చి 31వ తేదీ ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో రెవెన్యూ విభాగం చెందిన అధికారులు, సిబ్బంది కార్యాలయంలో మద్యం సీసాలతో శనివారం అర్ధరాత్రి విందులు ఏర్పాటు చేశారు. కార్యాల యంలో తమ సీట్లలో మద్యాన్ని సేవిస్తూ మాంసా న్ని తింటూ అర్ధరాత్రి వరకు విలాసంగా గడిపారు. అర్ధరాత్రి వరకు కార్యాలయం లో లైట్లు వెలుగుతూ చిందులు వేస్తుండడంతో సమాచారం అందుకున్న మీడియా ప్రతినిధులు అక్కడికి వెళ్లి పూర్తిగా రికార్డ్ చేశారు. ఇది గమనిం చిన అధికారులు సిబ్బం ది హుటా హుటిన వెళ్లిపోయారు.



ప్రభుత్వ కార్యాలయాన్ని బార్లుగా మార్చివేశారని ఈ ఘటనపై ప్రజలు మండిపడుతున్నారు. గతంలో కూడా పారిశుధ్య విభాగానికి చెందిన సిబ్బంది కూడా కార్యాల యంలోనే విందులు ఏర్పాటు చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. అయితే జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం ఏం పట్టనట్టుగా ఉంటున్నారని పలువురు ఆరోపిస్తు న్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విచారణ జరిపించాలి : సీపీఐ(ఎం)

కాప్రా సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి జరిగిన మద్యం విందు కార్యక్రమంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

విచారిస్తున్నాం : డిప్యూటీ కమిషనర్

కాప్రా కార్యాలయంలో జరిగిన సంఘటనపై విచారణ జరిపిస్తున్నామని డిప్యూటీ కమిషనర్ శంకర్ పేర్కొ న్నారు విచారణలో సంబం ధిత వ్యక్తులపై ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

పభుత్వ పథకాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాము

- జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మేడ్చల్ జిల్లాలో ప్రభుత్వ పథకాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మంత్రి శ్రీనివాస్ యాదవ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలు, ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని పథకాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి అధికా రులతో సమీక్ష సమావేశాలు నిర్వహించడంతో పాటు తాను కూడా క్షేత్రస్థాయిలో వెళ్ళి పర్యవేక్షిస్తున్నానని అందు కు అవసరమైన సలహాలు, సూచనలు కూడా అధికారులకు చేస్తున్నట్టు కలెక్టర్ వివరించారు. జిల్లా వ్యాప్తంగా 58 ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) ప్రకారం అర్హులైన వారిని గుర్తించడంతో పాటు వారికి పట్టాలను ప్రజాప్రతినిధుల ద్వారా పంపిణీ చయడం జరుగుతుందని తెలిపారు. అలాగే 59 ప్రభుత్వ ఉత్తర్వులకు సంబంధించి తాను ప్రత్యేకంగా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నానని అధికా రులు సైతం ప్రత్యేకంగా పర్యవేక్షించినట్టు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తున్నామని ఈ విషయంలో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహిం చడం జరుగుతుందని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఆర్డీవోలు రవి, మల్ల య్య, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కాలనీలో మంచినీటి పైపు లైన్ ఏర్పాటు

నవతెలంగాణ-నాచారం

నాచారం డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీలో పాత మంచినీటి పైపులైను తొలగించి నూతన హెచ్‌డీపీ పైపులు ఏర్పాటు చేస్తున్నట్టు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ నాచారం డివిజన్ పరిధిలో గత 25 సంవత్సరాల క్రితం వేసిన మంచినీటి పైప్‌లైన్లతో డ్రైనేజ్ లీకేజీలతో సతమతమవుతున్నారని తమ దష్టికి తీసుకురావడంతో అధికారులతో చర్చించి నూతన పైపులైన్లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కార్పొరేటర్ గా తన వంతు కషి ఉంటుందని అన్నారు. బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే సంబంధిత అధికారుల దష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం ఎప్పు డూ ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, మల్లేష్ యాదవ్, విఠల్ యాదవ్, కట్టబుచ్చి గౌడ్, చంద్రశేఖర్ ,వెంకటేష్, కైలాష్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

మోడీ పాలనలో కేడీల రాజ్యం కొనసాగుతోంది : పొన్నాల రాజు



నవతెలంగాణ-నాచారం

దేశంలో మోడీ పాలనలో కేడిల రాజ్యం కొనసాగుతున్నదని కాంగ్రెస్ ఉప్పల్ బీ బ్లాక్ ఎస్సీ సెల్ చైర్మెన్ పొన్నాల రాజు అన్నారు. రాహుల్ గాంధీకి మద్దతుగా గాంధీ భవన్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ బి బ్లాక్ ఎస్సీ సెల్ నాయకులు తరలివెళ్లి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రధానిమోడీ ప్రజాస్వామ్యాన్ని అవహాస్యం చేసే విధంగా వ్యవహరిం చారన్నారు. రాహుల్ పార్లమెంటు సభ్య త్వాని రద్దు చేయడం హాస్యా స్పదంగా ఉందని అన్నారు. మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మెన్ పత్తి కుమార్, కన్వీనర్ సునీత, నాయకులు సునీల్, రాహుల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సంతోష్ తల్లికి నివాళి

నవతెలంగాణ-సిటీబ్యూరో, కాప్రా

ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సంతోష్ తల్లి అమీర్ బాయ్ కన్నుమూశారు. ఆమె మృతదేహానికి సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డీజీ నర్సింహారావు, సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం, జిల్లా, ప్రజా సంఘాల కమిటీల నాయకులు శనివారం నివాళులర్పించారు. అనంతరం సంతోష్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సంతోష్ తల్లి గత కొంతకాలంగా క్యాన్స ర్‌తో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతిచెందారు. సంతోష్ స్వగ్రామమైన గంజిపల్లి తండాలో శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలియజేశారు.



కలెక్టరేట్‌లో ఆర్‌వో వాటర్ యూనిట్ ప్రారంభం



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కలెక్టరేట్‌లో తాగునీటి సదుపాయం కల్పించడం ఎంతో ఆనందకరమని ఈ విషయంలో దాతలకు ప్రత్యేకంగా అభినందనలు తెలియచేస్తున్నట్టు జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబుల్ (సీఎస్ఆర్) కింద కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో రూ.1.60 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్ యూనిట్‌ను అదనపు కలెక్టర్లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో దూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు, కలెక్టరేట్‌లో విధులు నిర్వహించే అధికారులు సిబ్బందికి ఈ ప్లాంట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని వేరే చోట కూడా ప్రజల ఇబ్బందులు తీర్చేలా ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కెనరా బ్యాంక్ డీజీఎమ్ ఆనంద్ జలోహా మాట్లాడుతూ... ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో జిల్లా కలెక్టరేట్‌లో ఆర్‌వో వాటర్ యూనిట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కెనరా బ్యాంకు ద్వారా అవసరమైన చోట్ల ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, లీడ్ బ్యాంకు మేనేజర్ కిశోర్ కుమార్, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, కలెక్టరేట్‌లోని జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం : ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు



నవతెలంగాణ-నేరేడ్ మెట్

బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలమని, వారి కృషి, పట్టుదలతో మరో మారు రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ఆ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శంబీపూర్ రాజు, ఇన్‌చార్జి పల్లా రాజేశ్వర్ రెడ్డిలు అన్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అధ్యక్షతన శనివారం మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని లక్ష్మీ సాయి గార్డెన్‌లో బీఆర్ఎస్ మల్కాజిగిరి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు, ఎమ్మెల్యేతో కలిసి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో మాత్రమే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నట్టు చెప్పారు. వీటిపై పార్టీ కార్యకర్తలు గడప గడపకు వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు.సీఎం కేసీఆర్ కృషితో అభివద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం నెంబర్ వన్ గా నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అందరూ కలిసి కట్టుగా పని చేసి మరో మారు బీఆర్ ఎస్ గెలుపు లక్ష్యంగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రచారం గడపగడపకు తీసుకుపో వాల్సిన బాధ్యత మీ అందరిపై ఎంతో ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరూ నేటి నుంచే సైనికుడిలా పని చేసి మల్కాజిగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మళ్లీ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్లు సునీత రాముయాదవ్,ప్రేమ్ కుమార్,మీనా ఉపేందర్ రెడ్డి, శాంతి శ్రీనివాస్ రెడ్డి, జితేంద్ర నాథ్,గజ్జెల నాగేష్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్,మల్కాజ్ గిరి సర్కిల్ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్,కొండల్ రెడ్డి,అధికార ప్రతినిధి, జీఎన్‌వీ సతీష్ కుమార్,రాముయాదవ్, గుండా నిరంజన్,ఉపేందర్ రెడ్డి, ఆమీనుద్దీన్, డివిజన్ అధ్యక్షులు పివి సత్యనారా యణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి కార్పొరేటర్ విరాళం



నవతెలంగాణ-జవహర్‌నగర్

బీఆర్ఎస్ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఆలయాలు అభివృద్ధి చెందాయని కార్పొరేటర్ జమాల్పూర్ నవీన్ కుమార్ అన్నారు. శనివారం కార్పొరేషన్ లోని 25వ డివిజన్‌లో మార్కెట్ రోడ్డు పాత బస్తీ సీతా రామాంజనేయ స్వామి ఆలయానికి గ్రానైట్ వేసేందుకు రూ. 50,000 వేలు విరాళం గా అందజేశారు. అనంతరం ఆలయంలో కార్పొరేటర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలోని యాదాద్రి. భద్రాద్రి, వేములవాడ, కొండగట్టు దేవాలయాలకు రూ. వందల కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేసిందని.. ఈ ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT, AT : HYDERABAD.
O.S.No.2338 of 2021

Between:
Union Bank of India, [A Govt. of India undertaking] [formerly] Andhra Bank Credit card Divisionrep. by Smt. S.Vijayalakshmi, Senior Manager [Law], Head Office, Koti, Sultan Bazar, Hyderabad. ...Plaintiff.
And
Mr. Mallidi Venkat Reddy S/o. Mr.M.Papi Reddy,Aged about 51 years, Occ: Business,16-11-501/2/1/A, Flat no. 103, Pragati Enclave,Dilsukhnagar, Hyderabad – 060. .....Defendant

Whereas the above named Plaintiff has filed the above suit O.S.No 2338 Of 2021 on the file of Hon'ble II Junior Civil Judge, City Civil Court, Hyderabad against you for recovery of due amount of Rs. 1,21,504.57 pertaining to your credit card no. 4373-7820-8750-8002. You are therefore directed to appear in person or through Advocate on 18.10.22 at 10.30a.m. to answer the suit, failing which the suit will be decided exparte. Take notice accordingly.

[AS PER THE COURT ORDER]
M.V.Nagaraj.
V.V.S.Annaram
Counsel for Plaintiffs.
H.No. 1-1-336/18,Chikkadapalli, Hyderabad.Cell:98496-66587

IN THE COURT OF THE HON'BLE II ADDL JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT L.B.NAGAR.
O.S. No.1020 of 2022

Between:
M/s indian Bank, Habsiguda Branch, Represented by it's Manager ...Plaintiff
AND
Chintala Mahipal Reddy ... Defendant

NOTICE TO DEFENDANT

Chintala Mahipal Reddy S/o Narayan Reddy Aged About 60 Years,Occ: Business Navadurga Curry Point, H.No. 7-96,J S N Colony, Street No.8 Habsiguda Uppal Mandal, Medchal-Malkajgiri District.

You, the Defendant of the above case is hereby informed that, the plaintiff bank has filed a suit against you to recover a loan of Rs.61,775/-. The case is posted to 21-04-2023 for your appearance. Therefore, you are hereby asked to appear on the said date at 10-30 AM before the aforesaid court either in person or through counsel and submit your reply. Failing which the matter will be heard and exparte orders will be passed.

//BY ORDER OF THE COURT//
P.VENKATESHWAR RAO
Advocate,
H.NO. 13-23-134
Flat No. 401, Sony Sai Residency, T.Nagar, Kothapet, Hyderabad- 35.

IN THE COURT OF THE HON'BLE PRL SENIOR CIVIL JUDGE AT KARIMNAGAR
O.S. No. 35 OF 2022

BETWEEN:
Gourishetty Suman ..Petitioner/Plaintiff
AND
K.S. Muralikrishna ..Respondent/Defendant

NOTICE

To,
K.S. Muralikrishna, Whole Time Director, M/s. Optical Health Solutions Pvt Ltd, R/o. H. No. 3-7-611 [NEW] 3-7-911 [OLD], Gourishetty Venkataiah complex, Jagtial Road, Karimnagar and R/o. H. No. 11-6-56, Sy. No. 257 & 258/1, Opp: ICPL Railway Siding, [Moosapet], Hyderabad.

WHEREAS the above named Plaintiff has filed a suit for Eviction and Recovery of arrears of rent against you in the above mentioned case before this Court. You are hereby required to appear in this court in person or by a pleader duly instructed **on the 28th April, 2023 at 10-30 AM** to defend the case, failing which the said petition will be heard and determined in your absence.

//By order of the court//
Sd/-
T. VENUGOPAL,
Advocate for the petitioner
FLAT No: 401, VENKATA SAI DURGA NILAYAM APARTMENT
OPP: HANUMAN TEMPLE ARCH, GANESHNAGAR, KARIMNAGAR-505001.

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT :HYDERABAD
O.S.No: 1321 Of 2022

Between:-
M/s.Anupam Fuels Pvt. Ltd, Rep by its Manager, Ankit Saraff. ....Plaintiff
AND
M/s.L.Prabhakar Cast Iron Works, Rep by its Manager, Mr.Shekar, ...Defendant

To,
Mr.Shekar, Manager, L.Prabhakar Cast Iron Works, R/o.H.No.7-4-02, R.K. Nagar, Changicherla, Ghatkesar, R.R. District, Hyderabad - 500 076.

Whereas the above named Plaintiff have file the above suit against the above named Defendant before this Hon'ble Court, for recovery of an amount of Rs.5,48,000/-: WHEREAS this Hon'ble Court was pleased to Order notice by way of publication in News Paper, against the defendant and whom-so-ever concerned. It is hereby informed that if anybody having any objection with regard to the above Prayer, they may put forth their objections before the above said Hon'ble Court by 10.30 A.M on 04.04.2023, if objections are not received by then the Defendant will be set exparte according to Law, if anybody wants information in this regard they can have such information from the Advocate whose particulars are mentioned hereunder.

//BY ORDER OF THE COURT//
V. SRIPRAKASH
Advocate
Counsel for the Petitioner

CAUTION NOTICE

My client Najma Begum, W/o. Chand Pasha, Aged 53 years, Occ: Housewife, R/o. 12-2-840, First Floor, First Lancer, Asifnagar, Hyd & 4 others, have instituted a suit vide O.S. No. 1728/2023 pending on the file of IX Jr. Civil Judge, C.C.C., Hyderabad,in respect of the property Premises bearing GHMC No. 12-2-840,land admeasuring 225 square yards, situated at Asif Nagar,Hyd, T.S. against Mr. Abdul Sattar S/o Late. Mohd. Chandra Sahab@Mohammed Chanda, & (2) Mrs. Ameer Unnisa Begum, W/o. Abdul Sattar, who are parents of my clients and Mr. Abdul Sattar has already conveyed the said property in favour of our clients by way of oral hiba, registered wills & gift settlement deeds other other legal heirs, inspite of the same they got created a forged and fabricated gift settlement deed vide Doc. No.5855/2022 Dt:13.09.2022 and registered Rectification Deed vide Doc. No. 1335 of 2023, dated: 04.03.2023 and by suppressing the real facts the said persons are trying to create third party interest by entering into the fresh agreements etc., as such the general public hereby cautioned not to purchase said property. The general public hereby warned/cautioned not to enter into any kind of agreement, transaction either with the above said persons in respect of the said property, if they shall be doing so, at their own risk and parel my clients shall not be held responsible for any consequences arising therefrom, and my client deserves their right to take legal action for the same.

DHARAM VEER SINGH
ADVOCATE
11-6-650/651, Opp.Nampally CriminalCourt, 2nd Gate, Red Hills, Hyderabad- 004
Cell: 9849756755.

PUBLIC NOTICE

The general public is hereby informed that our Client is intending to purchase residential property bearing Municipal No.6-2-1010/A, admeasuring 1063,65 Sq. Yards, along with ACC shed of 1200 square feet situated at Khairtabad, Hyderabad, T.S., with PTIN no. 1100605380 (Property owned by Mrs. Shanta Agarwal, Mrs. Mahima Gupta, Mrs.Shraddha Agarwal, Mrs. Ritu Agarwal, Miss Nishtha Agarwal (being legal heirs of Late Mr.Ramdas Agarwal), Mr. Ram Dayal Agarwal and Mr. Ram Manohar Agarwal. The details of Property are provided in Schedule below. Any person including any banks, financial institutions, entity, having any valid and legal claim/s or right/s or title or demand or interest in respect of the subject Property or any part thereof, by way of inheritance, share, sale, mortgage,lease, sub lease, casement, assignment, development rights, any agreement, power of attorney,lis pendens, stay order, attachment, decree, lien, charge, license, gifl, possession or encumbrance howsoever or otherwise is hereby required and called upon to intimate (in writing) to the undersigned within 7 (seven) days from the date of publication of this notice of his/her such claim, if any, with certified copies of all supporting documents, failing which the claims, if any, of such person shall be treated as waived and not binding on our Client **Schedule**

All that property bearing Municipal No.6-2-1010/A, admeasuring 1063.65 Sq. Yards,along with ACC shed of 1200 square feei situated at Khairtabad, Hyderabad. T.S., with PTIN no. 1100605380 and bounded by:- NORTH: Premises bearing No.6-2-1011/2, (III Eye Photo Studio) SOUTH: Premises bearing No.6-2-1011/1, belonging to Mr. Ramlal &Ramprakash : ,EAST:Railwayline, WEST: 100 feet wide road

Advocate Mrs. Meera Jaiswal,
#201, Nirmitee's Landmark, MLA Colony, Road No. 12,Barjara Hills, Hyderabad- 500 034
(Phone +9849106205

IN THE COURT OF THE HON'BLE III SENIOR CIVIL JUDGE CITY CIVIL COURTS , AT : SECUNDERABAD
E.PNO 131 OF 2018
IN
O.S.NO. 509 OF 2008

Between
Mr.Gurunath Dattathreya Shreeram .....Petitioner/Decree Holder/Plaintiff
AND
M/s. Balaji Constructions & Others .....Respondents/ Judgement Debtors

To
1. Smt. M.Shobha D/o.A.Sailoo, Aged: Major, Occ: Household
2. Mr. A.Srinivas S/o. A.Sailoo,Aged Major, Occ:-Pvt Service Both are R/o.Flat No: 402, H.No.12-10-130,Medibavi, Seetha palmandi, Secunderabad
(Judgement Debtors No. 4 & 5)

Whereas the Petitioner/Decree Holder/Plaintiff Sri.Gurunath Dattathreya Shreeram has instituted the above Execution Petition Under Order 21 Rule 35 & 43 of C.P.C to put the Decree Holder in the Suit Schedule Premises through Bailiff of the Hon'ble Court by evicting the Judgement Debtors and hand over the Vacant Possession of the Suit Schedule Property by removing all the belongings in the Suit Schedule Property, As Respondents/ JDRs No.4 & 5 mother Smt. A.Laxmi (Respondent/JDR No.3/ Defendant No.3) expired leaving JDR No.4 & 5 as her only surviving legal heirs. The Petitioner/DHR/Plaintiff filed an Execution Application vide No. 200 of 2019 and brought both of you i.e JDR No.4 & 5 on record as Legal Heirs of Smt. A.Laxmi. Both of you are hereby summoned to appear in the court of Hon'ble III Senior Civil Judge, City Civil Courts, Secunderabad in person or by a pleader duly instructed on 11-04-2023 at 10:30 A.M. to answer the same failing which the E.P will be decided exparte.

// BY ORDER OF THE HON'BLE COURT //
M/s.G. Maruthi Rao,
Advocates,
Office at Plot No.77, H.No:-4-11-003, Syndicate Bank Colony, West Marredpally,, Secunderabad 500026
Mobile No. 9700022159

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, MEDCHAL- MALKAJGIRI DISTRICT, AT MALKAJGIRI
O.S.NO. 121 OF 2023

Between:
1).Smt. Nunna Lakshmi Sujatha
2).Kumari Poorna Manasa Nunna
3). Sri Rohith Lakshmi Narayana ....Plaintiffs
And
The Thasildhar, Office of the Uppal village and Uppal Mandal, Medchal-Malkajgiri District, Telangana State & another .....Defendants

To
All Concerned ...Defendant No.2

WHEREAS the above plaintiffs have filed above numbered suit before the Hon'ble Court praying to declare them as the legal heirs of Late Sri N.V.Ramanamurthy, who died on 10-7- 2022 and to declare the plaintiffs as owners, possessors and successors of the plaint schedule of Property i.e., the open Plot bearing No.42, in survey No.14, admeasuring area 334 Sq. yards or 279.28 Sq.mts, situated at Mamathanagar in Block No. 1, Nagole Village under Municipality, Uppal Mandal, formerly Ranga Reddy District now in Medchal-Malkajgiri District the standing name of Sri N.V. Ramana murthy and to Award the costs of the suit and grant any such other relief or reliefs to what the plaintiffs are entitled. WHEREAS the Hon'ble Court ordered notice by publication in News Paper, concerning public at large and whom so ever concerned this notice is published. It is hereby informed that if anybody is having objections with regard to the above prayer they may put forth their objections before the above said Hon'ble Court at 10-30 A.M on 24-04-2023 and if objections are not received by then, the suit will be decreed according to law.

//BY ORDER OF THE COURT//
Sd/- **(S.VIKRAMADITYA BABU)**
Advocate,
High Court, Telangana State,
Counsel for the Plaintiffs
Flat No.102, Gangadhar Apartments, West Prasanthnagar Colony, Moosarambagh, Hyderabad-500 036
Mobile No.9440455033

కార్మికురాలికి కూలి డబ్బులు ఇప్పించిన సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



బేగం బజార్ లేబర్ అడ్డా వద్ద నుంచి అంజమ్మ అనే కార్మికురాలును వెంకటేష్ అనే గుత్తేదారు (మేస్త్రి) కూలీ పనికి తీసుకెళ్లి పని చేయించుకుని 18 రోజుల కూలీ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. తెలంగాణ బిల్డింగ్, అదర్స్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మేస్త్రి వెంకటేష్‌ను సీఐటీయూ కిషన్ గంజ్ ఆఫీసుకు పిలిపించి మాట్లాడి అంజమ్మకు రావాల్సిన 18 రోజుల కూలీ డబ్బులు రూ. 10,800 ఇప్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.జంగయ్య జిల్లా ఉపాధ్యక్షులు నెమ్మది గోపాల్, జిల్లా కమిటీ సభ్యులు కోట సత్యనారాయణ, వెంకటేష్, కె.హన్మంతు, వేముల అంజయ్య, జోన్ కమిటీ సభ్యులు డేవిడ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బేగంపేట్ ఎయిర్ పోర్టు ఉద్యోగులకు ఆయుర్వేద వైద్య పరీక్షలు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ కమిషనర్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు బేగంపేట్ ఎయిర్‌పోర్టు ఉద్యోగులు, సిబ్బంది 130 మందికి ఉచితంగా ఆయుర్వేద వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో కింగ్‌కోఠి పాలి క్లినిక్ ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, సెక్రెటరీయట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్. కార్వాన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేందర్, ఎయిర్ పోర్ట్ ఇన్‌చార్జి సంతోష్ పీనాక పాణి, కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నత్త నడకన సుందరయ్య పార్కు అభివృద్ధి పనులు

- దాదాపు రెండు నెలలుగా పార్కు మూసివేత





నవతెలంగాణ-ముషీరాబాద్

అధికారుల ప్రణాళికా లోపం.. కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం.. ప్రజాప్రతినిధుల పర్యవేక్షణా లోపం వెరసి పార్కు అభివృద్ధి పనులు పూర్తికావడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. రాంనగర్ డివిజన్ పరిధిలోని బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్కులో రూ.40 లక్షల నిధులతో పార్కులో గ్రీనరీ పెంపు, వాకింగ్ ట్రాక్ మరమ్మత్తు కోసం ప్రారంభించిన పనులు దాదాపు 50 శాతం కూడా పూర్తి కాలేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని అధికారులు, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.

ప్రణాళికా లోపం..

పార్కు అభివృద్ధి పనుల్లో స్పష్టంగా ప్రణాళికా లోపం కనిపిస్తుందనే చెప్పాలి. ప్రణాళికా బద్ధంగా వాకింగ్ ట్రాక్ నిర్మాణం, పార్కు గ్రీనరీ అభివృద్ధి పనులు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పార్కుల్లో వరద నీరు చేరుతుందన్నారు.

నిర్వహణ గాలికి..

ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకునే మిషన్లు, పరికరాల నిర్వహణను గాలికి వదిలేశారు. ఫలితంగా ఓపెన్ జిమ్ పరికరాలు రిపేరుకొచ్చిన మరమ్మత్తులు చేయాలనే ధ్యాస కూడా అధికారులు మరిచారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటి పరిస్థితిని కూడా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అధ్వానంగా మరుగుదొడ్లు..

పార్కులో మూత్రశాలలు నిర్మించినప్పటికీ వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. వాకింగ్ కోసం మహిళలు, వృద్ధులు పార్కుకు రావాలంటే సరైన మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు.

వీలైనంత త్వరగా పనులను పూర్తి చేస్తాం

సుందరయ్య పార్కు అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే. లేబర్స్ దొరక్క పనులు లేటవుతున్నాయి. వీలైనంత త్వరగా పూర్తిచేసి స్థానికులకు అందుబాటులోకి తెస్తాం. **భాస్కర్ హార్టికల్చర్ ఆఫీసర్**

పనులను త్వరగా పూర్తి చేయాలి



సుందరయ్య పార్కులో జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలి. నేను ప్రతి రోజూ వాకింగ్‌కు వచ్చేవాడిని. దాదాపు రెండు నెలలుగా పనులు కొనసాగుతున్నాయి. దీంతో వాకింగ్ చేయడానికి ఇబ్బంది ఏర్పడుతుంది. ప్రస్తుతం ఎండా కాలం కావడంతో కాస్త చల్లదనం కోసం పార్కులో కూర్చుందామంటే ఆ పరిస్థితి లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పనులను త్వరగా పూర్తి చేసి పార్కును వాకర్స్‌కు అందుబాటులోకి తీసుకురావాలి. **వెంకటశివ రామకృష్ణ, వాకర్**

జన్‌ధన్ ఖాతాల్లో వెంటనే రూ.20 లక్షలు వేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-సిటీబ్యూరో

బీజేపీ అధికారంలోకి వస్తే అకౌంట్‌లో డబ్బులు వేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు నెరవేర్చలేదనీ, ఇప్పటికైనా జనాధన్ ఖాతాల ద్వారా వెంటనే కేంద్ర ప్రభుత్వం రూ.20 లక్షలు వెంటనే వారి ఖాతాలో జమ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలోని అభినందన్ హెూటల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని ఈనెల 3,4,5 తేదీలో కలదేశంలో వెనుకబడిన అన్ని కులాలను కలుపుకుని పార్లమెంటు ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వెనుకబడిన తరగతులకు ఏ రంగంలోనూ దామాషా ప్రాతినిధ్యం లభించడం లేదనీ, రాజకీయంగా అధికారం చేజిక్కించుకునేందుకు ఆ సామాజికవర్గం మరో ఉద్యమం చేపట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 75 ఏండ్లుగా చట్టసభల్లో బీసీల ప్రాతినిధ్యం 14శాతం దాటకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేస్తూ, సంఘం తమ ప్రయోజనాల కోసం తమ వనరులను సమకూర్చుకోవడం అత్యవసరమన్నారు. రాజకీయాధికారం సాధించేందుకు బీసీ సంఘాలన్నీ ఉద్యమానికి పెద్దపీట వేయాలనీ, ఇతరత్రా పనికిమాలిన విషయాలకు సమయాన్ని, శక్తిని వృధా చేసుకోవద్దని సూచించారు. జాతీయ సంపదను ఉత్పత్తి చేయడంలో బీసీలు ముందున్నారనీ, అందులో వాటా లేదన్నారు. తాము ప్రభుత్వాలను ఎన్నుకుంటున్నాం, కానీ రాజకీయ అధికారంలో వాటా లేదన్నారు. అగ్రవర్ణాలు బీసీలను అణచివేస్తాయన్నారు. ఈ దేశంలోనే 56శాతం జనాభా ఉన్న బీసీలకు రాజ్యాంగ హక్కులు కాలరాయబడ్డాయి" అన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయన్నారు. ప్రవేట్ రంగాల్లో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలనీ, హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జిల నియామకంలో ఎస్సీ ఎస్టీ బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జాతీయ కన్వీనర్ గుద్ద సత్యం, ఎర్ర సత్యనారాయణ, అంజి, సుధాకర్, అనంతయ్య, వేముల రామకృష్ణ, సతీష్, పృథ్వి రాజ్ గౌడ్, నిఖిల్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ కేవీ కృష్ణారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావుకు వినతి



నవతెలంగాణ-అడిక్‌మెట్

నిమ్స్ హాస్పిటల్‌లో అక్రమాలకు పాల్పడుతున్న అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ కేవీ కృష్ణారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలి అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నందగోపాల్ మాట్లాడుతూ నిమ్స్ ఆస్పత్రిలో అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న కేవీ కృష్ణారెడ్డి రోగులకు మెరుగైన, వైద్య సదుపాయాలు కల్పిస్తానని వారి వద్ద డబ్బులు దండుకుని ఎలాంటి వైద్యం చేయకుండా పేషెంట్‌లను తిరిగి పంపిస్తున్నారని ఆరోపించారు. బడంగ్‌పేట బస్తీలోని నిరుపేద కుటుంబానికి చెందిన అరుణ్ కుమార్ న్యూరో వ్యాధితో బాధపడుతూ చికిత్స నిమిత్తం 2021లో నిమ్స్ హాస్పిటల్‌కి వెళ్తే కేవీ.కృష్ణారెడ్డిని కలిశారు. కృష్ణారెడ్డి డాక్టర్ వంశీ కృష్ణకు వైద్యానికి సంబంధించిన పనులను అప్పగించారని తెలిపారు. ఈ వ్యాధికి సంబంధించిన టెస్టులు బయట ల్యాబ్ చేయించుకోవాలని చెప్పడంతో బాధితుడు రూ.42 వేల నగదును వంశీకృష్ణకు అందజేశారు. అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ కేవీ కృష్ణారెడ్డి రోగికి మెరుగైన వైద్యం అందిస్తామని చెబుతూ మధ్యవర్తి ద్వారా బాధితుడు అరుణ్ కుమార్ వద్ద నుంచి ఖరీదైన మద్యం బాటిల్స్ రూ.20వేల నగదు తీసుకున్నట్టు తెలిపారు. చివరికి అతను వైద్యం చేసే డాక్టర్ వద్దకు పేషెంట్ వెళ్లగా హాస్పిటల్ పేరుతో కొంత డబ్బును డిపాజిట్ చేయాలని చెప్పగా అంతకు ముందే ఇతర వైద్యులకు డబ్బులు చెల్లించామని చెప్పడంతో వైద్యులు ఆగ్రహించి పేషంట్ బెడ్ ను సైతం కేటాయించకుండా ఇబ్బందులకు గురి చేయడంతో గత్యంతరం లేక బాధితుడు ఇంటికి చేరుకున్నాడు. బాధితుడు వెంట హాస్పిటల్‌కు వెళ్లిన సోదరుడు నర్సింగ్‌రావు మొదటి నుంచి హాస్పిటల్ సిబ్బంది ఇబ్బందులను గ్రహించి మనస్థాపం చెందిన ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. నర్సింగరావు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. నర్సింగరావు ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులతోపాటు నిమ్స్ వైద్యులు కూడా కారణమనీ, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి హరీశ్ రావుకు విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. స్పందించిన మంత్రి తక్షణమే నిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్‌కు లేఖ ద్వారా సమాచారం అందించి పూర్తి వివరాలను తెలియజేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు.

రికార్డు స్థాయిలో జీహెచ్ఎంసీ ఆస్తి పన్ను వసూలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ రికార్డు స్థాయిలో ఆస్తిపన్ను వసూళ్లయింది. శుక్రవారంతో 2022-23ఆర్థిక సంవత్సరం ముగిసింది. అయితే 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ. 2000 కోట్ల నిర్దేశిత లక్ష్యం పెట్టుకున్న జీహెచ్ఎంసీ మార్చి 31 వరకు రూ.1,681.72 కోట్ల ఆస్తి పన్ను వసూళ్లు అయినట్టు అధికారులు తెలిపారు. అత్యధికంగా ఖైరతాబాద్ జోన్‌లో రూ.435.57 కోట్లు వసూళ్లు కాగా, అత్యల్పంగా చార్మినార్ జోన్‌లో రూ.122.86 కోట్లు వసూలైంది. శేరిలింగంపల్లి జోన్‌లో రూ.348.60 కోట్లు, ఎల్‌బీ నగర్ జోన్‌లో రూ.259.06 కోట్లు, కూకట్‌పల్లి జోన్‌లో రూ.282.18 కోట్లు, సికింద్రాబాద్ జోన్‌లో రూ. 233.44 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది.

అగ్నిమాపక నిబంధనలు పాటించకుంటే సీజ్ చేస్తాం : జీహెచ్ఎంసీ అధికారులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

అగ్నిమాపక నిబంధనలు పాటించని పలు ఆస్పత్రులు, మాల్స్, వాణిజ్య సముదాయాలు, గోదాములకు జీహెచ్ఎంసీ ఈవీడీఎం నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీచేసిన వాటిల్లో న్యూ మలక్‌పేట్ డీమార్ట్, మాదాపూర్ కెనరా బ్యాంక్ బిల్డింగ్, మాదాపూర్ లక్కీ రెస్టారెంట్, మెహిదీపట్నం బటర్‌ఫ్లై హాస్పిటల్, మదీనగూడ సౌత్ ఇండియా షాపింగ్ మాల్, మెహిదీపట్నం చైన్నై సిల్క్స్ షాపింగ్ మాల్స్ ఇలా దాదాపు 19 మందికి నోటీసులు జారీ చేసినట్టు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సెల్లార్లు ఖాళీ చేయాలనీ, అత్యవసర ద్వారాలు తెరిచి ఉంచాలన్నారు. మూడు రోజుల్లోగా నిబంధనలు పాటించకపోతే సీజ్ చేస్తామని ప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. అక్రమంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న సికింద్రాబాద్‌లోని ఏఎంఆర్ ప్లానెట్‌కు రూ.50వేల జరిమానా విధించినట్టు తెలిపారు.

చరిత్రలో అత్యంత క్రూరమైన నియంత 'మోడీ'

- ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్
- 'మోడీ హటావో దేశ్ బచావో' అనే నినాదంతో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రపంచ చరిత్రలో అత్యంత క్రూరమైన నియంత ప్రధాని మోడీ అనీ, దేశ ప్రజలపై నియంత్రణ సాధించేందుకు క్రూరమైన పద్ధతులను ఉపయోగించడం దుర్మార్గమని ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. హక్కుల కోసం ప్రజల తరపున ప్రశ్నించే ప్రతిపక్షాలపై అనాగరిక పద్ధతులను ప్రయోగించి, అణిచివేతలకు గురిచేస్తూ కేంద్రంలోని బీజేపీ ఫాసిస్ట్ ప్రభుత్వం భయంకరమైన పాలన కొనసాగిస్తుందన్నారు. మోడీ నేతృత్వంలోని బీజేపీ నియంతృత్వ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ 'మోడీ హటావో దేశ్ బచావో' అనే నినాదంతో నిరసన ప్రదర్శన నిర్వహించాలని ఆమ్ ఆద్మీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శనివారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆప్ నేతలు, కార్యకర్తలు నల్ల చొక్కాలు ధరించి, ప్లకార్డులు చేతబూని 'మోడీ హటావో దేశ్ బచావో' నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు డాక్టర్ దిడ్డి సుధాకర్ తో పాటు ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, శోభన్ భూక్యా, ఎస్.కె.ఆర్.అన్సారీలు నేతృత్వం వహించారు. నియంతృత్వ మోడీ నశించాలి, సాబ్ కా సాథ్ సాబ్ కా సత్యనాస్, ఆత్మ నిర్భర్ నహి ఆత్మ అశాంతి హై, మోడీకి తానా షాహీ నహి చలేగి, మోడీ ఫాసిస్ట్ పాలనా మాకొద్దు, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి అంటూ ఆప్ కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంపై మోడీ ప్రభుత్వం చేస్తున్న దాడి ఎమర్జెన్సీ కంటే దారుణమన్నారు. మోడీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అధికారిక ఎమర్జెన్సీ లేకుండా సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ లాంటి సంస్థలు కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీ ఆదేశాలకు లొంగిపోతున్నాయనీ, ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు ప్రధాని మోడీని నిలదీస్తే 'అర్బన్-నక్సల్స్' జాతి వ్యతిరేకులు, దేశద్రోహం అని ముద్రవేయడం చేస్తూ తప్పుడు కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారన్నారు. కఠినమైన చట్టాలను తీసుకువచ్చి రైతు, కార్మిక, యువజన, విద్యార్థి, మహిళల మెడకు ఉచ్చు మరింత బిగించేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తుందన్నారు. నిరంకుశ దురహంకారం, హద్దులేని దురాశ, నిస్సంకోచమైన అవినీతితో కొనసాగుతున్న నియంత మోడీ ప్రభుత్వాన్ని ప్రజాసామ్యవాదులందరం ఏకమై తీవ్రంగా ప్రతిఘటించి కూలదోస్తామని హెచ్చరించారు. బుర్ర రాము గౌడ్ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ, రాజ్యాంగ నిబంధనలను తుంగలో తొక్కుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రతిపక్ష పార్టీల పాలన రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోస్తూ మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. ఈ ప్రదర్శనలో ఆప్ నేతలు మజీద్, రణధీర్ సింగ్ రానా, మల్లి మధు, జైసింగ్, జావీద్ షరీఫ్, జీషాన్, అబ్దుల్ ముక్తధీర్, ప్రవీణ్ యాదవ్, దర్శనం రమేష్, టి.రాకేష్ సింగ్, వికాస్ రెడ్డి, అహసాన్, పరీక్షిణ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

మూసీ పరివాహక ప్రజలకు అండగా ఉంటా

- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట



మూసీ పరివాహక ప్రాంతాల్లో నిర్మించే రిటైనింగ్ వాల్ కారణంగా ఇండ్లు కోల్పోతున్న రత్నానగర్, దయానంద్‌నగర్ వాసులకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం గోల్నాక క్యాంపు కార్యాలయంలో నల్లకుంట డివిజన్, రత్నానగర్, దయానంద్ నగర్‌కు చెందిన మూసీ నాలా ప్రాంతంలో నిర్మించే రిటైనింగ్ వాల్ కారణంగా ఇండ్లు కోల్పోతున్న స్థానికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హైదరాబాద్‌లోని మూసీ సర్ ప్లస్ నాలా ప్రాంతంలో, ట్యాంక్ బండ్ వరకూ చుట్టుపక్కల నివసించే ప్రజల శ్రేయస్సు దృష్ట్యా రిటైనింగ్ వాల్‌ను నిర్మించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని తెలిపారు. ఈ నేపథ్యంలో రత్నానగర్, దయానంద్‌నగర్ ప్రాంతాల్లో కొంత మంది నివాసాలను తొలగించనున్న వారికి నష్టపరిహారం అందించనున్నామనీ, వారు ప్రసుతం ఉంటున్న నివాస కట్టడం విలువతో పాటు వారి భూమి విలువను కూడా జోడించి, త్వరలోనే నష్టపరిహారం అందిస్తామనీ, ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ కమిషనర్ సాయిబాబా, డీఈ ప్రవీణ్ కుమార్, ఏఈ అరుణ, ఇతర అధికారులు, పార్టీ నాయకులు, బస్తీ వాసులు ఈశ్వర్, కిషోర్, వినోద్ కుమార్, ఓంకార్, సత్తయ్య, అహ్మద్, చాంద్ పాషా, సంజయ్, సతీష్ చంద్ర, పాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'వేగ శ్రీ లక్స్'ను సందర్శించిన మెగా సుధారెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో



భారతీయ వ్యాపారవేత్త, ప్రముఖ ఫ్యాషన్ ప్రియురాలు మెగా సుధారెడ్డి శనివారం వేగ శ్రీ లక్స్‌ను సందర్శించారు. కొత్తగా ప్రారంభించిన స్టోర్ వేగ శ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్ కింద విలాసవంతమైన ఆభరణాల లైన్ తిలకించారు. ఫ్యాషన్ 4 డెవలప్‌మెంట్ చరిత్రలో మొదటిసారిగా గౌరవించబడిన బహుముఖ వ్యక్తి మెగా సుధారెడ్డి ఈ కార్యక్రమానికి హాజరవడం పట్ల నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. వేగ శ్రీ లక్స్‌ను సందర్శించినపుడు, స్టోర్‌లోని ప్రతి ఆభరణం ప్రత్యేకంగా ఉంటుందని, వ్యక్తిత్వం, గాంభీర్యం, అందం, మనోజ్ఞతను ప్రతిబింబించేలా రూపొందించబడిందని తెలిపారు. వేగ శ్రీ లక్స్ బంగారం, వజ్రాలు, పోల్కీ, కుందన్ జ్యువెలరీల్లో అద్భుతమైన శ్రేణి ప్రీమియం ఆభరణాలను కలిగి ఉందనీ, ఇది పుట్టినరోజు పార్టీల నుంచి హై-ఎండ్ ఈవెంట్‌ల వరకు సందర్భానుసారంగా క్లిష్టమైన డిజైన్‌లు, అసాధారణమైన హస్తకళల సేకరణను ప్రదర్శిస్తుందని ఆమె అన్నారు. వేగ శ్రీ లక్స్‌కు ఆనాటి నుంచి వివిధ రకాల రాతి ఆభరణాలు ఉన్నాయని చెప్పారు.

ఇస్లామిక్ సెంటర్‌లో మగువల ఇఫ్తార్ పార్టీ

నవతెలంగాణ-హైదరాబాద్



రమజాన్ అంటే ఎనలేని సంతోషాలు తీసుకొచ్చే నెలరోజుల పండుగ. ఈ పర్వదినం పంచే ఆనందాలు అన్నీ ఇన్నీ కావు. ఈ పండుగ ఆనందాలు ఏ ఒక్కరి సొంతమో కాదు. ఇక ఇఫ్తార్ ఆనంద ఘడియలను ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేయకుండా ఉండలేరు. కులమతాలకు అతీతంగా, లింగ బేధం లేకుండా అంతా రంజాన్ ఘడియల్ని, రోజా పరిమళాలను ఆస్వాదిస్తారు. ఎక్కడెక్కడో ఉన్నవారిని ఒక్కచోట చేర్చే మహత్యం ఇఫ్తార్ దావత్‌లకే సాధ్యం. అలాంటి మధుర క్షణాలకు వేదికైంది టోలీచౌకీ ఇస్లామిక్ సెంటర్. సిటీలో రోజూ ఎవరి బిజీ షెడ్యూల్లో వారుండే సమయంలో రమజాన్ ఇఫ్తార్ పార్టీ అందరినీ ఒక్కచోట చేర్చింది. హిందూ ముస్లిం, క్రిస్టియన్స్, ఇలా కులమతాలకు అతీతంగా పాల్గొని ఇఫ్తార్ విందు చేశారు. తమ తోటి ముస్లిం మహిళలకు ఇఫ్తార్ చేయించారు. తమ స్వహస్తాలతో ఖర్జూరాలను తినిపించి ఫాస్టింగ్ విరమింపజేశారు. అంతా కలిసి ఒకే పంక్తిలో కూర్చుని భోజనాలు ఆరగించారు. టోలీచౌకీ ఇస్లామిక్ సెంటర్‌లో జమాఅతె ఇస్లామీహింద్ ఉమెన్స్ వింగ్ సెక్రెటరి నసీమ్ సుల్తానా టీమ్ సిటీలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న తమ ఫ్రెండ్స్‌ను ఈ ఇఫ్తార్ పార్టీకి ఇన్వైట్ చేశారు. సాయం సంధ్య వేళ ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఆ సంతోషాలకు అవధులు లేవు. మనం కలిసుంటే బలపడతాం.. విడిపోతే పడిపోతామని మరోసారి వారంతా గ్రహించారు. ఇఫ్తార్ పార్టీలు మత సామరస్యం, సౌభ్రాతత్వం, శాంతికి ఉదాహరణగా రమజాన్ ఇఫ్తార్ పార్టీ అని వారంతా పేర్కొన్నారు. తెల్లవారు జామున సహెరీ భుజించి రోజంతా పస్తులున్న రోజా దీక్షకులకు ఉపవాసం చేయించడం ఎంతో పుణ్యకార్యమన్న విషయాన్ని వారంతా గట్టిగా నమ్ముతారు. దేశంలో మతపరమైన ఉద్రిక్తతల్ని పెంచేందుకు పొలిటికల్ లీడర్లు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు వారి వలలో చిక్కుకోరాదనే సందేశాన్ని ఇఫ్తార్ పార్టీల ద్వారా అందజేయాల్సిన తరుణం ఆసన్నమైందను పలువురు పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ నగరానికి ఉన్న గంగా-జమునా తహెజీబ్ ప్రత్యేకతను ఈ ఇఫ్తార్ పార్టీలు చాటి చెబుతున్నాయి.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి : కార్పొరేటర్

నవతెలంగాణ-అంబర్‌పేట



పారిశుధ్యంపై అధికారులు, జీహెచ్ఎంసీ సిబ్బంది ఎప్పటికప్పుడు దృష్టి సారించి పని చేయాలని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం గోల్నాక డివిజన్ పరిధిలోని శంకర్ నగర్‌లో ఉన్న క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ పారిశుధ్యం అధికారులు ఎస్ఎఫ్ఏ తిరుపతి, ఎస్ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లీన్ అండ్ గ్రీన్ వర్క్ పెట్టి మట్టి కుప్పలు, చెత్తకుప్పలు ఎప్పటికప్పుడు తొలగించాలనీ, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలనీ, సీజన్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-అడిక్‌మెట్

కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి రాందాస్ అద్వాలేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో 50 శాతం రిజవేషన్లు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనాభ గణనలో బీసీ కుల గణన చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ సంస్థలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 52 శాతానికి పెంచాలన్నారు. ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలన్నారు. అసెంబ్లీ-పార్లమెంట్ సీట్లను 100 శాతం పెంచాలనీ, ఇలా పెంచిన సీట్లను ఇంతవరకు అసెంబ్లీ-పార్లమెంట్ గడప తొక్కని బీసీ కులాల వారికి నామినేటెడ్ పద్ధతి మీద ఆంగ్లో-ఇండియన్లకు ఇచ్చిన మాదిరిగా నామినేట్ చేయాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలనీ, బీసీల అభివృద్ధికి, విద్యా అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి అని కోరారు. బీజేపీ ప్రభుత్వం కులాల వారిని లెక్కలు తీయడానికి సుముఖంగా ఉందనీ, సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని హామీనిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఇతర కేంద్ర మంత్రులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి రాందాస్ అద్వాలే హామీనిచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ చర్చల్లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జు కృష్ణ, జాతీయ అధికార ప్రతినిధి, ఢిల్లీ ఇన్‌చార్జి కర్రి వేణుమాధవ్, భూపేష్ సాగర్, టి.రాజ్ కుమార్, ప్రసాద్, కె.రాము, బాషయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



నాంపల్లి మండల పరిధిలోని చాకనవాడీ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహారాజ్ గంజ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాంచందర్ హాజరై మాట్లాడారు. బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల పీచు పిండి పదార్థాలు ప్రోటీన్లతో పాటు ఐరన్ క్యాల్షియం పొందడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చు అని సూచించారు. అనంతరం తల్లులతో ఆరోగ్య పోషణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత, ఏఎన్ఎం సంజీవ, అనిత, అంగన్వాడీ టీచర్ రాజకుమారి, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రాణాలను కాపాడినట్టే

నవతెలంగాణ-బంజారాహిల్స్



ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రాణాలను కాపాడటంలో భాగస్వాములు కావాలని ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. శనివారం పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ వెంకట్ ప్రసాద్ చిరంజీవితో కలిసి నర్సింగ్ విద్యార్థులతో పాటు వివిధ భాగాల్లో చదువుతున్న వారందరికీ పవర్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాలు కాపాడే ఆస్పత్రి సిబ్బంది ప్రాణాలను కాపాడుకోవడంలో అలసత్వం చేయొద్దని సూచించారు. స్టాప్ లైన్, రాంగ్ రూట్, ట్రిబల్ రైడింగ్,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటాలనీ, రోడ్డు మీద నడిచే వారు ఎప్పుడూ 'దృష్టి, మనసు' పూర్తిగా రోడ్డు మీదనే ఉండేలా చూసుకోవాలన్నారు. రహదారులపై క్రమశిక్షణగా వ్యవహరించాలన్నారు. వాహనాలను నడిపించే వారు ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంజాగుట్ట ట్రాఫిక్ పోలీస్ అధికారులు, నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, హెచ్ఓడీ వైద్యుల బృందం, ఆర్ఎంఓ వైద్యుల బృందం, జూనియర్, సీనియర్ వైద్యులు, నర్సింగ్, అడ్మినిస్ట్రేషన్, బిల్లింగ్ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జలమండలి ఓఅండ్ఎం డివిజన్ నం.5 నారాయణగూడ రిజర్వాయర్‌లోని 600 ఎంఎం డయా ఇన్‌లెట్ స్లూయిజ్ వాల్వ్ రిపేర్, 450 ఎంఎం డయా ఔట్ లెట్ మెయిన్‌కు జరుగుతున్న లీకేజీని అరికట్టడానికి మరమ్మతులు పనులు చేపడుతున్నారు. ఈ పనుల వల్ల పలు ప్రాంతాల్లో ఈ నెల 3వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయం త్రం 4 గంటల వరకు ఈ పనులు జరుగుతాయి. పలు ప్రాంతాల్లో మంచి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడు తుంది. అంతరాయం ఏర్పడే ప్రాంతాలు గాంధీనగర్ సెక్షన్ అశోక్‌నగర్, ఎస్ఆర్టీ క్వార్టర్స్, టీఆర్టీ క్వార్టర్స్, జవహర్ నగర్, పీ అండ్ టీ క్వార్టర్స్, నారాయణగూడ సెక్షన్ విఠల్ వాడి, చంద్రానగర్, సంజయ్ గాంధీ నగర్, హిమాయత్ నగర్, కింగ్ కోఠిలోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. బర్కత్‌పుర సెక్షన్ చప్పల్ బజార్, కుత్బిగూడ, నింబోలి అడ్డా, రత్నానగర్, మోతీ మార్కెట్ ప్రాంతాలు ఉన్నాయి. సుల్తాన్‌బజార్ సెక్షన్ బొగ్గులకుంట, రామ్‌కోఠి, చౌదరిబాగ్ కూర గాయల మార్కెట్ ఉన్నాయి. హిందీనగర్ సెక్షన్ మాలకుంట రోడ్డు, ఉస్మాన్ గంజ్, శంకర్ బాగ్, రిసాలా అబ్దుల్లా, గౌలి గూడ సెక్షన్ గౌలి గూడకమాన్, మహరాజ్ గంజ్, ఓల్డ్ ఫీల్ ఖానా, బేగం బజార్, కిషన్ గంజ్ ఉన్నాయి. నీటికి అంతరాయం ఏర్పడే ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని బొగ్గులకుంట మేనేజర్ మధుసూదనాచారి ఒక ప్రకటనలో కోరారు



విజయ రామారావ్ సేవలు వెలకట్టలేనిది, చిరస్మరణీయమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని మాజీ మంత్రి విజయ రామారావ్ నివాసానికి బండారు దత్తాత్రేయ, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విచ్చేసి ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నవతెలంగాణ-బంజారాహిల్స్

దుండిగల్ మున్సిపాల్టీ అభివృద్ధే ధ్యేయం

- పురపాలక చైర్ పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాల్టీ పరిధి గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఇంటి పన్నుల వసూలపై సమీక్ష సమావేశాన్ని పురపాలక చైర్ పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, భరత్ కుమార్, ఆర్.వో శ్రీహరి రాజు, బిల్ కలెక్టర్లు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామభక్త ఆంజనేయ స్వామి ఆలయానికి రూ. లక్ష విరాళం



నవతెలంగాణ- మేడ్చల్

పూడూరు గ్రామం ఆధ్యాత్మిక దేవాలయాలకు నిలయంగా నిలుస్తుందని సర్పంచ్ బాబు యాదవ్ అన్నారు. శనివారం గ్రామ పరిధిలో నూతనంగా నిర్మించిన రామభక్త ఆంజనేయ స్వామి ఆలయానికి తమ వంతు సహకారంగా మెగా ఇంజనీరింగ్ గ్యాస్ సంస్థ వారు రూ.1లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సాయి క్రిష్ణ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రూ. లక్ష నగదు అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాబు యాదవ్, వార్డు సభ్యులు శశికుమార్ యాదవ్, శ్రీకాంత్,ఆలయ నిర్వాహకులు శోభన్ బాబు,కిశోర్ యాదవ్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుక్కలు బాబోయ్.. కుక్కలు..!

- రెచ్చిపోయి వెంటపడి దాడి చేస్తున్న వైనం
- బయటకు వెళ్లేందుకు బెదురుతున్న ప్రజలు



నవతెలంగాణ-బాలానగర్

నగర శివారులలో వీధి కుక్కలు స్వైరవిహారం కొనసాగుతోంది. బస్తీలు, కాలనీలలో గుంపులుగా తిరుగుతూ దాడికి పాల్పడుతు న్నాయి. కుక్కల దాడిలో గాయపడుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. వీరిలో చిన్నారులే అధికంగా ఉంటున్నారు. కుక్కల బెడద తగ్గించేందుకు వాటికి సంతాన నిరోధక శస్త్రచికిత్స (స్టెరిలైజేషన్) చేయడం వ్యాధి నిరోధక టీకా వేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా ఎక్కడా అమలవుతున్న దాఖలాలు అంతంత మాత్రమే.

కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని బాలానగర్ డివిజన్ పరిధిలో గల కాలనీలు, బస్తీలు అనే తేడాలేకుండా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఉదయం వాకింగ్ కు వెళ్లే వారితో పాటు ద్విచక్ర వాహన దారులపై వెళ్లే వారి వెంట పడి తరుముతున్నాయి. వీటి బారిన పడి పలువురు గాయాలపాలయ్యారు. అయినా సంబంధిత విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు స్థానికులు వాపోతున్నారు. ఏ కాలనీలో చూసినా, ఏ వీధిలో చూసినా కుక్కల గుంపులే కనిపిస్తున్నాయి. వాటిని దాటుకుని వెళ్లడానికి స్థానికులు పడరాని పాట్లు పడవలసి వస్తోంది.

ఉదయం, రాత్రి వేళల్లో బయటకు వెళ్లాలంటే వణుకు పుడుతోంది...

ఉదయం, రాత్రి వేళల్లో ప్రజలు బయటకు వెళ్లాలంటే కుక్కలు చుక్కలు చూపిస్తున్నాయి. బాలానగర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతం నుంచి వచ్చే పాదచారులు, వాహనదారులు తమ ఇండ్లకు చేరుకోలంటేనే జంకుతున్నారు. ముఖ్యంగా ఎక్కువ మంది తెల్లవారు జామున విధులకు వెళ్లాల్సిన కార్మికులు, ఉద్యోగులు కాలనీల నుండి బస్టాపులకు వెళ్ళేం దుకు భయంభయంగా బయలు దేరాల్సిన దుస్థితి నెలకొంది. ప్రధానంగా ఉదయం వేళల్లో ట్యూషన్లకు వెళ్లాల్సిన విద్యార్థినీ, విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళుతున్నారు. ఇటీవల బాలానగర్ లోని వినాయక్ నగర్, సాయినగర్‌లలో ఒకేసారి 16 మంది చిన్నారులను వీధి కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. నిత్యం ఎక్కడో ఒక చోట విధులకు వెళ్తున్న కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు నిత్యం కుక్కల బారిన పడుతున్నారు. శోభన బస్టాప్ నుంచి ఇండ్లకు చేరుకునే వారు రాత్రివేళలో చెరబండరాజు నగర్, కళ్యాణి నగర్, నవజీవన్ నగర్, పోలీస్ క్వార్టర్స్, వినాయక నగర్, సాయి నగర్, రాజు కాలనీ తదితర ప్రాంతాలకు వెళ్లే వారిని చూసి కుక్కలు వెంటపడుతున్నాయి. అతి కష్టం మీద వాటి నుండి తప్పించుకొని ఇండ్లకు చేరుకునేవారికి చుక్కలు కనిపిస్తున్నాయని అంటున్నారు. కుక్కల బారిన పడకూడదని వాహనదారులు అతివేగంగా వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. బస్తీలలో, కాలనీలలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితిలో నెలకొన్నాయి. జీహెచ్ఎంసి సర్కిల్ పరిధిలో సరిపోయినంత సిబ్బందిని నియమించి వీధి కుక్కల నియంత్రించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కల స్వైరవిహారం చేస్తున్నా పట్టించుకోని అధికారులు



కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని పలు బస్తీ ల్లో కుక్కలతో బస్తీల ప్రజలు, చిన్న పిల్లలు ప్రాణాలను గుపట్లో పెట్టుకోని రోడ్డు ల మీద నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్ నగరంలో ఎక్కడైనా ప్రమాదాలు కాగానే రెండు, మూడు రోజులు హడావుడి చేస్తారు తర్వాత వాటిని పట్టించుకునే వారే ఉండరు. ప్రమాదం జరగక ముందే వీధి కుక్కలను బస్తీ ల్లో లేకుండా చూడాలని సీపీఐ(ఎం) తరఫున ప్రజాప్రతినిధులు,అధికారులను కోరుతున్నాము. బాలానగర్ లోని రాజుకాలనిలో విధి కుక్కలు 16 మందిని కరిచాయి అంటేనే ఎంత ప్రమాదం లో ఉన్నామో అర్థం అవుతుంది పిల్లలను బడికి తీసుకువెళ్లాలి అంటే పిల్లల తల్లిదం డ్రులు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. వీధి కుక్కలను బంధించి జంతువుశాలకు పంపించాలి. జీహెచ్ఎంసీ అధికారులు,ప్రజాప్రతినిధుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బలపురం రాజశేఖర్

వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి



వీధి కుక్కలు దాడులకు తెగబడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో దాడి చేసి చంపుతున్నాయి.నిత్యం ఏదో ఒక ప్రాంతంలో కుక్కల దాడి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దాంతో వీధి కుక్కలను చూస్తే ప్రాణ భయంతో జనాలు వణికిపో తున్నారు. ద్విచక్ర వాహనాలపై వారిని వెంబడిస్తున్నాయి. తప్పిం చుకునే ప్రయత్నంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబం ధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.

- డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బి. చైతన్య రెడ్డి

వీధి కుక్కల నియంత్రణకు 26 అంశాలతో నివేదిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో వీధి కుక్కల నియంత్రణకు ఏర్పాటైన హై లెవల్ కమిటీ సూచించిన సిఫార్సులను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి తెలిపారు. హైలెవల్ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి కుక్కల నియంత్రణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన 26 అంశాలతోకూడిన నివేదికను శనివారం మేయర్ అందజేశారు. కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పలు అంశాలను మేయర్ దష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో హై లెవల్ కమిటీ సభ్యులు సి.ఎన్.రెడ్డి, శ్రవణ్, రాజశేఖర్ రెడ్డి, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, మీర్జా ముస్తఫా బేగ్, అడిషనల్ కమిషనర్ హెల్త్ శతి ఓజా, వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, జాయింట్ కమిషనర్ శానిటేషన్ సంధ్య, హై లెవల్ కమిటీ కో-ఆర్డినేటర్ డా.జె.పి విల్సన్‌లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ వీధి కుక్కల నియంత్రణకు వెటర్నరీ, హెల్త్, శానిటేషన్ సంయుక్తంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలో జోన్ వారిగా ఉన్న హోటల్స్, రెస్టారెంట్ లు, ఫంక్షన్ హాల్స్ గార్బేజ్‌ను ఎప్పటికప్పుడు తొలగించేందుకు ఓక శానిటేషన్ జవాన్ గానీ, ఎస్.ఎఫ్.ఏకు బాధ్యత ఇవ్వాలని జాయింట్ కమిషనర్‌ను ఆదేశించారు. వీధి కుక్కలను పట్టుకోవడానికి 30 సర్కిళ్లలో రెండు వాహనాల చొప్పున 60 వాహనాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కమిటీ నివేదిక ప్రకారంగా వచ్చే వారంలో హై లెవల్ కమిటీ సభ్యులతో పాటు అడిషనల్ కమిషనర్ శానిటేషన్ హెల్త్, వెటర్నరీ అధికారులతో పూర్తిస్థాయిలో సమీక్షించేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్టు సభ్యులకు మేయర్ వివరించారు.

వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొలను నారాయణరెడ్డి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో క్యాంబ్రిడ్జి మంటసరీ స్కూలు మొదటి వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ , 8వ డివిజన్ కార్పొరేటర్ సురేష్ రెడ్డి లు హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుభవం కలిగిన ఉపాధ్యాయలతో మంచి విద్యను అందిస్తున్న క్యాంబ్రిడ్జి మంటేసరి యాజమాన్యనికి అభినందనలు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు, ఆట పాటలతో క్రమశిక్షణతో మెదిలి భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన క్యాంబ్రిడ్జి మంటేసరి స్కూల్ డైరెక్టర్ అరుణ శ్రీ ఉపాధ్యాయ బందానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆవుల జగన్ యాదవ్ , విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే కేపీ వివేకానంద



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజల సహాయ సహకారాలతో అన్ని ప్రాంతాలు అభివద్ధి పథంలో నడిపిస్తున్నామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలో 'ప్రగతి యాత్ర'లో భాగంగా 36వ రోజు ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సంద ర్భంగా జీషన్ బస్తీ, దావూద్ బస్తీ, సంజయ్ గాంధీనగర్‌లలో స్థానిక కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ కలిసి శనివారం పాదయాత్ర చేస్తూ పూర్తి చేసిన అభివద్ధి పనులను పరిశీలిం చారు. జీశన్ బస్తీ (నెహ్రూ నగర్)లో రూ.86 లక్షలతో సీసీ రోడ్లు, భూగర్భ డ్రయినేజీ, స్మశానవాటిక అభివృద్ధి చేసినందుకు బస్తీ వాసులు ధన్యవాదాలు తెలిపారు. మిగిలి ఉన్న రోడ్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దావూద్ బస్తీ (నెహ్రూ నగర్)లో రూ. 1.5 కోట్లతో భూగర్భ డ్రయినేజీ పైప్ లైన్, సీసీ రోడ్లు, ముస్లిం స్మశానవాటిక అభివద్ధి చేసినందుకు ఎమ్మెల్యేకు బస్తీ వాసులు కతజ్ఞతలు తెలిపారు. మిగిలి ఉన్న రోడ్లు, మంచినీటి సరఫరా, స్మశానవాటిక అభివద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంజయ్ గాంధీనగర్ లో రూ.2.39 కోట్లతో మేన్ రోడ్లు, భూగర్భ డ్రయినేజీ, మంచినీటి లైన్ల అభివృద్ధికి కృషి చేసినందుకు ఎమ్మెల్యేను బస్తీవాసులు అభినందిస్తూ సన్మానిం చారు. మిగిలి ఉన్న రోడ్లు, కమిటీ హాల్, హిందూ, ముస్లిం గ్రేవియార్డుల్లో మౌలిక సదుపాయాలు, ప్లేగ్రౌండ్ లో ఆట సామగ్రి ఏర్పాటుకు కృషి చేయాలని బస్తీ వాసులు ఎమ్మెల్యేను కోరగా.. అక్కడే ఉన్న అధికారులకు ఆయన ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ జయరాం, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, ప్రధాన కార్యదర్శి జి .సుధాకర్, డివిజన్ యువజన విభాగ అధ్యక్షులు అంజి ముదిరాజ్, డీఈఈ భాను చందర్, ఏఈ మల్లారెడ్డి, జలమండలి మేనేజర్ పూజిత, కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు , బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శుభకర హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ



నవతెలంగాణ-దుండిగల్

బాచుపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన శుభకర హాస్పటల్‌ను ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మెన్, నిజాంపేట్ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, దుండిగల్ కౌన్సిలర్లు, కొంపల్లి కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

నేటి జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లిలో నిర్వహించబోయే మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే మాధవ రం కృష్ణారావు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లా డారు. ఆదివారం కూకట్ పల్లి మెట్రో ట్రాక్ పార్క్ వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే మెగా జాబ్ మేళాకు దాదాపు 100కు పైగా కంపెనీలు వస్తున్నా యని.. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాల న్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ, టెక్నికల్ ,నాన్ టెక్నికల్ ఎవరైనా సరే ఈ జాబ్ మేళాకు హాజరై, అర్హత గల ఉద్యోగాన్ని పొందుతారని ఆశిస్తున్నానని అన్నారు. అలాగే ఏదైనా ఇబ్బంది ఉన్న యెడల అక్కడ వాలంటీర్లు కూడా ఉన్నారని, వారు సహకరిస్తారని వివరించారు. ఎక్కడికక్కడ సూచిక బోర్డులు, తెలియని వారికి వివరాలు చెప్పే విధంగా హెల్ప్ డెస్కులు సైతం ఏర్పాటు చేశామని చెప్పారు. అందరూ కూడా వారి బయోడేటా కాపీలను, అర్హత గల సర్టిఫికెట్లను జిరాక్స్ మాత్రమే తీసుకొని జాబ్ మేళాకు హాజరు కావాలని అన్నారు. అలాగే ఎటువంటి విద్యార్హతలు లేకున్నా కూడా వారికి తగిన విధంగా కూడా జాబ్స్ ఉన్నా యని.. డ్రైవర్లు హెల్పర్లు వంటి చిన్న తరహా ఉద్యోగాలు కూడా జాబ్ మేళాలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

'మన ఊరు మన బడి'తో పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ



నవతెలంగాణ - కూకట్‌పల్లి

మన ఊరు-మన బడి కార్యక్రమంతో రాష్ట్రంలోని ప్రభు త్వ పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ తెలిపారు. మన బస్తీ - మన బడి కార్యక్రమంలో భాగంగా శనివారం వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని రిక్షా పుల్లర్స్ కాలనీలో గల మండల ప్రాథ మిక పాఠశాలలో రూ. 59 లక్షల 6 వేలతో చేపట్టిన మౌలిక వసతులను, మండల విద్యాధికారి ఆంజనేయులు, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగరావుతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిన్న మొన్నటి దాకా శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు నేడు అధునాతన సకల హంగులతో, కొత్త సొగసును సంతరించుకుంటున్నాయని తెలిపారు. చూడముచ్చ టైన తరగతి గదులు, క్లాస్‌రూంలో డ్యూయల్ డెస్కులు, విద్యుత్తు వెలుగులు, పరిశుభ్రమైన టాయిలెట్లు, స్వచ్ఛమైన మంచినీళ్ల ట్యాంక్‌లు, వంటగదులు, భోజనశాలలు, వాకింగ్ ట్రాక్‌లు, చుట్టూ ప్రహరీలు ఇలా అనేక సకల సదుపాయాలతో విద్యార్థులు ఏకాగ్రతతో నిశ్చింతగా చదువులు కొనసాగిం చేందుకు అవసరమైన ఆహ్లాదకర వాతావారణాన్ని పంచిపెడు తున్నాయని తెలిపారు. పిల్లల చదువులకు సరికొత్త భరోసాను అందిస్తున్నాయని పేర్కొన్నారు. మన ఊరు మన బడి మొదటి విడతలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి శేరిలింగంపల్లి మండలం పరిధిలో 24, కూకట్ పల్లి మండలం పరిధిలో 7 ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పిచడం జరిగిందని తెలిపారు. మిగతా పాఠశాలలను దశల వారిగా పూర్తి చేసి శేరిలింగంపల్లి ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈ దాసయ్య, ఏఈ ధీరజ్ , బీఆర్ఎస్ వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షులు సంజీవ రెడ్డి, బీఆర్ఎస్ మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, నాయినేని చంద్రకాంత్ రావు, మాచర్ల భద్ర య్య, అంజనేయులు, రాంచందర్ మోజేష్ బాబురావు,చంద్రమోహన్ సాగర్, లింగయ్య ,కష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను తొలగించాలి

- సీఐటీయూ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

షాపూర్‌నగర్ రైతు బజార్ వద్ద ఉన్న డివైడర్‌ను తొలగించాలని సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ రైతు బజార్ ముందు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు అమ్ముకునే, కొనుక్కునే వారికి ప్రధాన సమస్యగా ఉన్న రోడ్డు డివైడర్‌ను తొలగించాల ని కోరారు. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిష్కారం చేస్తామని చెప్పడమే గానీ ఇంతవరకు చేయలేదన్నారు. ఇప్పటికైనా అధి కారులు, ప్రజాప్రతినిధులు ఆలోచన చేసి డివైడర్ సమస్యను పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షాపూర్ నగర్ రైతు బజార్ చిరు వ్యాపారుల సంఘం ప్రతినిధులు నాగేశ్వరరావు, అమరావతి, నాగమణి, ప్రకాష్, వాహెడ్ తదితరులు పాల్గొన్నారు.

నిఖత్‌కు నీరాజనం

● పెయిర్‌పోర్ట్‌లో చాంపియన్‌కు ఘన స్వాగతం



నవతెలంగాణ-హైదరాబాద్ : ఐబీఏ ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌గా వరుసగా రెండో ఏడాది పసిడి పతకం సాధించిన భారత స్టార్ బాక్సర్, తెలంగాణ ముద్దు బిడ్డ నిఖత్ జరీన్‌కు హైదరాబాద్‌లో ఘన స్వాగతం పలికింది. ఇటీవల న్యూఢిల్లీ వేదికగా మార్చి 15-26న జరిగిన ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో నిఖత్ జరీన్ మహిళల 50 కేజీల విభాగంలో పసిడి పతకం సాధించింది. 2022 ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో మహిళల 52 కేజీల విభాగంలో నిఖత్ జరీన్ పసిడి పతకం సాధించిన సంగతి తెలిసిందే. దిగ్గజ బాక్సర్ ఎం.సీ మేరీకోమ్ అనంతరం వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో రెండు పసిడి పతకాలు సాధించిన తొలి భారత బాక్సర్‌గా చరిత్ర సృష్టించిన నిఖత్ జరీన్ చారిత్రక పసిడి పంచ్ అనంతరం శనివారం హైదరాబాద్‌కు చేరుకుంది. ఉదయం 9 గంటలకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న నిఖత్ జరీన్‌కు తెలంగాణ సంప్రదాయ కళా రూపాల ప్రదర్శనతో ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్, తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు వేణుగోపాలచారి, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షులు చాముండేశ్వరినాథ్, క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియ సహా శాట్స్ ఉన్నతాధికారులు, క్రీడాకారులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

స్టేడియాల్లో సౌకర్యాల కల్పన

● అంచనాలు రూపొందించండి
● శాట్స్ అధికారులకు మంత్రి, చైర్మెన్ ఆదేశం



నవతెలంగాణ-హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా స్టేడియాల్లో సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని శాట్స్ అధికారులను క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్ ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియాన్ని శనివారం ఉన్నతాధికారులతో కలిసి మంత్రి, చైర్మెన్ తనిఖీ చేశారు. ఎల్బీ స్టేడియం హాస్టల్, ఇతర క్రీడలకు అవసరమైన సదుపాయాలు, స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల రిపేర్‌కు సంబంధించిన పనులపై అంచనాలను రూపొందించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఎల్బీ స్టేడియానికి సరికొత్త రూపు తీసుకొచ్చేందుకు పెయింటింగ్ పనులను సైతం మొదలుపెట్టాలని సూచించారు. ఎండాకాలంలో నీటి ఎద్దడి కారణంగా మైదానంలో పచ్చిక కనుమరుగు కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియ, శాట్స్ అధికారులు సుజాత, ధనలక్ష్మి, స్టేడియం పరిపాలన అధికారులు తదితరులు మంత్రి, చైర్మెన్‌తో పాటు ఉన్నారు.

వరుస వైఫల్యాల నుంచి గొప్పగా పుంజుకున్న తెలుగు తేజం, రెండు సార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పి.వి సింధు ఈ సీజన్‌లో తొలిసారి ఓ టోర్నీ ఫైనల్లోకి ప్రవేశించింది. సెమీఫైనల్లో సింగపూర్ షట్లర్‌ను చిత్తు చేసిన సింధు వరుస గేముల్లో గెలుపొంది స్పెయిన్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నీ టైటిల్ పోరుకు సిద్ధమైంది.

ఎదురులేని సింధు

● ఫైనల్లో అడుగుపెట్టిన తెలుగు తేజం
● సెమీస్‌లో సింగపూర్ షట్లర్ చిత్తు

స్పెయిన్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నీ



మాడ్రిడ్ (స్పెయిన్) : భారత అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు సీజన్లో తొలి డబ్ల్యూబీఎఫ్ టైటిల్‌పై కన్నేసింది. వరుసగా ఇండియా ఓపెన్, మలేషియా ఓపెన్, ఆల్ ఇంగ్లాండ్, స్విస్ ఓపెన్‌లో నిరాశపరిచిన రెండు సార్లు ఒలింపిక్ మెడలిస్ట్.. ప్రపంచ ర్యాంకింగ్స్‌లోనూ టాప్-10 ఆవలకు పడిపోయింది. ఒత్తిడిలో గొప్పగా ఆడే అలవాటున్న సింధు.. స్పెయిన్ మాస్టర్స్‌లో అదే పునరావృతం చేసింది. ప్రతికూల పరిస్థితుల్లో దుమ్మురేపే ప్రదర్శనతో స్పెయిన్ మాస్టర్స్ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి ప్రవేశించింది. సింగపూర్ షట్లర్ యో జియ మిన్‌పై వరుస గేముల్లో 24-22, 22-20తో ఘన విజయం సాధించింది.

వరుస గేముల్లో..

సింగపూర్ షట్లర్ యో జియా మిన్‌పై సింధుకు మంచి రికార్డుంది. గతంలో ఆడిన మూడు మ్యాచుల్లోనూ మూడో గేమ్‌కు వెళ్లకుండానే విజయాలు నమోదు చేసింది. ఇటీవల సింగపూర్ అమ్మాయి పుంజుకోవటం.. సింధు ఫామ్‌లో లేకపోవటంతో సెమీస్ సమరంపై ఆసక్తి పెరిగింది. రెండు గేముల్లో సింధు గెలుపొందినా.. రెండు గేములను ప్రత్యర్థి షట్లర్ టైబ్రేకర్ వరకు తీసుకెళ్లింది. తొలి గేమ్‌లో సింధు వెనుకంజ వేసింది. 9-11తో విరామ సమయానికి ఆధిక్యం కోల్పోయింది. 15-20తో గేమ్ పాయింట్ ప్రమాదంలో పడిన సింధు.. అద్భుత ప్రదర్శన చేసింది. వరుసగా ఐదు గేమ్ పాయింట్లను కాచుకుంది. 20-20తో స్కోరు సమం చేసింది. 22-22తో మరోసారి స్కోరు సమమైనా.. వరుసగా రెండు పాయింట్లతో 24-22తో తొలి గేమ్‌ను గెల్చుకుంది. ఇక రెండో గేమ్ నువ్వా నేనా అన్నట్టు సాగింది. విరామ సమయానికి 11-6తో సింధు ఐదు పాయింట్ల ముందంజలో నిలిచింది. కానీ ద్వితీయార్థంలో సింగపూర్ షట్లర్ పుంజుకుంది. 14-14 వద్ద స్కోరు సమం చేసింది. 17-14తో సింధు మరోసారి ముందంజ వేసినా.. జియా మిన్ 17-17తో మరోసారి సమవుజ్జీగా నిలిచింది. 18-18, 20-20తో ఉత్కంఠగా సాగిన రెండో గేమ్ టైబ్రేకర్‌లోకి అడుగుపెట్టింది. ఒత్తిడిలో వరుసగా రెండు పాయింట్లు గెల్చుకున్న సింధు రెండో గేమ్‌తో పాటు ఫైనల్స్ బెర్త్‌ను కైవసం చేసుకుంది. 48 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో సింగపూర్ షట్లర్‌ను చిత్తు చేసిన పి.వి సింధు సీజన్లో తొలి టైటిల్ పోరుకు సిద్ధమైంది.

తొలి ఐపీఎల్ కాంక్షతో రగిలిపోతున్న పంజాబ్ కింగ్స్ సీజన్16 తొలి మ్యాచ్‌లోనే గెలుపు బోణీ కొట్టేసింది. వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో కోల్‌కత నైట్‌రైడర్స్‌పై డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 7 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత పంజాబ్ కింగ్స్ 191/5 పరుగులు చేయగా.. ఛేదనలో కోల్‌కత 16 ఓవర్లలో 146/7 పరుగులు చేసింది. వర్షం అంతరాయంతో కోల్‌కత ఛేదనలో చివరి నాలుగు ఓవర్ల ఆట సాధ్యపడలేదు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో విజేతను తేల్చారు.

ఐపీఎల్‌లో నేడు
హైదరాబాద్ X రాజస్థాన్
వేదిక : ఉప్పల్ సమయం : మ: 3.30
బెంగళూర్ X ముంబయి
వేదిక : బెంగళూర్ సమయం : రా: 7.30
స్టార్‌స్పోర్ట్స్,జియో సినిమాలో ప్రసారం

పంజాబ్ బోణీ

● డక్‌వర్త్ పద్ధతిలో కోల్‌కతపై గెలుపు
● నిప్పులు చెరిగిన అర్షదీప్ సింగ్

ఛేదనలో నైట్‌రైడర్స్ చతికిల!



నవతెలంగాణ-మొహాలి :

ఐపీఎల్ 16ను పంజాబ్ కింగ్స్ విజయంతో మొదలెట్టింది. మొహాలిలో శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో కోల్‌కత నైట్‌రైడర్స్‌పై పంజాబ్ కింగ్స్ డక్‌వర్త్‌లూయిస్ పద్ధతిలో 7 పరుగుల తేడాతో గెలుపొందింది. యార్కర్ల హీరో అర్షదీప్ సింగ్ (3/19) నిప్పులు చెరిగే ప్రదర్శనతో చెలరేగటంతో కోల్‌కత నైట్‌రైడర్స్ ఓ దశలో 80 పరుగులకే 5 వికెట్లు చేజార్చుకుంది. 192 పరుగుల భారీ ఛేదనలో కోల్‌కత 16 ఓవర్లలో 146/7 పరుగులే చేసింది. ఆ తర్వాత ఎడతెగని వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితాన్ని నిర్ణయించగా.. పంజాబ్ కింగ్స్ 7 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగుల భారీ స్కోరు చేసింది. భానుక రాజపక్స (50, 32 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు), శిఖర్ ధావన్ (40, 29 బంతుల్లో 6 ఫోర్లు) రాణించారు. మూడు వికెట్లతో మెరిసిన అర్షదీప్ సింగ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

అర్షదీప్ అదుర్స్ : యార్కర్ల హీరో అర్షదీప్ సింగ్ (3/19) మూడు వికెట్ల ప్రదర్శనతో చెలరేగాడు. కొత్త బంతితో ఇన్నింగ్స్ రెండో ఓవర్లో మన్‌దీప్ సింగ్ (2), అనుకూల్ రాయ్ (4) వికెట్లను పడగొట్టి కోల్‌కత నడ్డి విరిచాడు. నాథన్ ఎలిస్, సికందర్ రజా, శామ్ కరణ్‌లు సైతం అర్షదీప్‌కు సహకరించటంతో కోల్‌కత వికెట్లు టపటపా పడ్డాయి. ఆ జట్టు 80 పరుగులకే 5 వికెట్లు చేజార్చుకుంది. ఈ పరిస్థితుల్లో వెంకటేశ్ అయ్యర్ (34), ఆండ్రీ రసెల్ (35) కోల్‌కతను ఆదుకున్నారు. కీలక భాగస్వామ్యంతో నైట్‌రైడర్స్‌ను రేసులో నిలిపారు. డెత్ ఓవర్లకు ముందే ఈ ఇద్దరూ డగౌట్‌కు చేరటంతో కోల్‌కతపై ఒత్తిడి పెరిగింది. చివరి 24 బంతుల్లో 46 పరుగులు చేయాల్సిన దశలో వరుణుడు మ్యాచ్‌కు అడ్డు తగిలాడు. ఆట సాగే అవకాశం లేకపోవటంతో అంపైర్లు డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితాన్ని తేల్చారు. బౌలర్ల మెరుపులతో ఆది నుంచి మ్యాచ్‌పై పట్టు బిగించిన పంజాబ్ కింగ్స్ 7 పరుగుల తేడాతో గెలుపొందింది.

సమిష్టి మెరుపులు : తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ భారీ స్కోరు నమోదు చేసింది. జట్టులో ఎవరూ భారీ స్కోరు చేయకపోయినా.. పంజాబ్ బ్యాటర్లు సమిష్టిగా మెరవటంతో 191 పరుగులు సాధ్యమయ్యాయి!. కెప్టెన్ శిఖర్ ధావన్ (40), భానుక రాజపక్స (50) రెండో వికెట్‌కు విలువైన భాగస్వామ్యం నిర్మించారు.భానుక రాజపక్స ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 30 బంతుల్లోనే అర్థ సెంచరీ బాదాడు. అర్థ సెంచరీకి చేరువైన ధావన్ వికెట్ కోల్పోయినా.. ఆ జట్టు దూకుడు తగ్గలేదు. జితేశ్ శర్మ (21), సికిందర్ రజా (16) సహా శామ్ కరణ్ (26 నాటౌట్, 17 బంతుల్లో 2 సిక్సులు), షారుఖ్ ఖాన్ (11 నాటౌట్, 7 బంతుల్లో 2 ఫోర్లు) ధనాధన్ షో చూపించారు. కోల్‌కత నైట్‌రైడర్స్ బౌలర్లలో టిమ్ సౌథీ (2/54) 54 పరుగులు ఇచ్చినా రెండు వికెట్లు పడగొట్టాడు. సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తి, ఉమేశ్ యాదవ్ తలా ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

స్కోరు వివరాలు :

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్ : ప్రభుసిమ్రన్ (సి) గుర్బాజ్ (బి) సౌథీ 23, ధావన్ (బి) చక్రవర్తి 40, భానుక (సి) రింకూ (బి) ఉమేశ్ 50, జితేశ్ (సి) ఉమేశ్ (బి) సౌథీ 21, రజా (సి) రాణా (బి) నరైన్ 16, శామ్ కరణ్ నాటౌట్ 26, షారుఖ్ నాటౌట్ 11, ఎక్స్‌ట్రాలు : 4, మొత్తం : (20 ఓవర్లలో 5 వికెట్లకు) 191.

వికెట్ల పతనం : 1-23, 2-109, 3-135, 4-143, 5-168.

బౌలింగ్ : ఉమేశ్ 4-0-27-1, సౌథీ 4-0-54-2, నరైన్ 4-0-40-1, చక్రవర్తి 4-0-26-1, ఠాకూర్ 4-0-43-0.

కోల్‌కత నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్ : మన్‌దీప్ (సి) కరణ్ (బి) అర్షదీప్ 2, గుర్బాజ్ (బి) ఎలిస్ 22, అనుకూల్ (సి) రజా (బి) అర్షదీప్ 4, వెంకటేశ్ అయ్యర్ (సి) రాహుల్ (బి) అర్షదీప్ 34, నితీశ్ రాణా (సి) రాహుల్ (బి) రజా 24, రింకూ సింగ్ (సి) రజా (బి) రాహుల్ 4, రసెల్ (సి) రజా (బి) కరణ్ 8, శార్దుల్ నాటౌట్ 8, నరైన్ నాటౌట్ 7, ఎక్స్‌ట్రాలు : 6, మొత్తం : (16 ఓవర్లలో 7 వికెట్లకు) 146.

వికెట్ల పతనం : 1-13, 2-17, 3-29, 4-74, 5-80, 6-130, 7-138.

బౌలింగ్ : శామ్ కరణ్ 3-0-38-1, అర్షదీప్ సింగ్ 3-0-19-3, నాథన్ ఎలిస్ 3-0-27-1, సికిందర్ రజా 3-0-25-1, రిషి ధావన్ 1-0-15-0, రాహుల్ చాహర్ 2-0-12-1, హర్‌ప్రీత్ బరార్ 1-0-7-0.

నవచిత్రం



ఎన్టీఆర్ తన కొత్త చిత్రాన్ని యాక్షన్‌తో షురూ చేశారు. 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత ఎన్టీఆర్ నటిస్తున్న సినిమా మార్చి 31న ఆరంభమైంది. కొరటాల శివ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. హైదరాబాద్‌లోని ఓ ప్యాలెస్‌లో నైట్ ఎఫెక్ట్‌లో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. షూటింగ్ మొదలు పెట్టిన విషయాన్ని ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా తన అభిమానులతో షేర్ చేసుకున్నారు. 'కొరటాల శివతో మరోసారి సినిమా సెట్స్‌లో ఉండటం అద్భుతంగా ఉంది' అని వీడియో రూపంలో చెప్పారు. అంతేకాదు వస్తున్నా.. షూట్ బిగిన్స్ అని వీడియోని ఎన్టీఆర్ ఎండ్ చేశారు. ఇది ఎన్టీఆర్ నటిస్తున్న 30వ చిత్రం. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కొసరాజు హరికృష్ణ, సుధాకర్ మిక్కిలినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. 'ఈ సినిమా ఐడియా ఫార్ అక్రాస్ కోస్టల్ ల్యాండ్స్ ఆఫ్ ఇండియా, ఫర్‌గాటెన్ ల్యాండ్స్‌లో సెట్ అయిన కథ ఇది. ఈ కథలో మనుషుల కన్నా ఎక్కువ మృగాలు ఉంటారు. భయమంటే ఏంటో తెలియని వాళ్ళని భయపెట్టే కథానాయకుడి కథే ఈ సినిమా' అని దర్శకుడు కొరటాల శివ ఇప్పటికే కథ గురించి చెప్పిన సంగతి తెలిసిందే.



కొరటాల శివ


ఆగస్ట్ 16.. ఏం జరిగింది?

దర్శకుడు ఏఆర్.మురుగదాస్ సమర్పణలో గౌతమ్ కార్తిక్ హీరోగా ఎన్.ఎస్ పొన్‌కుమార్ దర్శకత్వంలో రూపొందిన పీరియాడికల్ సినిమా 'ఆగస్టు 16, 1947'. ఏఆర్.మురుగదాస్ ప్రొడక్షన్ బ్యానర్ పై ఏఆర్ మురుగదాస్, ఓం ప్రకాష్ భట్, నర్సిరామ్ చౌదరి భారీ బడ్జెట్, అత్యున్నత నిర్మాణ విలువలతో నిర్మించిన ఈ చిత్రానికి ఆదిత్య జోషి సహ నిర్మాత. నిర్మాత ఎన్వీ ప్రసాద్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఏప్రిల్ 14న ఈ చిత్రం రిలీజ్ కాబోతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకుంది. ఈ సందర్భంగా మురుగదాస్ మాట్లాడుతూ,'ఆగస్టు 16, 1947..ఈ కథ చదువుతున్నపుడు చాలా అద్భుతంగా అనిపించింది. అప్పుడే ఈ సినిమాని నిర్మించాలని నిర్ణయించు కున్నాను. ఇది చాలా స్పెషల్ మూవీ. పీరియాడిక్ ఫిల్మ్ కూడా. ఆగస్టు 15 దేశ చరిత్రలో చాలా ముఖ్యమైన రోజు. ఆగస్టు 14, 15, 16 ఈ మూడు రోజుల్లో ఓ మారుమూల పల్లెలో జరిగే కథ ఇది. చుట్టూ అడవి కొండ మధ్య వున్న ఊరు. అక్కడికి ఒక వార్త చేరటం కష్టం. ఫ్రీడమ్ అంటే భయాన్ని జయించడం. ఆగస్ట్ 15న ఫ్రీడమ్ వచ్చిందని మనందరికీ తెలుసు. కానీ ఆ ఊరు ఇంకా స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే ఉంటుంది. ఓ బ్రిటిష్ అధికారి ఈ వార్తని ఓ కారణం చేత వారికి తెలియకుండా దాచిపెడతాడు. వ్యక్తిగతంగా వారికి ఆగస్ట్ 16న స్వాతంత్ర్యం పొందుతారు. ఆగస్ట్ 16న ఏం జరిగిందనేది చాలా ఉత్కంఠ భరితంగా ఉంటుంది. యాక్షన్, ఎమోషన్స్, లవ్, హ్యూమర్ ఇవన్నీ కలిసిన ఒక అందమైన కథ. ఇది రెగ్యులర్ ఫిల్మ్ కాదు. మీ అందరికీ తప్పకుండా నచ్చుతుంది' అని చెప్పారు. 'నా మనసుకు చాలా దగ్గరైన సినిమా ఇది. ఇంత మంచి ప్రాజెక్ట్‌లో భాగం చేసిన మురుగదాస్‌కి కృతజ్ఞతలు' అని హీరో గౌతమ్ కార్తిక్ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ, 'గతవారం విడుదలైన ట్రైలర్‌కి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఏప్రిల్ 14న సినిమాని థియేటర్‌లో చూసి ఆదరించండి' అని తెలిపారు.



మురుగదాస్

ప్రాథమిక దశలోనే ఉంది..



అల్లుఅర్జున్

రజనీకాంత్‌తో చేసిన 'దర్బార్' తర్వాత మురుగదాస్ ఇప్పటి వరకు ఏ చిత్రానికీ దర్శకత్వం వహించలేదు. అయితే అల్లుఅర్జున్‌తో సినిమా ఉంటుందనే వార్తలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. అవి నిజమా కాదా అని మురుగదాస్ శనివారం మీడియాకి క్లారిటీ ఇచ్చారు. అల్లుఅర్జున్‌తో సినిమా ఉంటుంది. అయితే అది ఇప్పుడు ప్రాథమిక దశలో మాత్రమే. దీని గురించి ఎక్కువ చెప్పే అవకాశం ఇప్పుడు లేదు అని తెలిపారు.

తూచ్..

మంచు విష్ణు, మంచు మనోజ్ ఇద్దరి మధ్య గొడవలు ఉండటంతో, మనోజ్‌కి సంబంధించిన బంధువు ఇంటికెళ్ళి విష్ణు గొడవ చేశాడు. దీన్ని వీడియోగా తీసి



మంచు విష్ణు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, మా అన్న విష్ణు ఎప్పుడూ ఇంతే.. ఇళ్ళకి వెళ్ళి గొడవలు పడుతుంటాడు అని పేర్కొన్నాడు. దీంతో మంచు ఫ్యామిలీలో అన్నదమ్ముల మధ్య గొడవలు తారా స్థాయికి వెళ్ళాయని మీడియా రకరకాల కథనాలను చూపించింది. అయితే ఇదంతా తూచ్.. అని, 'హౌస్ ఆఫ్ మంచస్' పేరుతో తాము చేస్తున్న రియాలిటీ షోకి సంబంధించిన వీడియో అని మంచు విష్ణు ఇదే సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశాడు. ఇది చూసిన నెటిజన్లు వామ్మో.. ఇదేం పబ్లిసిటీరా బాబు.. మంచు ఫ్యామిలీనా మజాకా..' అంటూ వ్యంగ్యంగా కామెంట్లు చేస్తున్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు దొంగలా..?

'దసరా'లో ఆ సన్నివేశాన్ని తొలగించి.. క్షమాపణలు చెప్పాలి

'అంగన్‌వాడీ టీచర్లను, కార్యకర్తలను దొంగలుగా చిత్రీకరించి అవమానిస్తారా..?, ఈ రకమైన సన్నివేశాలను 'దసరా' సినిమా నుంచి తొలగించాలి. లేకపోతే ఆందోళలను మరింత ఉధృతం చేస్తాం' అని 'దసరా' చిత్ర బృందంపై ఆదిలాబాద్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సినిమా ప్రదర్శితమవుతున్న థియేటర్ ఎదుట నిరసన చేపట్టారు. 'దసరా' సినిమాలో కీర్తి సురేష్ వెన్నెల అనే పాత్రను పోషించారు. అంగన్ వాడీ టీచర్‌గా నటించారు. ఈ చిత్రంలోని ఓ సన్నివేశంలో ఆమె స్కూల్‌లోని కోడిగుడ్లను దొంగతనం చేసి అమ్ముకుంటున్నట్టు, ఆ గుడ్లను తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు ఇచ్చినట్టు చిత్రీకరించారు. ఈ సన్నివేశంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని థియేటర్ వద్ద ధర్నా చేశారు. ఆ సీన్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. అంతేకాదు చిత్ర బృందం క్షమాపణలు చెప్పాలన్నారు. సన్నివేశాన్ని తొలగించకపోతే సినిమాను ప్రదర్శిస్తున్న థియేటర్స్ వద్ద నిరసనకు దిగుతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ హెచ్చరించారు. కోడిగుడ్లను, కూరగాయలను దొంగతనం చేసే దొంగలుగా అంగన్‌వాడీలను చిత్రీకరించారు. ఇది సమాజంలో అంగన్‌వాడీల ప్రతిష్టను దిగజార్చే విధంగా ఈ సినిమాలో ఉంది. తెలంగాణ అంగన్‌వాడీలను, హెల్పర్స్‌ను అవమాన పరిచేలా ఉన్న సన్నివేశాలను తొలగించాలి. లేనిపక్షంలో తమ నిరసనని మరింత ఉధృతం చేస్తామని కిరణ్ చెప్పారు.

హలో మీరా రిలీజ్‌కి రెడీ

సినిమా అంటే ఎన్నో రకాలు పాత్రలు, ఎన్నో విభిన్న కారెక్టర్లుంటాయి. అలా ఉంటేనే సినిమాను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారని, రెండున్నర గంటలు ఎంటర్టైన్ చేయవచ్చు అని అంతా అనుకుంటారు. కానీ పరిమితమైన పాత్రలతోనూ అద్భుతాలు చేయవచ్చని ఇప్పటికే ఎన్నోసార్లు నిరూపితమైంది. ఇదే కోవలో ఇప్పుడు తెలుగులో మరో ప్రయత్నంగా గార్గేయి యల్లాప్రగడ ప్రధాన పాత్రలో 'హలో మీరా' అనే సినిమా రాబోతోంది. ఒకే ఒక పాత్రతో సినిమాను తెరకెక్కించడం సాహసమనే చెప్పాలి. ఆ సాహసాన్ని 'హలో మీరా' అంటూ ముందుకు తీసుకొస్తున్నారు డైరెక్టర్ కాకర్ల శ్రీనివాసు. ప్రముఖ దర్శకులు బాపుతో పలు సినిమాలకు సహ దర్శకునిగా పనిచేసిన అనుభవంతో ఆయన ఈ సినిమాతో దర్శకుడిగా ప్రేక్షకులకు పరిచయం కాబోతున్నారు.

లూమియర్ సినిమా బ్యానర్‌పై జీవన్ కాకర్ల సమర్పణలో, డా. లక్ష్మణరావు దిక్కల, వరప్రసాదరావు దుంపల, పద్మ కాకర్ల ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన టీజర్, ట్రైలర్, పాటలు, పోస్టర్లు అన్నీ కూడా సోషల్ మీడియాలో ఆడియెన్స్‌ను ఆకట్టుకున్నాయి. దీంతో ఈ సినిమా మీద మంచి బజ్ క్రియేట్ అయ్యింది. అయితే తాజాగా ఈ మూవీకి సంబంధించి ఓ అప్డేట్ వచ్చింది. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సింగిల్ కారెక్టర్‌తో సినిమాను నడిపించడం, ఎక్కడా ఎలాంటి అసభ్యకర సన్నివేశాలు లేకుండా చిత్రీకరించడంపై సెన్సార్ బృందం ప్రశంసలు కురిపించారు. ఈ సినిమాను ఏప్రిల్ 21న విడుదల చేయబోతున్నట్టుగా మేకర్లు ప్రకటించారు. ఇకపై మరింత భిన్నంగా ప్రమోషన్ కార్యక్రమాలు పెంచబోతున్నట్టుగా నిర్మాతలు తెలిపారు.

'నాయిక గార్గేయి యల్లా ప్రగడ నటన, ప్రశాంత్ కొప్పినీడి విజువల్స్, చిన్న సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తాయి. ఇక దర్శకుడు శ్రీనివాసుకాకర్లకు ఈ సినిమాతో మంచి పేరు లభిస్తుంది. అంతేకాకుండా ఆయనకి మరిన్ని అవకాశాలూ వస్తాయి' అని నిర్మాతలు అన్నారు. ఈచిత్రానికి మాటలు : హిరణ్మయి కళ్యాణ్, ఎడిటర్: రాంబాబు మేడికొండ, పాటలు: శ్రీ సాయి కిరణ్, సింగర్స్: సమీరా భరద్వాజ్, దీపక్ బ్లూ, ఆడియోగ్రఫీ: ఎం.గీత గురప్ప.



గార్గేయి యల్లా ప్రగడ

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

అమ్మ

నల్లడి కొండల మధ్య పొడిచేటి
ఎర్రటి తొలి పొద్దు అమ్మ
కొవ్వత్తిలా చీకటి తోవలో
కరిగిపోయే వెలుతురు అమ్మ
కష్ట సుఖాల్లో, మంచి చెడుల్లో
గెలుపోటముల్లో తోడుండి
హృదయంలో ఆశల ఊసుల్ని
పెంచుకున్నప్పుడు
అరచేతిలో భూగోలానిన నిలిపి
విజయ పతాకం ఎగురవేస్తూ
గెలుపు సాధించినప్పుడు
ఆకాశాన్ని గొడుగుగా పట్టేంత
ఆనందహోత్సవ పరవశంతో
అమ్మ కడుపు నిండిపోదా..
ఓటమి ఎదురైనప్పుడు
కన్నీళ్లను తరిమెస్తున్నట్టుగా
ఆ కన్నీటినే కండ్లలో దాచుకుని
తెల్లారే సరికి వాకిట్లో చుక్కల
ముగ్గు అవుతోంది అమ్మ..

అమ్మ లేని బాల్యం మాసిపోతుంది
అమ్మ లేని కౌమారం కరిగిపోతుంది
అమ్మ లేని యవ్వనం గమ్యం లేని
ప్రయత్నంలా మొదలవుతుంది
అమ్మ లేని జీవితం మోడుబారిని వృద్ధాప్యం
నే వేసే ప్రతీ అడుగు అమ్మనే
నే చూసే ప్రతీ చూపు అమ్మనే
ఆకాశమంతా ప్రేమకు
నిదర్శనం అమ్మ
సాక్షాత్తు మా అమ్మ..



- ఆకునమోని రచన

బల్గం

అప్పుడప్పుడు మనిషికి
బాధలు రావాలె
అప్పుడే మనల్ని ఓదార్చే వాళ్ళు ఎవరో
ఒగలమాటలు మాట్లాడేది ఎవరో
మనకు తెలిసొస్తది.

జీవితంలో
ఎప్పుడైన ఆసుపత్రిలో పడేటంతటి
రోగమొకటి
ఖచ్చితంగా వచ్చి తీరితేనే కదా..

నీ దగ్గరకు పరామర్శకు వచ్చేవాడు ఎవడు
పండ్లు తెచ్చేది
పైసలు తీసుకవచ్చేది ఎవడు
ఊరి నుంచి సద్దికట్టుకొచ్చేది ఎవడో తెలిసేది.

నీవు ఓటమిపాలై
నాల్గు బాటలకాడ తలెత్తుకొనిలేని కష్టం వస్తేనే
నీకు ధైర్యం నూరిపోసేవాడెవడు
నిన్ను మల్లీ కొత్తగా
ఈ ప్రపంచానికి పరిచయం చేసేవాడెవడో తెలిసేది.



ఎప్పుడైన
దుఃఖం దిగమింగలేని రోజుకటి వస్తుంది
ఆ రోజున
నీ చెయ్యిపట్టుకొని నడిసేవాడెవడో
నీ గుండెమీద
తల ఆనిచ్చి ఏడ్చి ఓదార్చే వారెవరో తెలిసేది.

ఈ కడగండ్ల బత్కులో
అలుపిల్లలు ఉపాసముండి
ఉన్న కొంద్రాపాలం ఊరి సౌకారికి తాకట్టుపెట్టి
కట్టుబట్టలతో కానరాని దేశానికి
పయనమైనప్పుడే తెలిసేది.

ఊరి ఇడిసి పోవద్దురా
ఉన్న ఎకరలో నీకు సగం రాసిస్తా అనీ ధైర్యమిచ్చే
ఆత్మీయుడెవడో బయటపడేది.


నీవు చెరువంత బాధల నడుమ
చెట్టుకు పగ్గమేసి ఉరేసుకొని
సావలనుకున్నప్పుడే కదా తెలిసేది
నీకు పట్టెడన్నంబెట్టి ఎదమీద చెయ్యేసి
నీకు నేనున్నానని
పలికే గుండెనిబ్బరం ఇచ్చేది ఎవడనీ.!

నీవు పడిపోతేనే కదా
నీ అంతరాత్మకు అర్థమయ్యేది
నీవు పడినందుకు పండ్లికిలించి నవ్వేది ఎవడు
కండ్లు చెమ్మగిల్లిపోయి ఏడ్చేది ఎవడో తెలిసేది.

నీవు ఓడిపోతేనే తెలిసేది
నీ వాడెవడు
పరాయివాడెవడు
నీ మిత్రుడెవడు
నీ శత్రువు ఎవడో తెలిసేది.

ఇంట్ల ఎవరైన కాలమైనప్పుడే
తెలిసేది
ఆ మనిషి చుట్టూ అల్లుకున్న అనుబంధాలు
ఆ మనిషికున్న బలమెంత బలగమెంతనోననీ..

- అవనిశ్రీ, 9985419424





సహజంగా మనిషి కళాకారుడు. ప్రేమికుడు. తనకు ఇష్టమైన నడకల్లో ఎన్నో నేర్చుకుంటాడు. ఎన్నింటినో తనలోకి ఒంపుకుంటాడు. వాటిని ఎంత ప్రేమిస్తాడో అంతే కదిలిస్తాడు. ఎన్నో నైపుణ్యాలు ఉన్న మనుషులు కొందరే ఉంటారు. అటువంటి కోవకు చెందిన యువకుడు ధర్పల్లి సాయి. కవిత్వం, పెయింటింగ్, పాటలు, ఫోటోగ్రఫీలతో ఇలా తనదైన తన చుట్టూ కదిలే జీవితాలకు రంగులద్దుతుంటాడు. అక్షరాలను కుప్పబోసి ఆకలి గురించి మాట్లాడుతాడు. ఆకలి కడుపుల్ని తన్నే అన్యాయంపై అరుస్తాడు. అంతరించి పోతున్న మానవ జీవనంలోని వస్తువులకు రంగుల్ని పులుముతాడు. జన జీవనంలో సహజమైన దశ్యాలను తనలో పదిల పరుచుకుంటాడు. మనిషితరుపున గొంత్తెత్తి పాట అవుతాడు. చరణాలు చరణాలుగా మనిషికోసం తపిస్తుంటాడు.



గ్రామీణ జీవితాలకు
రంగులద్దుతున్న యువకుడు...



- పేర్ల రాము, 9642570294

ధర్పల్లి సాయి కుమార్ నిజామాబాద్ జిల్లాలోని ధర్పల్లి మండలం, గ్రామంలో 1992 జూన్ 2న ధర్పల్లి సాయిలు, గంగవ్వ దంపతులకు జన్మించిచాడు. కన్న ఊరుపై మమకారంతో ఊరు పేరును ఇంటిపేరుగా మార్చుకున్నాడు. బాల్యం ఊరిలోనే గడిచింది. అదే ఊరిలో పదవ తరగతి, ధర్పల్లి జూనియర్ కళాశాలలో ఇంటర్ చేశాడు. డిగ్రీ, పీజీ గిరాజ్ పల్లిలో పూర్తిచేశాడు.

కలర్ ఫుల్ రూపాలు..

బడికి వెళ్తున్న వయసులోనే పెయింటింగ్‌ను ఇష్టపడ్డాడు. అప్పటి నుండి సాధన చేస్తూ తనదైన శైలిలో అద్భుతమైన పెయింటింగ్స్ వేస్తున్నాడు. వాటితో కనుమరుగవుతున్న జీవన విధానాలను చూపుతున్నాడు. చేతి వృత్తులు, శ్రమ జీవులు, ఇసురురాయి, బతుకమ్మ, ఒగ్గుకథ చెప్పే విధానం, బావి నీళ్ళు చేదుకోవడం, ఇంటి గడపకు బొట్లు పెట్టడం, బోనమెత్తుకొని ఊగడం, వంటి వివిధ జానపద కళాకారుల, శ్రమజీవుల కదలికలకు కలర్‌ఫుల్ రూపాలను కండ్ల ముందు ఉంచుతాడు. తెలంగాణ సంస్కృతి, సహజమైన జీవనంలో మనం కోల్పోతున్న వస్తువులను తన కళ ద్వారా రికార్డు చేస్తూ రంగులద్ది సమాజానికి అందిస్తున్నాడు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జరుగుతున్న దోపిడీ, అన్యాయం, పేదరికం ఎన్నో విషయాలను ఆకట్టుకునేలా బొమ్మలు కూడా వేశాడు. ఈ కాలంలో తన మిత్రులు సిరిసిల్లా గఫూర్ శిక్షక్, చాట్ల ప్రాణీత్, ముక్కెర విజయ్, సాయి లావోలు వంటి మిత్రులు అందించిన ప్రోత్సాహం ఎప్పటికీ మర్చిపోలేనని గుర్తు చేసుకున్నాడు.



అతడొక అక్షర క్షిపణి..

ఇంటర్మీడియట్ నుంచే పెయింటింగ్స్, బొమ్మలతో పాటుగా సమాజాన్ని పట్టిపీడుస్తున్న సమస్యలపై కవిత్వమై ప్రతిధ్వనించాడు. వ్యవస్థను అర్థం చేసుకోవడానికి దృశ్యాలు ఎంత అవసరమో అక్షరాలు కూడా అంతే అవసరం. అందుకే కవిత్వం తనలోకి ఒంపుకున్నాడు. తన లోలోపల మెదిలిన కోపం, దు:ఖం, వ్యవస్థ నలు రూపాలను చిన్న చిన్న మినీ కవితల ద్వారా చూపించాడు. అయితే ఒక పరిశీలనాత్మకంగా చూస్తే నిజానికి మనకు చిత్రాలు, కవిత్వం రెండు కలిపి 'రక్తరేఖ' అలిశెట్టి ప్రభాకర్ కవిత్వ పుస్తకంలా కనిపిస్తుంది. అక్కడక్కడ పాత పుస్తకాలను వెతికితే అద్భుతమైన చిత్రాలు కవితతో పాటుగా కనిపిస్తాయి. ప్రస్తుత కాలంలో అక్బర్ లాంటి వాళ్ళు పుస్తకాలలో కవితలకు బొమ్మలేస్తున్నారు. ఆ వారసత్వం కొనసాగిస్తున్న వాళ్ళలో సాయి తన కవితలకు తానే స్వయంగా బొమ్మలేసుకొని "అక్షర క్షిపణి" పుస్తకాన్ని తీసుకొచ్చాడు. దీనిలో సమాజంలో ఉన్న అసమానతలు, అన్యాయాలను చూపెట్టారు. చిత్రాలతో కవిత్వంగా రాయగలిగితే చాలా సులువుగా చెప్పాలనుకున్న విషయం అర్థమవుతుందని ఈ కోణాన్ని ఎంచుకున్నట్లు చెపుతున్నాడు. దాని వల్లనే ఈ చిత్ర కవిత్వం ప్రారంభించాను అంటున్నాడు.

మినీ కవితలో అభివృద్ధి గురించి చెప్తూ ఆకలినే తెలుసుకోలేని అభివృద్ధి అంటున్నాడు.

అంతరిక్షంలోకి
అవలీలగా అగ్రరాజ్యాలు
అడుగు పెడుతున్నా
ఆకలి కడుపుల్లో అర్తనాధాల్ని మాత్రం
కనిపెట్టలేక పోతున్నాయి. (టెక్నాలజీ)

ధర్పల్లి దరువు..

సాయిపెయింటింగ్‌కో, కవిత్వంకో పరిమితమై ఆగిపోలేదు. పాటై పల్లవించాడు. జానపదమై కదిలించాడు. వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్ళి క్రమంలో యూట్యూబ్ ఛానల్ పెట్టాడు. కవిత్వం, పెయింటింగ్స్ ద్వారా చెప్పాలనుకున్న విషయాలను మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం పాటను ఎత్తుకున్నాడు. ఈ పాటల్ని రాయడానికి పల్లె సంస్కృతి సంప్రదాయాలు వాటి మూలాలను అధ్యయనం చేస్తూ అనేక జాతుల అస్తిత్వాలను అన్వేషిస్తూ వారి చరిత్రను బయట పెడుతున్నాడు. ఇప్పటివరకు తెలంగాణ సమాజంలో కొన్ని వందల జానపద కళలు గ్రామీణ జీవన కళలు కనుమరుగై పోయాయి. వాటిని పాటల రూపంలో బయటకు తెచ్చేందుకు పరితపిస్తున్నాడు. అట్లాగే పల్లె మూలాలను ప్రపంచీకరణ దోపిడీని దేశంలో నెలకొన్న సామాజిక పరిస్థితుల్ని అధ్యయనం చేస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దోపిడీని, అవి అనుసరిస్తున్న విధానాలపై కై కడుతూ, పాటలతో ప్రజల్ని చైతన్య పరుస్తున్నాడు. ఈ క్రమంలో దాదాపు 200 పాటల దాకా రాశాడు. వీటిల్లో 20 పాటల దాకా తన యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేశాడు.





తనను కన్న ఊరిని తలుచుకుంటూ ఊరు అందాలను చెరువును, కట్ట, గుట్ట తాటికల్లు, ఊరి నలుమూలలను ప్రేమను 'ఎన్నెన్ని అందాల పచ్చని తల్లి.. నను కన్న నా ఊరు ధర్పల్లి' అని రాసుకున్నాడు.

'పల్లె రూపం నువ్వు పారేటి ఏరువు
సలువ నీడవు నీవు మండేటి పొద్దువు గంగవ్వ'

అంటూ తల్లిని గంగవ్వలాంటి ఎందరో పల్లె తల్లుల శ్రమను, ప్రేమను, దు:ఖాన్ని చరణాలుగా రాసుకున్నారు. పాట గురించి పాట రాస్తూ



"పల్లెతల్లి
పొత్తిళ్ళల్లో
పాటవయినావు
ప్రజల వెంట నడిచి
నీవు ఉద్యమించినావు
గాయపడ్డ పాట
నీకు వందనం
తిరగబడ్డ పాట
నీకు వందనం" అంటూ

పాట రూపాన్ని, పాట మీద ఉన్న మమకారాన్ని ప్రేమతో పాట రూపం ఇచ్చాడు. వీటితో పాటుగా పూల సింగడి బతుకమ్మ, ఆకలి కడుపుతో అడగవే, అరేసి ఋతువులు అంటూ తన ఛానల్‌లో పాటు రాస్తున్నాడు. ఇంకా రికార్డు చేయాల్సిన పాటలు చాలనే ఉన్నాయి.

గతేడాది ఆగస్టు 24 నుంచి ఆగస్టు 29 వరకు సిరిసిల్లా సిపిఐ కార్యాలయంలో ఫొటోగ్రఫీ, పెయింటింగ్స్ ప్రదర్శనను ప్రముఖ కవి జూకంటి జగన్నాథం ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలోచింపజేసింది.

తెలంగాణ జీవనమే.. అతడి ఫోటోగ్రఫీ

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను, ఆచారాలను, బొట్టు నుంచి బోనం దాకా మట్టి నుంచి మాగాని దాకా కాపాడాలన్న ఉద్దేశంతో తెలంగాణ జీవన విధానం మీద ఫోటోగ్రఫీ చేశాడు. వత్తుల్ని పండుగలని, తెలంగాణ తల్లుల కట్టుబొట్టును తన కెమరాతో ప్రపంచానికి తెలియజేశాడు. సాయి కుమార్ ఫోటోగ్రఫీలో పల్లె మూలాలు ఎన్నో ప్రతిబింబిస్తాయి. ఎన్నెన్నో వత్తులు స్పర్శతో ఆకట్టుకుంటాయి. బతుకమ్మ ఉత్సవాలు, పల్లె జీవన విధానం, ఇసిరేలు, పాడిపంటలు పల్లె అందాలు కనువిందు చేస్తాయి.



ఆస్కార్ గిఫ్ట్ బ్యాగ్

95 ఏండ్లుగా క్రమం తప్పకుండా ఆస్కార్ అకాడమీ ఇస్తున్న ఆస్కార్ అవార్డు అందుకున్న వారు దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా సెలెబ్రెటీలై పోతున్నారు. ప్రతి ఏటా జరిగే ఈ ఆస్కార్ అవార్డుల వేడుకలో అతి కొద్ది మందికే దక్కుతాయి. అయితే ఈ అవార్డులు రానివారికి కూడ ఆస్కార్ అవార్డుల కమిటీ ఇచ్చే కిట్ గురించి తెలిస్తే ఎవరైనా షాక్ అవుతారు.

ఆస్కార్‌కు నామినేట్ అయిన వ్యక్తులు అందరికీ లక్షా26వేల డాలర్స్ అంటే దాదాపు కోటి మూడు లక్షల రూపాయలు విలువైన ఆస్కార్ కిట్ బ్యాగ్ ఇస్తారు. అందులో జపనీస్ మిల్క్ బ్రెడ్, బిస్కెట్ ప్యాకెట్ కూడ ఉంటుందట. ఈ రెండు మినహా మిగతావి అవేవి తినే వస్తువులు కాదు.

ఇటలీకి చెందిన ఓ ప్రయివేట్ లైట్‌హౌజ్‌లో 8 మందితో కలిసి 3రోజులు గడిపేందుకు వీలుగా కొన్ని గిఫ్ట్ కూపన్స్ కూడ ఇందులో పెడతారు. అత్యంత విలాస వంతమైన ఈ లైట్‌హౌస్‌లో కేవలం సెలెబ్రెటీ లకు మాత్రమే అనుమతి ఉంటుంది. దీనితోపాటు కెనడాలోని 10 ఎకరాల సువిశాలమైన ఎస్టేట్ లో స్టే చేసే అవకాశం కూడా కల్పిస్తారట. రోజుకు 40వేల డాలర్ల ఖరీదు చేసే ఈ ఎస్టేట్ లో బాగా అత్యంత ధనవంతులు మాత్రమే హాలిడే ట్రిప్ ను ఎంజాయ్ చేస్తూ ఉంటారు.

వీటితో పాటు ఆస్ట్రేలియా లోని ఒక ప్రముఖ నగరంలో అత్యంత ఖరీదైన ఒక ఫ్లాట్‌ను గిఫ్ట్ గా ఇస్తారు. దీనితోపాటు ఈ ఈవెంట్ కు డెలిగేట్ గా వచ్చిన వారందరికీ కాస్మోటిక్ సర్జరీ కోసం 41వేల డాలర్లు యిస్తారు. ఇలా దాదాపు 60 బహుమతులతో కూడిన ఈ కిట్ కోటి రూపాయల విలువ ఉంటుందని అంచనా. అయితే ఇక్కడ ఒక ట్విస్ట్ ఉంది. ఈ కిట్ బ్యాగ్ ఆస్కార్ అవార్డులు వచ్చిన వారికి ఇవ్వరు. ఆస్కార్ అవార్డులు రానివారికి మాత్రమే ఇస్తారు. ఇప్పుడు ఈవిషయానికి సంబంధించి సోషల్ మీడియాలో హడావిడి చేస్తున్న ఆస్కార్ కిట్ అవార్డుల వార్తలు అందరికీ బాగా ఆశక్తిని కలిగిస్తున్నాయి.





అబద్ధాల బర్సాత్..

ప్రతినిత్యం అబద్ధం
అధికార అంబారీనెక్కి
శహేర్ గల్లీల్లో సైర్ చేస్తే
నిజం నిలకడ మీదే ఓ మూలకు నిలబడి
నేటి సమాజాన్ని బిత్తరపోయి చూస్తుంది..

అన్యాయాల బరాత్‌లో
నిజం నగ్నంగా ఊరేగించబడితే
అబద్ధాల బర్సాత్ లో
అది తడిసి ముద్దౌతుంది..

గుంటనక్కల గూడుపుఠాణీలో
తోడేళ్ల మన్మానీ నడుస్తుంది
అదే సర్వస్వమై అధికారం చెలాయిస్తుంది
కల్లబొల్లి మాటలతో, తొండి ఆటలతో
మొండిగా ప్రవర్తిస్తుంది

పొద్దునే అబద్ధాల అద్దంలో
తనను తాను చూసి మురిసిపోతుంది
సాయంత్రం సొగిలపడి
చుట్టూ మూగినవారిని చూసి
ఇదే నిజమని భ్రమపడ్తుంది

కాలం సాత్ దారీ ఇచ్చి
గద్దెనెక్కిస్తే అధికారమిద్దెనెక్కి
పూరి గుడిసెల్ని నేలమట్టం చేస్తుంది..
ఎదురు మాట్లాడినోళ్లను బెదిరిస్తుంది..

ఎపుడో ఒకప్పుడు అధికార అద్దె ఇల్లు
ఖాళీ చేసి సొంతింటికి చేరుకోవాల్సిందే
నూకలు చెల్లిన రోజు
మట్టింటితో ములాఖత్ చేయాల్సిందే

ఆత్మీయ చుట్టంలా మారి
పట్టంగట్టిన కాలమే
చూసి చూసి ఎపుడోసారి



నేలమట్టం చేస్తుంది

నిజాన్ని తిరిగి నిలబెట్టనీకి
ఎంతో దూరం లేదు
హిసాబ్ బరాబర్ చేయనీకి
అదే కాలం ఎక్కువ సమయం తీసుకోదు..

- సర్ఫరాజ్ అన్వర్, 9440981198